www.jagritiweekly.com

సంపుటి : 75 సంచిక : 40 పుటలు : 52

జాగృతి

కలి 5125 - శ్రీ శోభకృత్ అధిక శ్రావణ షష్ఠి

24-30 జూలై 2023

వెల : ₹20/-

తునికి... మరల మన సేద్యానికి!

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

కన్వారియాల సందోహం

శ్రావణమాసంలో పరమ శివుడికి ప్రత్యేకంగా జరిపే అభిషేకోత్సవమే కన్వార్ యాత్ర. ఈ సంవత్సరం జూలై 4న మొదలైన కన్వార్ యాత్ర జూలై 15న ముగిసింది. ఇందులో పాల్గొనే భక్తులను కన్వారియాలు అంటారు. ఈ యాత్ర, దీని అంతిమ లక్ష్యమైన జలాభిషేకంలో గొప్ప ప్రత్యేకత ఉన్నది. హృషీకేశ్, హరిద్వార్, గంగోత్రి, గోముఖతీరాలనుంచి గంగాజలం పట్టుకుని వస్తారు. త్రయోదశినాడు శివుడికి అభిషేకం చేస్తారు. హిందూ పురాణాల ప్రకారం ఈ యాత్రను శివుడి పరమభక్తుడు పరశురాముడు ప్రారంభించాడు. కొంతకాలం ప్రాముఖ్యం కోల్పోయినా 1960 నుంచి మళ్లీ ఈ యాత్రకు పునర్ వైభవం వచ్చింది. ఇందులో పురుషులే కాదు మహిళలు కూడా పాల్గొంటారు.

కన్వార్ అంటే కావడి. రెండు వైపుల కుండలలో గంగాజలం నింపుకుని వస్తారు. కేవలం కాలినడకనే ఈ యాత్ర జరుగుతుంది. కొందరు పాదరక్షలు కూడా వేసుకోరు. పైగా ఈ యాత్రలో ఎక్కడా ఆ కుండలను నేల మీద ఉంచకూడదన్న నియమం ఉంది. ఓం నమశ్శివాయ, ఓం త్ర్యంబకం యజామహే సుగంధిమ్ పుష్టివర్ధనమ్ వంటి మంత్రాలు జపిస్తూ, కాషాయ దుస్తులు ధరించి భక్తులు యాత్రలో పాల్గొంటారు. ఈ సంవత్సరం యాత్రలో 15 నుంచి 20 లక్షల మంది భక్తులు పాల్గొన్నారని అంచనా. వీరంతా గంగాజలం తీసుకువెళ్లి తమ తమ గ్రామాలలోని ఆలయాలలో, కొందరు ఇళ్లలోని పూజామందిరాలలో శివునికి అభిషేకం చేస్తారు. వీరి కోసం దారంతా దాతలు ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు. పెద్ద పుణ్య క్షేత్రాలన్నీ ఈ జూలై 15న కన్వారియాలతో కిక్కిరిసిపోయాయి.

కన్వారియాలతో నిండిపోయిన హరిద్వార్

శివుడికి ఇష్టమైన క్షేత్రం

హిమాలయాలలో చార్‌ధామ్‌గా ప్రసిద్ధమైన క్షేత్రాలలో (కేదార్‌నాథ్, బదరీనాథ్, గంగోత్రి, యమునోత్రి) కేదార్‌నాథ్ దేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటి. ఉత్తరాఖండ్ రాష్ట్రం రుద్రప్రయాగకు సుమారు 90 కిలోమీటర్ల దూరంలోని ఈ క్షేత్రాన్ని సర్వపాప హారిణిగా చెబుతారు. పార్వతిపై గల ప్రేమతో శరీరంలో సగభాగమిచ్చిన మహేశ్వరుడు ఈ క్షేత్రాన్ని అదే స్థాయిలో ఇష్టపడతాడట. 'ఈ క్షేత్రం నీకంటే ప్రియమైనది. దీనిని ఎన్నడు వీడను' అని మహేశ్వరుడు పార్వతితో అన్నట్లు పురాణ గాథలు. సముద్ర మట్టానికి 11,753 అడుగల ఎత్తున గల ఈ క్షేత్రంలో జగద్గురువు ఆదిశంకరాచార్యులు మందిరాన్ని స్థాపించారు. గర్భాలయంలో 'శివపిండ' అనే శిల శివుడిగా పూజలందుకుంటోంది. ఆలయం చిన్నదే అయినా అద్భుతమైన అందంతో దర్శనమిస్తుంది. దేవాలయం లోపలి భాగం సుందర శిల్పకళాశోభితమై అలరారుతుంటుంది. ఆలయం వెనుక హిమాలయాలు వెండి కొండల్లా కనువిందు చేస్తుంటాయి. కేదార్‌నాథునితో పాటు తుంగనాథ్, మధ్యమహేశ్వర్, కల్పేశ్వర్, రుద్రనాథ్‌లను కలిపి 'పంచ కేదార్'లుగా అర్చిస్తారు. ఈ క్షేత్రం వద్ద అమృత్‌కుండ్, చార్‌వారీ, ఉఉదర్‌కుండ్ అనే అందమైన సరస్సులు ఉన్నాయి.

శీతకాలంలో కేదార్‌ధామం మంచుతో నిండి ఉంటుంది. మే నుంచి అక్టోబర్ వరకు అరుమాసాలే ఆలయం తెరచి ఉంటుంది. అక్కడి హిమశోభను వీక్షించేందుకు మే నెల అత్యంత అనువైనది. ఆలయం మూసి ఉన్న సమయంలో భక్తులు అక్కడికి సుమారు 40 కిలోమీటర్ల దూరంలోని ఊఖీ మఠం వద్ద నిలిచి స్వామి వారిని అర్చిస్తారు. కేదార్‌నాథ్ వెళ్లేందుకు ముందుగా గౌరీకుండ్ అనే గ్రామానికి చేరి, అక్కడి నుంచి సుమారు 15 కిలోమీటర్లు కాలినడకన కానీ, గుర్రాలపై కానీ, డోలీపై కానీ ప్రయాణించాలి. 'జై కేదార్‌నాథ్..' నినాదంతో భక్తులు ముందుకు సాగుతుంటారు. అవకాశం ఉన్నంత వరకు జీవితంలో ఒక్కసారైనా కేదార్‌నాథుని దర్శించుకోవాలని ప్రతి హిందువు అభిలషిస్తాడు. వారి ఆకాంక్ష సాకారం కావాలని కేదారేశ్వరుడిని ప్రార్థిద్దాం.

(క్షేత్ర దర్శన దివ్యానుభూతి 34వ పుటలో)



Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. And published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

Editor : Dr. Goparaju Narayana Rao.

సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య) సంప్రదించండి.

జి. తుకారాం సర్క్యులేషన్ మేనేజర్ 040-27561453/9959997013

జాగృతి చందా – సూచనలు

5 సం॥ల చందా రూ.4000, సంవత్సర చందా రూ.850, విడి ప్రతి రూ.20

- అడ్రసులో పేరు, ఇంటి నెం., గ్రామం, మండలం, జిల్లా, పిన్‌కోడ్, మొబైల్ నెం. సమగ్రంగా ఉండాలి. లేకుంటే కంప్యూటర్ ఆమోదించదు.
- తాత్కాలిక రసీదు చేరిన 15 రోజుల తర్వాత చందా నెం., ప్రారంభ తేది వివరాలు మీకు ఎస్.ఎం.ఎస్. చేస్తాం. ఆ వెంటనే సంచిక కూడా అందుతుంది. మీరు చందా నెం. నోట్ చేసుకోవాలి.
- పత్రిక అందకపోతే వెంటనే సంప్రదించగలరు. చిరునామా మారితే కార్యాలయానికి విధిగా తెలపండి.

చందా కట్టించే వారికి సూచనలు :

- చందాలు వసూలు చేసి పంపేవారు తమ పూర్తిపేరు, సెల్ నెం. రాయాలి.
- రశీదుపై చందాదారుని పూర్తి చిరునామా, పిన్‌కోడ్, సెల్ నెం., ఈమెయిల్ ఉండాలి. వివరాలు jagritiweeklysub@gmail.comకు మెయిల్ చేయాలి.
- ఆన్‌లైన్/చెక్ ద్వారా కూడా చెల్లించవచ్చు. డబ్బు పంపాక 040-27561453/ 9959997013 నంబర్లకు తెలియజేయాలి.
- మరిన్ని వివరాలకు చందాపుస్తకంలో మొదటి రసీదు వెనుక చూడగలరు.

చందా పంపవలసిన చిరునామా :

- 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-500 027.

జాగృతి బ్యాంకు ఖాతా వివరాలు :

- **A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch. IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**
- **చెక్కు, డిడిపై Jagriti Prakashan Trust అని ఆంగ్లంలో రాయాలి.**

సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య)

కె. దుర్గారెడ్డి	అసోసియేట్ ఎడిటర్
సబ్ ఎడిటర్	**9959991304**

డిజైనర్ : సిహెచ్. కుమార్

ప్రాణం ఎవరిదైనా విలువైనదే. కానీ కొన్ని నిప్పులాంటి నిత్యసత్యాలకు కూడా చెదలు పట్టిస్తున్నారు. ఈ చెదపురుగుల పాత్ర పోషిస్తున్నవారే ఈ దేశంలోని మేధావులు, కొన్ని కొన్ని ప్రజా సంఘాల నేతలు. ఈ విధ్వంసానికి కాంగ్రెస్ తన వంతు సాయం ఎప్పుడూ అందిస్తూనే ఉంటుంది. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువైన కొన్ని వారాలలోనే.. జూలై 6-8 మధ్య జరిగిన ఒక జైనముని హత్య, రెండు రోజుల తరువాత జరిగిన యువ బ్రిగేడ్ కార్యకర్త వేణుగోపాల్ నాయక్ హత్య ఇదే రుజువు చేస్తున్నాయి. ఒక్క మేధావి నోరెత్తడం లేదు. కర్ణాటక ప్రభుత్వం కనీసం స్పందించడం లేదు. జైన ముని (సన్యాసి) దిగంబర ఆచార్య శ్రీకామకుమార నంది మహరాజ్ హత్య కర్ణాటకను కుదుపు తున్నది. ఒక జైన సన్యాసిని ఇంత దారుణంగా చంపడం దేశాన్ని విస్తుపోయేటట్టు చేసినా, ఢిల్లీ వరకు నిరసనలు తాకినా మేధావులు మాత్రం గాఢనిద్రలోనే ఉన్నారు. జైనులూ మైనారిటీలేనన్న సంగతి వీరికి ఎప్పుడూ స్ఫురహలో లేదు. నంది మహరాజ్ శరీర భాగాలు బెలగావి జిల్లాలోని చిక్కోడి తాలూకా, కటకబావి గ్రామంలోని బావిలో కనిపించాయి. ఇది డబ్బు గొడవ అని ప్రభుత్వం తేల్చింది. ఇద్దరిని అరెస్టు చేశారు. కానీ జైన వర్గం కోరినట్టు సీబీఐ దర్యాప్తునకు ముఖ్యమంత్రి అంగీకరించలేదు. నిజమే మరి, ఇది హిందూ వ్యతిరేకి గౌరీ లంకేశ్ హత్య వంటిది కాదు కదా, దేశమంతా కల్లోలం చెలరేగడానికి, రేపడానికి.

అహింస గురించి నిరంతరం బోధించే జైన మునిని ఇంత హింసాత్మకంగా చంపడం దారుణమని విశ్వహిందూ పరిషత్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి మిలింద్ పరాండే అన్నారు. ఇంతకు ముందు ఉన్న బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని చట్టాలతో పాటు గోరక్షణ చట్టాన్ని కూడా తుంగలో తొక్కడానికి కొత్త కాంగ్రెస్ ప్రభుత్వం తొందరపడినప్పటికీ ప్రజాగ్రహం కారణంగా వెనకడుగు వేయవలసి వచ్చింది. ఈ నేపథ్యంలోనే జైన ముని, నాయక్‌ల హత్యలు జరిగాయి.

15 ఏళ్లుగా నివాసం ఉంటున్న నంది పర్వత ఆశ్రమం నుంచి జూలై

శాలివాహన 1945 శ్రీ శోభకృత్ అధిక శ్రావణ షష్ఠి

లోపలి పేజీలలో...



ముఖపత్ర కథనం

తునికి.. మరల మన సేద్యానికి!

6లో

ముఖాముఖి

ఇప్పుడు జరగవలసినది భూ సంరక్షణ పోరాటం

12లో



ధారావాహిక నవల

మహా సంకల్పం

– పి.చంద్రశేఖర ఆజాద్

20లో

జాగృతి

సంపాదకీయం

6న శ్రీకామకుమార్ మహారాజ్ అదృశ్యమయ్యారు. ఈ మేరకు ఆశ్రమ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎనిమిదో తేదీన ఛిద్రమైన జైన ముని శరీర భాగాలు గోనె సంచిలో కనిపించాయి. మరునాడే జైనులు నిరసన కార్యక్రమాలు ఆరంభించారు. 12వ తేదీన ఈ అంశం మీద శాసనసభలో, వెలుపలా కూడా బీజేపీ ఆందోళనకు దిగింది. ఈ కేసులో ఇద్దరిని ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆ ఇద్దరు జైన మునికి లక్షల రూపాయలు బకాయి ఉన్నారని, ఆ ధనం కోసం వత్తిడి తేవడం వల్లనే చంపామని ఆ ఇద్దరు అంగీకరించారని పోలీసులు చెబుతున్నారు. ఆ ఇద్దరు నారాయణ మాలి, హసన్ సాబా మక్బూల్

ఒక రాష్ట్రం... మూడు హత్యలు

దల్యాత్. ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కోరుతూ బీజేపీ సభ్యులు వెల్‌లోకి దూసుకువచ్చారు. జైన ముని హత్యోదంతం తీరు తెన్నులు చూస్తే దీని వెనుక ఐఎస్ఐఎస్ ఉన్నట్టు అనుమానించవలసివస్తున్నదని బీజేపీ ఎమ్మెల్సీ వైఏ నారాయణస్వామి ఆరోపించడం గమనార్హం. జైన ముని హత్య అంశం మీదే జూలై 17 సోమవారం దేశ రాజధానిలో జైనులు పెద్ద సంఖ్యలో నిరసనకు దిగారు. తమకు న్యాయం చేయడంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు అందడం లేదని ఢిల్లీ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న జినేంద్ర కుమార్ జైన్ ఆరోపించడం చాలా సంగతులు వెల్లడిస్తుంది.

జైన ముని హత్య జరిగిన రెండు రోజులకే, అంటే జూలై 10న యువ బ్రిగేడ్ కార్యకర్త వేణుగోపాల్ నాయక్‌ను మైసూరు జిల్లా, టీ నరసీపూర్‌లో కొందరు నరికి చంపేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా వాహనాలు నిలిపే చోట వచ్చిన తగాదా అతని హత్యకు కారణమైందని పోలీసులు చెబుతున్నారు. యువ బ్రిగేడ్‌నే నమో బ్రిగేడ్ అని కూడా పిలుస్తారు. హిందువుల హక్కుల కోసం పోరాడే చక్రవర్తి సలిబేలే నాయకత్వంలో యువ బ్రిగేడ్ పనిచేస్తున్నది. నాయక్‌ను కాంగ్రెస్ కార్యకర్తలు చంపారని సలిబేలే చెబుతుంటే, ఇది రెండు హిందూ సంఘాల మధ్య ఘర్షణగా పోలీసులు చిత్రిస్తున్నారు. పునీత్ రాజ్‌కుమార్ (మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో ఈయన కుటుంబం కాంగ్రెస్‌తో కలసి పనిచేసింది) అభిమానులు ఆయన బొమ్మతో హనుమ ఊరేగింపునకు వచ్చినప్పుడే ఘర్షణ మొదలయింది.

ఇదే సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ఉండగా 2017లో బెంగళూరులోనే గౌరీ లంకేశ్ హత్యకు గురయ్యారు. సిద్ధరామయ్య ప్రభుత్వం ఆ హత్య కేసులో నిందితులను అరెస్టు చేయలేకపోయింది. మధ్య బీజేపీకి ఒకసారి అధికారం వచ్చినా మళ్లీ ఇప్పుడు సిద్ధరామయ్యే ముఖ్యమంత్రి. ఆ కేసేమీ తేలలేదు. అదలా ఉంచితే, గౌరీ లంకేశ్ అనే ఆ జర్నలిస్ట్/మేధావి హత్య పట్ల వెల్లువెత్తిన నిరసనను ఒకసారి గుర్తు చేసుకోవాలి. బీజేపీకి వ్యతిరేకంగా వ్యాసం రాసి కోర్టు చేత చీవాట్లు తిన్న 'ఉదారవాది' గౌరి. ఎవరి ప్రాణాన్నయినా హరించే హక్కు ఎవరికీ లేదని ఆమె హత్య విషయంలో వాదించిన ప్రబుద్ధులంతా ఇప్పుడేమయ్యారు? ఎవరి ప్రాణమైనా విలువైనదే అన్న తిరుగులేని వాస్తవాన్ని అంగీకరిస్తూనే ఈ ప్రశ్న కూడా వేసుకోవాలి. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికీ, దేశంలో మేధావి వర్గానికీ నడుమ అభేదాన్ని చూడవలసి వస్తున్నది. హిందువులు లేదా ముస్లిమేతర మైనారిటీలు ఎవరు హత్యకు గురైనా వీళ్లకి పట్టదు. ముస్లింల ప్రాణాలే విలువైనవి. లేదంటే అర్బన్ నక్సల్స్ ప్రాణాలు విలువైనవిగా కనపడుతున్నాయి. ఇక్కడ పేర్కొన్న మూడు హత్యలు, వాటిపై స్పందనలు గమనించి తమ ప్రాణాల విలువ ఏపాటిదో హిందువులే తెలుసుకోవాలి. అందుకు తగ్గట్టే రాజకీయ, సామాజిక చైతన్యం తెచ్చుకోవాలి. కర్ణాటక ప్రజానీకంతో పాటు, దేశ ప్రజలూ ఇది గమనించాలి. ★

కథ

అనంతవిశ్వాలు

- కర్ణ



24 గంటల విద్యుత్‌పై ప్రభుత్వం ద్వంద్వ వైఖరి! (తెలంగాణ) - 14
బీజేపీలో కొత్త ఉత్సాహం (వేదిక) - 16
భారత్-ఫ్రాన్స్ సంబంధాల్లో కొత్త శకం! (అంతర్జాతీయం) - 24
జయ జయహో రీతూ! (మహిళ) - 28
లడేంగే-ఔర్ మరేంగే (స్వాతంత్ర్య అమృతోత్సవాలు) - 30
పాటల నిండా వెన్నెల.. (ప్రత్యేక వ్యాసం) - 38
భారత క్రికెట్ నయా సంచలనం యశస్వి (క్రీడ) - 43
చౌకబారు ప్రేమకథా చిత్రం బేబీ (సినిమా) - 50

వర్మీ – మామిడితోటలో జీవ రింగుల ద్వారా వానపాముల ఎరువు తయారీ ఏర్పాటు

తునికి...

రసాయనిక ఆయుధాలతో యుద్ధాలు, పారిశ్రామిక వ్యర్థాలు, అధికోత్పత్తుల కోసం పొలాలను కప్పేసిన ఎరువులు, పేలిన అణు కేంద్రాలు... భూమాతను నిలువెల్లా గాయపరిచాయి. పెరుగుతున్న జనాభా అవసరాల కోసం ఆహారోత్పత్తుల పెంపు కోసం ప్రపంచంలో చాలా దేశాలు ప్రయత్నాలు చేశాయి. అందులో భారత్ కూడా ఉంది. తిండిగింజల కొరత తీర్చడానికి ఆనాటి నాయకులు, శాస్త్రవేత్తలు చేపట్టిన ఈ కృషి శంకించదగినది కాదు. కానీ ఈ విషయంలో లోపించిన వారి దూరదృష్టిని అభిశంసించకుండా ఉండలేం. ఈ చర్చ భవిష్యత్తు అనుభవాల కోసమే తప్ప, ఎవరినీ అవమానించడానికి కాదు. భూరక్షణకు జరుగుతున్న కొత్త యజ్ఞంలో అలాంటి ప్రతికూల కోణాలను పరిహరించడానికి మాత్రమే. ఆ పని కృషి విజ్ఞాన కేంద్రాలు ఆరంభించాయి. భారతదేశానికి సంబంధించినంత వరకు హరిత విప్లవం తాత్కాలిక ప్రయోజనాలను విజయవంతంగా నెరవేర్చి, నేల, పర్యావరణాల ఆరోగ్యాల విషయంలో దీర్ఘకాల సమస్యను మిగిల్చిందన్న విమర్శ ఉంది. పొలాలకు నీటి సౌకర్యం కల్పించే అంశం కంటే, ఎరువులతో దిగుబడి పెంచే విధానానికి హరిత విప్లవం ప్రోత్సాహమిచ్చింది. దీని ఫలితం దారుణం. నీటి వసతి సంపూర్ణంగా లేని నేలలో ఎరువులు వేస్తే జరిగేది ఒక్కటే– నేల సారం ధ్వంసమవుతుంది. హరిత విప్లవం ప్రచారం చేసిన ఎరువులు, పురుగుమందుల సేద్యం ఖర్చుతో కూడుకున్నదే కాదు, కొన్ని పంటలకే పరిమితమైనది. అదొక విష వలయం. అధిక దిగుబడికి సంకరజాతి వంగడాలు ఉపయోగించాలి. వీటి రక్షణకు రసాయనిక ఎరువులు, మందులు కావాలి. రెండు పంటలు వచ్చాయి. దిగుబడి విపరీతంగా పెరిగింది. కానీ దాచడానికి గోదాములు లేవు. దీనితో పాటు క్షమార్హం కాని పెద్ద ఆరోపణ– పర్యావరణం మొత్తం కలుషితమైంది. అదృష్టమో, దురదృష్టమో...నీటి వసతికి దూరంగా ఉండిపోయిన 60 శాతం భూమికి హరిత విప్లవం చేరలేదు. 40 శాతం భూమికి పరిమితమైన హరిత విప్లవం మొత్తం వాతావరణాన్ని కలుషితం చేసింది. వరి, గోధుమ పంటల కమతాలే హరిత విప్లవ లక్ష్యాలుగా కనిపించాయి. భారతీయ రైతుల మధ్య అంతరాలను ఆ విప్లవం మరింత పెంచింది.

ఆరంభమైన నాలుగైదేళ్లలోనే రైతుల మీద విపరీతమైన ప్రభావం చూపుతున్న, మంచి ఫలితాలు ఇస్తున్న కృషి విజ్ఞాన కేంద్రాల సేవ ముమ్మాటికీ పరిశీలించదగినదే. దేశమంతటా 730 వరకు ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయి. మెదక్ జిల్లా, కౌడిపల్లి మండలం, తునికి గ్రామంలోని డాక్టర్ రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ నిర్వహిస్తున్న కేంద్రం మనకు సమీపంలో ఉంది. ఇవన్నీ భారత వ్యవసాయ పరిశోధన మండలి మార్గదర్శకత్వంలో నడుస్తాయి. రాష్ట్రంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములవుతాయి. తునికి కేంద్రం మే, 2017లో మొదలయింది. ఈ కేంద్రాల ధ్యేయం సేద్యాన్ని స్వయం ఉపాధిగా, స్వీయ వ్యాపారంగా రూపొందించడం. అంటే రైతులు బాహ్య అవసరాల మీద ఆధారపడడాన్ని తగ్గించడం. నేల సారాన్ని మరింత ధ్వంసం కాకుండా చూసుకుంటూ, రసాయనేతర

మిగతా 11వ పుటలో..

జాగృతి డెస్క్

భూమి గుండ్రంగా ఉందనడం ఎంత సత్యమో, భూగోళ వైశాల్యం ఒక్క అంగుళం కూడా పెరగదన్నదీ అంతే వాస్తవం. కానీ జనాభా పెరుగుతూనే ఉంటుంది. వారి అవసరాలు రోజురోజుకి పెరుగుతాయి. ఆ అవసరాలన్నింటిని తీర్చేది భూమాత. అసంఖ్యాకమైన ఆ అవసరాలను తీర్చుకునే క్రమంలో భూరక్షణ అనే పరమోన్నత ప్రాధాన్యాన్ని మానవాళి దారుణంగా విస్మరించిన సంగతి ఇప్పుడు రుజువయింది. నేల సారాన్ని ధ్వంసం చేయకుండానే, పెరిగిన సాంకేతిక శాస్త్ర పరిజ్ఞానంతో, సంప్రదాయ పద్ధతిని తిరస్కరించకుండానే మానవాళి అవసరాలు తీర్చుకోవలసి ఉంటుందన్న గొప్ప దృక్పథం ఇప్పుడిప్పుడే మనిషి అనుభవానికి వస్తున్నది. కానీ మనిషి అత్యాశతో, అనాలోచిత ధోరణులతో భూమికి ఇప్పటికే ఎనలేని చేటు జరిగిందంటే సత్యదూరం కాదు. పంచభూతాలలో ఒకటి ఈ నేలనే కాదు, గాలి, నీరు, ఆకాశాలను కూడా మనిషి కాలుష్యమనే కాటుకు గురిచేశాడు. దీనిని ఆపడానికి ఎక్కడో అక్కడ, చిన్నదే అయినా ఎంతో అంత ప్రయత్నమైతే మొదలు కావాలి. భూమి వర్తమాన తరాల అవసరాలు తీర్చడానికి మాత్రమే లేదు. కొన్ని వేల ఏళ్ల నుంచి మానవాళి ఈ భూమ్మీద నివసించింది. రేపటి తరాలూ ఇక్కడే జీవించాలి. అందుకే భూమిని రక్షించుకోవాలి. నేలంటే హిందూ తాత్వికతలో ఉన్న సమున్నత భావనను బట్టి అది భారతగడ్డ మీద మొదలు కావడం సముచితం. ఆ ప్రయత్నంలో భాగమే కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కృషి విజ్ఞాన కేంద్రాల స్థాపన. హరిత విప్లవం విస్మరించిన చేదు నిజాలను గుర్తించే సరికొత్త విప్లవం సేంద్రియ వ్యవసాయం. దానికి కేంద్ర బిందువులే కృషి విజ్ఞాన కేంద్రాలు.

మరల మన సేద్యానికి!

ప్లాస్టిక్ మల్చింగ్ విధానం. కూరగాయల సాగులో వాడతారు. ప్లాస్టిక్ గుడ్డను మడుల మీద ట్రాక్టర్లతో బలంగా బిగించి కాల్చిన ఇనుప ఊచతో రంధ్రాలు చేస్తారు. వాటి గుండా నారు లేదా విత్తనాలు వేస్తారు. బిందు సేద్యమే ఉంటుంది. ప్లాస్టిక్ మల్చింగ్‌లో తేమ త్వరగా ఆరదు. మరీ ముఖ్యంగా కూరగాయల సాగులో ప్రధాన సమస్యగా ఉండే కలుపు బెడద ఉండదు.

గ్రామం కోసం మరో

అప్పటికి విద్యుత్తు లేదు. పారిశ్రామిక విప్లవం రాలేదు. కానీ భారత్‌కు స్వయంసేవకత్వం ఉంది. ఆర్థిక సమృద్ధి, స్వావలంబన ఉన్నాయి. శ్రమించే వారి కోసం వ్యవసాయమున్నది. వ్యవసాయం మీద ఆధారపడిన కుటీరపరిశ్రమలు ఉన్నాయి. ఇది ఈ దేశ వాస్తవిక చిత్రం. బ్రిటిష్ వారొచ్చి వ్యవసాయాన్ని దెబ్బకొట్టారు. ఫలితంగా కుటీర పరిశ్రమలు కుంగిపోయాయి. గాంధీజీ ప్రొడక్షన్ బై మాసెస్ అన్నారు. మాస్ ప్రొడక్షన్ కాదు. ఇప్పుడు పారిశ్రామిక రంగం ఏం చేస్తోంది? మాస్ ప్రొడక్షన్ చేసి ప్రచారంతో వినియోగదారుల నెత్తిన రుద్దుతున్నది. సంపదంతా కొద్దిమంది చేతులలోకి చేరుతోంది. కొన్ని దేశాలు ప్రపంచం మొత్తాన్ని అదుపులోకి ఉంచుతున్నాయి. గ్రామాల్లో కష్టపడి, చెమటోడ్చి సంపాదించినదంతా పట్టణాలకు తరలిపోతున్నది. అనివార్యంగా వలసలు ఉంటాయి. గ్రామాలకు ఆర్థిక స్వావలంబన రాదు. ఇదే కొనసాగితే గ్రామాలు ఎప్పటికీ బాగుపడవు. అందుకే ఎప్పటికైనా మళ్లీ మనం వికేంద్రీకరణతో కూడిన ఉత్పత్తుల వైపు మళ్లాలి. ఇందుకు ఒక సోపానమే ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్. ఇది నిర్వహిస్తున్నదే కృషి విజ్ఞాన కేంద్రం. ఆధునిక దృష్టితో, అందరి ప్రయోజనాలు, ప్రయోగదృష్టితో గ్రామాన్ని కేంద్రంగా చేసుకుని దేశ పునర్నిర్మాణం చేయడమే ఈ ఆలోచన వెనుక ఉన్న ఉద్దేశం. నాడు స్వాతంత్ర్యం కోసం సంగ్రామం జరిగితే, నేడు జరుగుతున్న మహా సంగ్రామం గ్రామ వికాసం కోసం.

స్వదేశీ అంటే అర్థం, ఈ దేశంలో తయారైన వస్తువు అనే కాదు. ఈ జిల్లాలో చేసిన ఉత్పత్తులూ ఈ జిల్లా వారూ వాడాలి, పక్క జిల్లా వారూ వాడాలి. అవసరమైనవి పక్క రాష్ట్రం నుంచి తెచ్చుకోవాలి. ఇదీ అసలు స్వదేశీ ఆలోచన. వందేమాతర ఉద్యమ సమయంలో ఉన్న స్వదేశీ భావన తరువాత వచ్చిన స్వదేశీ ఉద్యమాలలో తక్కువ. నాడు మనం చాలా ఉత్పత్తులను గ్రామాల్లో ఉత్పత్తి చేసుకున్నాం. వాటి ఆధారంగా మళ్లీ స్వరాజ్య సమరంలో గాంధీజీ కొన్ని విషయాలు ముందు పెట్టారు. అయితే, గాంధీజీ చేతితో వడికిన ఖాదేయే వాడండి, మిల్ ఖాదీ వద్దన్నారు. దానిని ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు పరమ పూజ్యనీయ డాక్టర్‌జీ అంగీకరించలేదు. ఎందుకంటే మనమే నష్టపోతాం. మిల్లు ఖాదీ అయినప్పటికీ స్వదేశీయే. ఇక్కడ ఉత్పత్తి వికేంద్రీకరణ ప్రధానం. అంటే డిఫెన్స్‌లో మిసైల్ టెక్నాలజీ, విమానాల తయారీ అంశం మాత్రమే కాదు. సబ్బులు, టూత్ పేస్ట్‌లు, నూనె, షాంపు, ఉప్పు, పప్పు ఇవన్నీ. ఫినాయిల్ ఉంది. దాని పరిశ్రమ ఎక్కడో ఉంది. శ్రీకాకుళం జిల్లా గ్రామాలకు రవాణా అవుతుంది. ఆ రవాణాతో రేటు పెరుగుతుంది. అంటే ఏ వస్తువుకైతే రవాణాతో పనిలేదో అది ఈ జిల్లాలో తయారుకావాలి. ఇందుకోసమే ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్‌తో చిన్న ప్రయోగం ప్రారంభించాం. వారు ఫినాయిల్ ఉత్పత్తి చేశారు. కీళ్లనొప్పికి మందు, వాస్‌లీన్ తయారుచేశారు. ఇవన్నీ వికారాబాద్ జిల్లాలోని గ్రామాలలో ఉత్సాహంగా కొంటున్నారు. బట్టల సబ్బులు సహా అన్నీ ఏ రకమైన రసాయనం చుక్క లేకుండా తయారుచేశారు. ఇలా జరగాలి ఉత్పత్తి. ఉత్పత్తికి గ్రామీణ, గిరిజన ప్రాంతంలో దొరికే ముడి వస్తువులను వాడాలి. ఈ ప్రాంత ప్రజలకి డబ్బు అందాలి. ఉత్పత్తిలో గ్రామీణ యువకులు, యువతులు భాగం కావాలి. ఉదాహరణకు, తాండూరు దగ్గర జింగుర్తి గ్రామం. ఇక్కడ కొన్ని ఉత్పత్తులు ఇదే తరహాలో మొదలవుతాయి. ఇందుకోసం 10,15 కిలోమీటర్ల దూరం నుంచి యువకులుగానీ, యువతులుగానీ సైకిళ్ల మీద రావాలి. సాయంత్రం ఇంటికి వెళ్లిపోవాలి. రవాణా ఖర్చు ఉండకూడదు. డీజిల్ వృధా కాదు. కాలుష్యం నివారించవచ్చు. ఇలాంటి ఉత్పత్తిని 2,3 ఏళ్లలో ప్రారంభిస్తాం. తరువాత ఇలాంటి కేంద్రాలు 4,5 జిల్లాలకు విస్తరింపచేస్తారు. బ్రాండ్ ఇదే. ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కావచ్చు, గ్రామభారతి కావచ్చు గో ఆధారిత ఉత్పత్తి సంస్థ, విజయవాడ కావచ్చు, గాయత్రీ పరివార్, రవిశంకర్ గురూజీ... వీళ్లందరు ఇందుకు బాధ్యతలను స్వీకరించాలి. స్వీకరిస్తున్నారు కూడా. ఇది స్వర్థ మాత్రం కాదు. వీటి ధ్యేయం లాభం, లబ్ధి కూడా కావు. పనిచేసే వారికి ఎక్కువ డబ్బు చేరాలి. గ్రామాల్లో వ్యాపారస్తులకు పదిశాతం లాభం రావాలి. సంస్థకు పది శాతం మిగలాలి. వినియోగ దారుడికి కూడా లాభసాటిగా ఉండాలి. ఇలాంటి ఆశయంతో ఇప్పటికి సుమారు 100 వస్తువులు తయారు చేశారు. ఇది ఒక ప్రక్రియ.

రెండో ప్రక్రియ ఎఫ్‌పిఓ (ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్). దీనిమీద ప్రధానమంత్రి విశేష శ్రద్ధ చూపుతున్నారు. ఎఫ్‌పిఓలో డైరెక్టర్స్ ఉంటారు. మొదట రైతు ఉత్పత్తి చేస్తే, దాని మీద వేరేవారు వ్యాపారం చేసేవారు. రైతుకు తగిన ఆదాయం వచ్చేదికాదు. వ్యాపారస్తులకు వెళ్లేది. ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌లో రైతే వ్యాపారం చేయవచ్చు. అందులో డైరెక్టర్లు నిజాయతీపరులు కావాలి. రెండవది వాల్యూ ఎడిషన్ కావాలి. అంటే ధాన్యం అమ్మకూడదు, బియ్యం అమ్మాలి. కందులు అమ్మకూడదు, కందిపప్పు అమ్మాలి.

తునికిలో ఏకలవ్య గ్రామీణ వికాస కేంద్రం నిర్వహిస్తున్న డా॥రామానాయుడు కృషి విజ్ఞాన కేంద్రంలో క్యారెట్ చిప్స్, వంకాయ చిప్స్ తయారు చేశారు. గాలికి పడిపోయిన మామిడికాయలను మామూలుగా రైతులు పారేస్తారు. వాటినే కడిగి అక్కడ చిప్స్ తయారుచేశారు. నష్టపోయామనుకున్న చోట రైతుకు ఆదాయం వస్తున్నది. ఇవన్నీ సామాన్య రైతులకు, రైతు కుటుంబాలకు అందాలి. శాస్త్రవేత్త డాక్టర్ భార్గవి ఇవన్నీ చూస్తారు. ఆ ఎఫ్‌పిఓలో 700 మంది సభ్యులున్నారు. ఈ 700 మంది ద్వారా డైరెక్టర్లు వాల్యూ ఎడిషన్ చేసి మార్కెటింగ్ చేయవచ్చు. ఇదొక మోడల్. దీన్ని విజయవంతం చేయటానికి శాస్త్రజ్ఞులు, మార్కెటింగ్ నిపుణులు, సంస్థలు, ముఖ్యంగా యువతీ, యువకులు దీన్నర్థం చేసుకోవాలి. ముందుకు వెళ్లాలి. ఇదొక భాగం.

రెండవ భాగం-ఇవన్నీ చేస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం బాగా నడవాలంటే పనిచేసే నిజాయతీ

సంగ్రామం

వి. భాగయ్య
ఆర్ఎస్ఎస్ అఖిల భారత కార్యకారిణి సదస్యులు

పరులైన ట్రస్టీలు కావాలి. బయటి కంపెనీలు డైరెక్టర్లకు లక్షలలో ముట్టచెబుతాయి. ఇక్కడ ఆ డబ్బులు రావు. పైగా ఖర్చు. వ్యక్తిగత ప్రయోజనం కోసం కాక, సమాజం కల్యాణం కోసం పనిచేయాలి. కాబట్టి సామాజిక సేవా భావనతో వ్యక్తులు రావాలి. వ్యక్తికి 55 ఏళ్లు నిండిన తరువాత ఇంకా కుటుంబం కోసం పనిచేయకూడదు. బాధ్యతలన్నీ తీరిపోతే సమాజం కోసం పనిచేయాలి. ఉద్యోగం, వ్యాపారం చేస్తున్నవారు కూడా సమయం కేటాయించాలి. వీరంతా కలసి పనిచేయాలి.

ఇలాంటి స్టార్టప్, ఇంక్రిమెంటల్స్ కోసమని ఇపుడు ప్రభుత్వం షెడ్యూల్డు కాస్ట్, షెడ్యూల్డు ట్రైబ్స్ యువతీ యువకులకు కోట్ల రూపాయలు కేటాయిస్తున్నది. వ్యక్తులు నిజాయతీపరులైతే, సామర్థ్యం ద్వారా ముందుకు వెళతారు. ఇపుడు అనేకమంది యువకులు ఏదో ఉద్యోగం చేస్తుంటారు. అలా కాకుండా అగ్రికల్చరల్ బీఎస్సీ పూర్తయినవారు గ్రామాల కోసం ఉద్యోగం చేయాలి. మన పాలిటెక్నిక్ కాలేజీలలో అధ్యాపకులుగా పనిచేయాలి. సిబ్బంది లోటును తీర్చాలి. చాలామంది ఉద్యోగం దొరకలేదంటారు. సంస్థలు మనుషులు దొరకడంలేదంటాయి. వాస్తవం ఏమిటంటే వీళ్లు గ్రామాల్లో ఉండటానికి ఇష్టపడటం లేదు. లక్షలలో జీతం కావాలంటున్నారు. కానీ గ్రామాలలో ఉంటూ, గౌరవప్రదంగా జీవించడం నేర్చుకోవాలి. గ్రామీణ వికాసంలో చదువుకోసం, కుటీర పరిశ్రమల కోసం, వ్యవసాయం కోసం, వ్యవసాయ ఉత్పత్తుల కోసం, మార్కెటింగ్ పని కోసం, సరైన సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామస్తులకు అందించడం కోసం యోగ్యమైన వ్యక్తులు ముందుకు రావాలి. వాళ్లు ఈ సేవను ఉద్యోగంగా భావించాలి. కృషి విజ్ఞాన కేంద్రం అలాంటి వారికి రూ.50వేల వరకు వేతనం ఇస్తుంది. అది ఎక్కువ కాకున్నా, తక్కువ కూడా కాదు. దానికి భార్యాభర్తలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

గ్రామమంటే భగవంతుడు చేసిన నిర్మాణం. అక్కడ అంతా సంపదే. ప్రతీ వస్తువు ఆదాయ వనరే. చింతచెట్టు, వేపచెట్టు, మునగాకూ సంపత్తే. గోమూత్రం, గోమయం సంపదే. అయితే వీటిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వాడుకోవాలి. ఆ ఉత్పత్తులు ఎగుమతి చేయాలి. ఇది నేటి యువతీ యువకుల, చదువుకున్నవాళ్ల కర్తవ్యం కావాలి. పట్టణాల్లో సంపత్తే లేదు, పైగా అంతా ఖర్చు. అయితే గ్రామాల్లో పుట్టి పెరిగిన యువకుడు కూడా ఎమ్ఎస్సి, బీటెక్ చదివిన తరువాత అతనికి గ్రామం గురించి తెలియడంలేదు. గ్రామంలో వేపచెట్ల నుంచి నూనె వస్తుంది, దానితో ఎంత లాభముంటుందని తెలుసుకోవడం లేదు. మునగాకు ఆరోగ్యానికి ఎంతో మేలు. కుంకుడుకాయ నుంచి లాభముంది. కుంకుడుతో పతంజలి వారికి విశేష లాభం చేకూరుతున్నది. రసాయనాలతో నిమిత్తం లేకుండా ఆ ఉత్పత్తులను గ్రామంలో చేస్తే పతంజలి కంటే ఎక్కువ డబ్బు, లాభం వస్తాయి. దీని గురించి ఆలోచించే, మార్కెటింగ్ చేసే వ్యక్తులు, సైంటిస్టులు అందరు గ్రామాల్లో ఉండాలి. పెద్ద కష్టం కాదు.

ఇలాంటి గ్రామీణ వికాసంలో గ్రామీణులు భాగస్వాములుగా ఉండాలి. గ్రామ వికాస సమితి ఏర్పడాలి. ప్రభుత్వ సాయం తప్పక ఉపయోగించుకోవాలి. కానీ, గ్రామీణుల సమష్టి కృషి దీనికి ఆధారంగా ఉండాలి. ఆ గ్రామంలో దొరికే ప్రకృతి సిద్ధమైన వనరుల ద్వారా ఉత్పత్తి చేస్తూ, మార్కెటింగ్ చేస్తూ గ్రామానికి ఆదాయం తీసుకురావాలి. ఉప్పు వంటి కొన్ని వస్తువులు అన్నిచోట్లా ఉత్పత్తి చేయలేం. అవి తెప్పించికోవాలి. ఇపుడు రిఫైన్డాయిల్ వాడుతున్నారు. సర్వరోగాలకు కారకమైనది. కాబట్టి వేరుశనగ నూనె తయారుచేసి అమ్ముతున్నారు. పూర్వం గానుగలు గ్రామ గ్రామాన ఉండేవి. వీటిని ఒక ప్రణాళిక ప్రకారం దెబ్బతీశారు. ఇందుకు స్వదేశీయులు కూడా సహకరించారు. గాంధీజీ చెప్పే స్వరాజ్యంలో ఉత్పత్తిని వికేంద్రీకరించాలి. ఇవాళ మనం చేయగలిగిన పని ఇది. హెర్బల్ పార్క్‌ల

గుండ్రంగా నూతి వరల్లా ఉన్న వీటిలో కనిపిస్తున్నది కూడా ఒక రకమైన నారు వంటిదే. దీని పేరు అజుల్లా. ఒక్కొక్క మొక్క కందిగింజ పరిమాణంలో ఉంటుంది. సగం ఎండ, సగం నీడ ఉండేటట్టు చేసి వృద్ధిచేస్తారు. దానిని బట్టే పైన ఏర్పాటు చేశారు. వరి చేలో వేయడంవల్ల నత్రజని ఇస్తుంది. కలుపును రానివ్వదు. పశువుల దాణాగా, కోళ్ల మేతగా కూడా వినియోగిస్తారు. హెక్టార్‌కు 25 నుంచి 30 కిలోల అజుల్లాను చేనులో వేస్తారు.

భూసార పరీక్షల ప్రయోగ శాలలో శాస్త్రవేత్త శంభాజీ ఆర్.హింగే. ఇన్‌సెట్‌లో మట్టి నమూనాలు

ఈ భారీ ఆకుపచ్చ దోమతెర కూరగాయలు, పళ్ల మొక్కల నారుకు ఆచ్ఛాదన. లోపల బొప్పాయి, మునగ, టొమేటో, వంగ, మిర్చి నారు పెరుగుతోంది. దీనికి కూడా మరీ ఎండ ఉంటే మంచిది కాదు. అందుకే ఈ ఏర్పాటు.

మొదటి ఫోటోలో కనిపిస్తున్న టొమేటో మొక్కల ప్రత్యేకత ఏమిటంటే– వీటిని వంగమొక్కతో అంటుకట్టారు. టొమేటోకాండం సహజంగా బలహీనంగా ఉంటుంది. వంగమొక్క కాండం సహజంగా బలమైనది. ఈ రెండింటికీ అంటు కట్టి టొమేటో కాండానికి బలం చేకూరుస్తారు. ఆ క్రమంలో బలమైన వంగ కాండం పెరగకుండా కత్తిరిస్తూ ఉంటారు. దీనివల్ల టొమేటో పంటకాలం పెరుగుతుంది. దిగుబడి అధికమవుతుంది. పైగా తెగుళ్ల బారిన పడదు. పక్కన తునికి కేంద్రంలో పండించిన ఎర్ర బెండ, పచ్చి మిర్చి.

అభివృద్ధి కూడా ఇందులో భాగమే. జింగుర్తిలో కూడా హెర్బల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నాం. ఈ పార్క్‌ను రామచంద్ర మిషన్‌వారు అభివృద్ధి చేస్తున్నారు. వారు ప్రపంచంలోని వృక్ష, ఔషధి జాతులను కాపాడుతున్నారు. రామచంద్రమిషన్, గాయత్రీపరివార్, రవిశంకర్ గురూజీ ఎవరెవరైతే మంచిపనిచేస్తున్నారో వారందరి సహకారం తీసుకోవాలన్నదే ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఉద్దేశం.

ప్రస్తుత పరిస్థితి ఏమిటి? ఆరులక్షల గ్రామాలలో బ్రతికే యువకులు వలస వెళ్లిపోతే దేశం ఏమైపోతుంది? ఇంతమందికి భోజనం, పనులు దొరకాలంటే గ్రామమే దిక్కు. ఫుడ్ ప్రాసెసింగ్ ఏం చేస్తుంది? మళ్లీ కంపెనీ పెడుతుంది. డబ్బులన్నీ వాళ్లకే వెళ్తాయి. మరో సంస్థ లేని కారణంగా వాటికే గవర్నమెంట్ సబ్సిడీ ఇస్తుంది. ప్రజల భాగస్వామ్యం లేకపోవడమూ కారణమే. కానీ ప్రస్తుత పరిస్థితులలో ప్రజల భాగస్వామ్యం కష్టం. ఎందుకంటే అప్పనంగా డబ్బు వస్తే చాలన్న భావన పెరిగింది. అందుకే సేవా సంస్థలు ముందుకు రావాలి.

ఈ మహత్కార్యం కోసం కొంతమంది పూర్తి సమయ కార్యకర్తలు కావాలి. పట్టభద్రులైనవారు ఐదేండ్ల పాటుగా స్వచ్ఛందంగా సేవ చేయాలి. తర్వాత గ్రామాల్లో నివసిస్తూ స్టార్టప్‌లు ప్రారంభించాలి. వీటికి కేంద్ర ప్రభుత్వం సహాయం చేస్తుంది. రూర్కేలాలో స్టార్టప్ కోసమని ఒక ప్రొఫెసర్ విద్యార్థులతో, రైతులతో కలిసి రెండేళ్లు పనిచేయగానే కేంద్ర ప్రభుత్వం రూ.5 కోట్లు ఇచ్చింది. ఎవరి సిఫారసు లేదు. ఈ మొత్తం సమాచారం అందరికీ వెళ్లాలి.

ఇందులో హిందూత్వ పాత్ర ఏమిటన్న ప్రశ్న రావచ్చు. గ్రామంలో వ్యవసాయం ఊపందుకోవడం, భూరక్షణ, పోషణ, చెట్లు పెంచడం, పర్యావరణ పరిరక్షణ, గ్రామంలో సమరసత తేవడం, గ్రామాన్ని ఆర్థిక స్వావలంబన చేయడం–ఇదంతా హిందుత్వమే. ఇప్పటివరకు హిందుత్వం ఒక ప్రక్రియ అనుకున్నాం. రామజన్మ భూమి కట్టాలి... ఇవన్నీ కలిపి హిందుత్వం. హిందుత్వం అనే శబ్దం మాటిమాటికి చెప్పడం కంటే హిందుత్వ క్రియను ఇలా చూపాలి. హిందూత్వ మాట వింటే కొందరు ఈ పనిని బీజేపీ హైజాక్ చేస్తుందేమోనని వ్యతిరేకిస్తారు. మన సంస్కృతి ప్రకారం భూమిని భక్తిగా పోషించాలి. భూమినీ, ప్రకృతినీ కలుషితం చేయకూడదు. ఇది కూడా హిందూత్వమే. ★

కేవీకే ఇక్కడ ఉండడం మా అదృష్టం

మెదక్ కృషి విజ్ఞాన కేంద్రం స్థాపించిన నాటినుంచి సంస్థ సేవలు వినియోగించుకుంటున్న రైతు రామకృష్ణ గౌడ్ (కంచన్‌పల్లి, మెదక్ జిల్లా). ఐదు ఎకరాలలో సేద్యం చేస్తున్నారీయన. రెండు కుంటలలో 14 రకాల పంటలు వేశారు. అన్నీ కూరగాయలే. కాకర, సొర, బీర, పొట్ల, వంకాయ, బెండ (ఎరుపు, ఆకుపచ్చ), గోరు చిక్కుడు, పచ్చిమిర్చి, కొత్తిమీర, మెంతికూర, దుబ్బ బచ్చలి, చుక్కకూర, గంగవాయిలు కూర పండిస్తున్నారు. కొత్తిమీర, మెంతికూర, గంగవాయిలు కూర –మూడూ కలిపి మల్టీ లేయర్ ఫార్మింగ్ చేస్తున్నారు. ఈ పంటల రక్షణకు కావలసిన జీవామృతం, దశపర్ణ కషాయం తయారీ విధానమే కాదు, అందుకు అవసరమైన డ్రమ్ములను కూడా కేంద్రమే అందించింది. 'సేంద్రియ పద్ధతిలో పండించిన కూరలు చాలా రుచిగా ఉంటాయి. ఆర్థికంగా కూడా బాగుంది. మందులు, ఎరువులూ వేసి పెంచిన కూరగాయలు పెద్దగా నిల్వ ఉండవు. సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు వారంపాటు ఏమీ కాకుండా నిల్వ ఉంటాయి. మందులతో పండించే పంట నాలుగు మాసాలు ఉంటుంది. అదే సేంద్రియ పద్ధతులలో సాగు చేస్తే ఆరు మాసాలు ఉంటుంది. రెండు మాసాల పాటు అదనంగా దిగుబడి వస్తుంది. పైగా రోగ నిరోధక శక్తి కలిగి ఉంటుంది. వారానికి నా ఇంటి కూరగాయల ఖర్చు ఐదు వందల రూపాయలు. ఇప్పుడు ఆ ఖర్చు తగ్గింది' అని చెప్పారు గౌడ్. ★

తునికి... 6వ పుట తరువాయి

పద్ధతులతో ఇక్కడ వ్యవసాయం చేస్తారు. ఇదే అంశం మీద ఈ కేంద్రం రైతులకు శిక్షణ ఇస్తుంది. ఈ సేద్యం అవసరాన్ని తెలియచేస్తుంది.

తునికి కృషి విజ్ఞాన కేంద్రం 30 ఎకరాలలో కార్యకలాపాలు సాగిస్తున్నది. ఇందులో నికర సాగు విస్తీర్ణం 21.5 ఎకరాలు. 2018 నుంచి ఇక్కడ సాగుతున్న మొత్తం సేద్యం సేంద్రియ పద్ధతిలోనే జరుగుతున్నది. పంట మార్పిడి విధానానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. వరి బదులు ఆకుకూరలు, పండ్లు, కూరగాయల పంటలను ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం పెరుగుతున్న వినియోగాన్ని బట్టి తృణధాన్యాలు, పప్పుధాన్యాల సేద్యానికి కూడా పెద్ద పీట వేస్తున్నారు. ప్రయోగశాలల సేవలను క్షేత్రాలకు తీసుకురావడం ఇంకొక అంశం. అక్కడ విజయవంతమైన ప్రయోగాలనే పొలాలకు అందిస్తున్నారు. కంకర, రాతి నేలలు, సమస్యాత్మక నేలలను కూడా దిగుబడికి అనుకూలంగా మార్చే విధానాలను ఇక్కడ రైతులకు నేర్పుతున్నారు. పందిళ్లతో, సంచి సేద్యంతో తీగజాతి కూరల పెంపకం పరిచయం చేయడం వల్ల ఆ ప్రాంతం వారు లాభపడుతున్నారు. శిక్షణ కోసం రైతులు ఈ కేంద్రానికి వస్తారు. అవసరాన్ని బట్టి ఈ కేంద్రం నుంచి శాస్త్రవేత్తలు గ్రామాలకు వెళ్లి అక్కడే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు కూడా. ఇక్కడే ఒక చిన్న తరహా ప్రయోగశాలను ఏర్పాటు చేసి 560 మట్టి నమూనాలను పరీక్షించారు. ఆ ఫలితాల ఆధారంగా పంటలను సిఫారసు చేశారు. అదే సమయంలో ఎరువుల వాడకం తగ్గించి, నేల సారాన్ని పరిరక్షించడం ఎలాగో తప్పనిసరిగా వివరిస్తారు.

ఇక్కడ ఇచ్చే శిక్షణలో దాదాపు 14 అంశాలు ఉన్నాయి. సేంద్రియ, సహజ వ్యవసాయ పద్ధతులు, వర్మీ కంపోస్ట్ తయారీ, నేల ఆరోగ్య నిర్వహణ, తెగులు, వ్యాధి నిర్వహణ మీద శిక్షణ, వ్యవసాయ యంత్రాల ప్రాధాన్యం చెప్పడం, సాధికారత మీద మహిళలకు శిక్షణ, జీవన ఎరువుల పాత్ర, వ్యవసాయోత్పత్తుల డీలర్ల శిక్షణ, వ్యవసాయ పర్యావరణ పరిస్థితి మీద అవగాహన పెంచే శిక్షణ, వ్యవసాయ విస్తరణలో సాంకేతిక సమాచారం గురించి శిక్షణ, నర్సరీ పెంపకం, తేనెటీగల పెంపకం– వంటి అంశాల మీద కేంద్రం దృష్టి సారించింది. ఇక్కడ 12 రకాల జీవన ఎరువులను తక్కువ ధరలకే రైతులకు అందిస్తారు. సేద్యం ఏ రూపంలో చేసినా తక్కువ ఖర్చు చేయగలగాలన్నదే కేంద్రం లక్ష్యం. ఒక పద్ధతితో బహుళ ప్రయోజనాలు సాధించడం కూడా. ఉదాహరణకు మామిడితోటలలో వర్మీ కంపోస్ట్ తయారీ. రైతుకు, తోటకు, నేలకు కూడా దీనితో లాభాలు ఉన్నాయి.

పశు సంరక్షణ లేకుంటే వ్యవసాయం పరిపూర్ణం కాదు. ఆ రెండూ పరస్పర పూరకాలు. అందుకే పశువుల పెంపకం, చేపల పెంపకం, కోళ్ల పెంపకం గురించి కూడా ఇక్కడ సలహాలు ఇస్తారు. డ్రోన్‌ల ద్వారా కూడా పురుగు నివారణ చర్యలు తీసుకుంటున్నారు. అటు ఆధునిక పద్ధతులు, ఇటు సంప్రదాయం ఇచ్చిన అనుభవాలు, వాస్తవాలు కూడా కృషి విజ్ఞాన కేంద్రం శిక్షణలో, ఆలోచనలలో దర్శనమిస్తాయి.

శాస్త్రవేత్తల ప్రయోగాలను పొలాలకు పరిచయం చేయడమే కాదు, అందుకు సంబంధించిన ఆలోచనలను, ఆ ఆలోచనలను స్వాగతించే వాతావరణం సృష్టించడం కోసం కూడా ఏకలవ్య ఫౌండేషన్ తన వంతు కృషి చేస్తున్నది. వికారాబాద్ జిల్లా, తాండూరు మండలం, జింగుర్తిలో 2018లో స్థాపించిన ఏకలవ్య ఆర్గానిక్ అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ ఇందుకు అద్దం పడుతుంది. ఇది ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా పనిచేస్తున్నది. నాలుగు సెమిస్టర్లతో కూడిన 'ఆర్గానిక్ అగ్రికల్చర్ అండ్ హార్టీకల్చర్' డిప్లొమా కోర్సును ఇక్కడ బోధిస్తారు. తక్కువ వ్యయంతో సేంద్రియ వ్యవసాయం చేసే పద్ధతులు ఇక్కడ నేర్పుతారు. వ్యాపారవేత్తగా ఎదిగే అంశాన్ని కూడా బోధిస్తారు. ఆధునిక వ్యవసాయ పనిముట్లతో పరిచయం,

ఇప్పుడు జరగవలసి

భూరక్షణ కోసం నేడు ప్రజలంతా కలసికట్టుగా, గట్టిగా పోరాడవలసిన అవసరం వచ్చిందని తునికి కృషి విజ్ఞాన కేంద్రాన్ని నిర్వహిస్తున్న ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ చైర్మన్ తాండ్ర వినోద్‌రావు అన్నారు. భూమిని రక్షించుకుకోవడానికి, రైతాంగాన్ని నిలబెట్టుకోవడానికి కూడా సేంద్రియ వ్యవసాయమే దిక్కు అని ఆయన చెప్పారు. ఆయన ఇంటర్వ్యూ విశేషాలు.

కృషి విజ్ఞాన కేంద్రం ఆధారంగా ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న కార్యక్రమమంతా ప్రయోగం, ప్రయోజనం, సంప్రదాయాల మేళవింపు అని అనుకోవచ్చునా?

నేను ఈ భూమి పుత్రుడిని. ఈ భూమి నా తల్లి అన్నది భారతీయమైన భావన. అలాగే మనం ఏం తింటామో అలాగే ఆలోచిస్తాం. మన ఆలోచనలే మనలను మలుస్తాయి... నడిపిస్తాయి. ఈ రెండు అంశాలను ఇప్పుడు విజ్ఞాన శాస్త్రం కూడా ఆమోదిస్తున్నది. రెండూ పరస్పరం సంబంధం ఉన్నవే కూడా. భూమి ఆరోగ్యం చెడిపోతే వ్యవసాయోత్పత్తులు ఆరోగ్యకరమైనవని ఎలా అనగలం? అప్పుడు మనం తినే ఆహారం సరైనదెలా అవుతుంది? మన కన్నతల్లికి ఆరోగ్యం బాగుండకపోతే వైద్యుడిని సంప్రదిస్తాం. స్వస్థత చేకూరేదాకా చాలా చేస్తాం. చేయాలి. కానీ మనమంతా భూమాత అని పిలుస్తూ, పూజిస్తున్న భూమి ఆరోగ్యం చెడిపోతూ ఉంటే ఏం చేస్తున్నాం? పర్యావరణం కలుషితమై పోతున్నదని చెప్పుకుంటున్నాం. అందులో భూమికి జరుగుతున్న చేటును గురించి తక్కువగా మాట్లాడుతున్నాం. భూపోరాటాలతో పాటు భూరక్షణ పోరాటం గురించి కూడా అంతా మాట్లాడవలసిన అవసరం వచ్చింది. ఇప్పుడు ఆ అవసరం చాలా ఉంది. చిన్న ఉదాహరణ: 1960 దశకం నాటి మాట. అప్పుడు మట్టిలో కార్బన్ కంటెంట్ 2 నుంచి 3 శాతాం వరకు ఉండేది. ఇప్పుడు అది 0.1 శాతం నుంచి 0.4 శాతానికి పడిపోయింది. భూమి చాలా బలహీనమైపోయింది. ఇందుకు ప్రధాన కారణం– రసాయనాలను అధిక మొత్తంలో వినియోగించడం. అది కూడా తప్పుడు పద్ధతులతో వినియోగించడమే. 1960 దశకంలో ఒక కిలో యూరియా వినియోగిస్తే 50 కిలోల తిండిగింజలు వచ్చేవి. ఇప్పుడు ఒక కిలో యూరియాకి 9 కిలోల ఆహార ధాన్యాలే ఉత్పత్తి అవుతున్నాయి.

రైతులకు విత్తనాల సంచులు అందిస్తున్న శాస్త్రవేత్తలు, చైర్మన్ వినోద్‌రావు

సేంద్రియ వ్యవసాయంతో ఈ పరిస్థితి నుంచి బయటపడవచ్చునని విజ్ఞాన కేంద్రం కృషి చేస్తున్న మాట నిజం. దీని క్రమం, ప్రయాణం ఎలా ఉంటాయి?

నేలతల్లి ఆరోగ్యం మొదట బాగుపడాలి. అదే సమయంలో రైతు ఆదాయం పెరగాలి. ఈ రెండింటినీ ఏకకాలంలో సాధించగలిగేది సేంద్రియ వ్యవసాయమే. ఈ వాస్తవాన్ని మా కృషి విజ్ఞాన కేంద్రం పెద్దలు, చాలామంది శాస్త్రవేత్తలు కూడా గుర్తించారు. అలాగే దానిని అమలు చేయాలని కంకణం కట్టుకున్నారు. ఫలితమే కృషి విజ్ఞాన కేంద్రాల స్థాపన. తునికి కేంద్రానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇది నూరు శాతం సేంద్రియ సేద్యం మీదనే దృష్టి పెట్టింది. పని ఎక్కువే కావచ్చు. నేల రక్షణ ప్రధానం కాబట్టి జీవన ఎరువులు (కషాయాలు) వాడాలి.

గోశాలల నిర్వహణలో శిక్షణ కూడా ఉన్నాయి.

కొంచెం వాస్తవిక దృక్పథం కలిగిన వారికి గ్రామాల వాతావరణం కలవరం కలిగిస్తుంది. పోషకాహారం గురించే కాదు, విపరీతంగా పెరిగిపోతున్న రసాయనిక ఎరువుల వల్ల పెరుగుతున్న వాతావరణ కాలుష్యం నుంచి తమను తాము కాపాడుకోవడం ఎలాగో వారికి తెలియడం లేదు. మొత్తంగా గ్రామీణుల ఆరోగ్యం, కుటుంబాల ఆరోగ్యం గురించి ఇప్పుడు పరిజ్ఞానం కలిగించాలి. ఇందులో స్త్రీలకు ప్రాధాన్యం ఇవ్వాలి. గ్రామాలలో వారికి తెలియకుండానే ఆయుర్వేదంతో అనుబంధం కలిగి ఉంటారు. అందుకే జింగుర్తిలోనే ఒక ఔషధీ జాతులతో ఒక పార్కును అభివృద్ధి చేయాలని కంకణం కట్టుకున్నారు. గోవుకూ భారతీయ జీవనానికే కాదు, భారతీయ వ్యవసాయానికి కూడా గోవు అవసరమే. అందుకే గోవుల పెంపకం కూడా ఏకలవ్య ఫౌండేషన్ చేపడుతున్నది.

అలాగే సాందీపని గురుకులం పేరుతో జింగుర్తిలోనే ఒక పాఠశాల కూడా వచ్చే సంవత్సరం నుంచి మొదలవుతున్నది. సీబీఎస్ఈ పాఠ్య ప్రణాళికతో పాటు సంస్కృతం, హిందీ, ఇంగ్లిష్, మాతృభాష ఇక్కడ బోధిస్తారు. పిల్లలలో కళాత్మక దృష్టి కోసం అనేక కళలలో తర్ఫీదు కూడా ఇస్తారు. దీని ప్రధాని ఉద్దేశం ఉద్యోగాలు కోరే వారిని తయారు చేయడం కాదు. ఉద్యోగాలు ఇచ్చే వాణిజ్యవేత్తలను నిర్మించడం.

తునికి కృషి విజ్ఞాన కేంద్రం ధర్మకర్తల మండలికి ప్రస్తుతం తాండ్ర వినోద్‌రావు అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. వి. శ్రీనివాస్ సీఈఓగా సేవలు అందిస్తున్నారు. ఈ కేంద్రానికి శాస్త్రవేత్తల బృందమే పెద్ద బలమని వినోద్‌రావు చెప్పారు. డాక్టర్ శంభాజీ నాల్కర్ సీనియర్ సైంటిస్ట్‌గా, ప్రిన్సిపల్ కోఆర్డినేటర్‌గా, పశు సంవర్ధక శాఖ అధివతిగా వ్యవహరిస్తున్నారు. రవికుమార్ (సస్య రక్షణ విభాగం), ఎన్. శ్రీనివాస్ (ఫలపుష్ప సాగు), ప్రతాపరెడ్డి (సేద్య విభాగం), ఎం. ఉదయ్‌కుమార్ (వ్యవసాయ యంత్రీకరణ విభాగం), డాక్టర్ జి. భార్గవి (గృహ విజ్ఞాన విభాగం) ఇక్కడ సేవలు అందిస్తున్నారు.

ఈ నేలలో పండిన పంట ఈ మట్టి వాసన వేయకుండా, రసాయనాల కంపు కొట్టడం ముమ్మాటికీ విషాదమే. రసాయనాలు లేకుండా సేద్యం చేస్తే బతకలేమన్న నమ్మకాన్ని తునికి కృషి విజ్ఞాన కేంద్రం క్రమంగా కలుపు తొలగించినట్టు రైతుల ఆలోచనల నుంచి తొలగిస్తున్నది. జాగృతి బృందం అక్కడికి వెళ్లినప్పుడు వచ్చిన ఒక రైతు అన్నమాట దీనిని రుజువు చేస్తున్నది. 'మందులు వేయని పంట పండించాలి. ఆ పంట తినాలి. అసలైన జీవితం ఏదో అప్పుడే తెలుస్తుంది' అన్నాడాయన. సేంద్రియ సేద్యానికి ఆదరణ లేకపోవడం అనే ప్రశ్న ఉత్పన్నం కాదు. కానీ అందుకు సంబంధించిన భయాలను తొలగిస్తే చాలు. సేంద్రియ సేద్యం కూడా రసాయనిక ఎరువులతో సమానమైన దిగుబడి ఇస్తుందని ఆధారాలతో చూపాలి. అదే నేలను కాపాడుకునే సిద్ధాంతమవుతుంది. అదే రైతును రాజును చేస్తుంది. పాతాళంలో దాగిన వానపాములను మళ్లీ స్వాగతిస్తుంది. రెండు చేతులు ఎత్తి సూర్యభగవానుడికి నమస్కరిస్తున్నట్టు విత్తనం నుంచి వెలువడుతున్న అసలు సిసలు ఆకుపచ్చని అంకురం మళ్లీ దర్శనమిస్తుంది. ★

నది భూ సంరక్షణ పోరాటం

కృషి విజ్ఞాన కేంద్రాలు ఏమిటి? ఎలా ప్రారంభమయ్యాయి?

సేంద్రియ సాగు యజ్ఞంలో కృషి విజ్ఞాన కేంద్రాలు అగ్రస్థానంలో నిలుస్తున్నాయి. ఇలాంటి కేంద్రాలు దేశం నలుమూలలా దాదాపు 730 ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ సాయంతో పని చేస్తున్నాయి. తునికి కేంద్రం 2017లో ఏర్పాటయింది. కరోనా ఒక విధ్వంసమే అయినా, అది జనంలో ఒక ఆలోచనను తీసుకువచ్చింది. శరీరంలో రోగ నిరోధక శక్తి అవసరం ఎంతో గుర్తించడం, అందుకు ప్రధానంగా కావలసినది ఆరోగ్యదాయకమైన ఆహారమని తెలుసు కోవడంతో దానినెలా సంపాదించాలి? అనే అన్వేషణ మొదలైంది. మందులు, రసాయనాలతో కూడిన కలుషిత ఆహారం కాకుండా, నిజంగా ఆరోగ్యాన్ని ప్రసాదించే ఆహారం కోసం అన్వేషణ మొదలయింది. సేంద్రియ సేద్యంతో వచ్చిన ఉత్పత్తులకు ఆదరణ పెరగడం మొదలైంది. తునికి హైదరాబాద్ మహా నగరానికి సమీపంలోనే ఉన్నది కనుక, దీనిని అందుకు ఉపయోగించుకోవాలన్న ఆలోచన కూడా వచ్చింది. సేంద్రియ సేద్యంతో కూరగాయలు, పళ్లు పండించి ప్రజల ఆరోగ్యాన్ని సాధ్యమైనంత వరకు రక్షించాలన్న ఆశయం కూడా ఇందులో ఉంది. దీనితో రైతుకు ఆదాయం కూడా బాగుంటుంది.

సేంద్రియ, రసాయనిక సేద్యాలకి మధ్య ప్రధాన వైరుధ్యం ఏమిటి?

తెగుళ్ల నుంచి పంటను రక్షించుకునే క్రమంలో రైతులు రకరకాల మందులు వాడతారు. అధిక దిగుబడి పేరుతో ఎరువులు వేస్తారు. అవి మోతాదు మించుతూ ఉంటాయి. నిజానికి వీటి ప్రభావం చల్లిన చోటుకే పరిమితం కాదు. మొత్తం జీవరాశుల మీద, ప్రకృతిపైన ఉంటుంది. మానవాళినీ వదలదు. కేన్సర్, కాలేయం, ఊపిరి తిత్తులు దెబ్బతినడం, వ్యంధ్యత్వం ఇంకా ఎన్నో రుగ్మతలు చుట్టు ముడతాయి. ఇవన్నీ నిపుణుల సిఫారసులకు అనుగుణంగా మందులు వాడకపోవడంవల్ల వచ్చే పరిణామాలు. ఇందుకు ప్రత్యామ్నాయంగా జీవ నియంత్రణ పద్ధతులతో సేద్యం చేస్తే పైన చెప్పిన సమస్యలు రావు. ఖర్చు తగ్గి, సేద్యం లాభదాయకమవుతుంది. ఇందుకు జీవ నియంత్రణ ప్రయోగశాల ఏర్పాటు చేశాం. ఇందులో ట్రైకోడెర్మావిరిడి, సూడోమోనాస్, బయో పెస్టిసైడ్స్ తయారుచేసి ఇస్తాం. ఇవే బయో ఇన్‌పుట్స్. తక్కువ ధరకే ఇస్తాం. ఇది ఒకే సారి బహుళ ప్రయోజనాలను ఇస్తుంది. మామిడితోటలో వర్మి కంపోస్ట్ తయారు చేస్తే భూమి బాగుపడుతుంది. తోటకు బలం. రైతుకు దీనితో లాభం.

హరిత విప్లవం, అధిక దిగుబడులువంటి అభిప్రాయాలు జనంలో చాలా గట్టిగా ఉన్నాయి. ఎందుకంటే, ఈ పెద్ద దేశంలోని ఇంత పెద్ద జనాభాకి సరిపోయే ఆహారం సమకూర్చాలంటే రసాయనిక ఎరువులు, మందులు, పురుగు మందులతో సేద్యం చేస్తేనే అది సాధ్యమన్న దృఢ విశ్వాసం ఎక్కువమంది పాలకులకు కూడా ఉంది. ఈ ఆలోచన భూసార రక్షణ అన్న ప్రధాన అంశాన్ని దారుణంగా కుంగ దీసింది. నూరేళ్ల క్రితం మన దేశం కూడా సేంద్రియ సేద్యమే చేసింది. ఇప్పుడు మళ్లీ సేంద్రీయ సేద్యానికి వెళదామని చెబుతుంటే ఎలాంటి సవాళ్లు ఎదురవుతున్నాయి?

సేంద్రియ సేద్యం గురించి రైతులోకం ఎదుట పెట్టే ముందు, ఆ సవాళ్ల గురించి కృషి విజ్ఞాన కేంద్రం పెద్దలు ఆలోచించారు. అవన్నీ ఊహించినవే. నిజానికి అదంతా మన సంప్రదాయ సేద్య విధానానికి మళ్లీ ప్రాణప్రతిష్ట చేసుకోవడమే. అలా అని దిగుబడులలో తగ్గుదల కూడా లేదు. ఈ విధానంలో దిగుబడి తక్కువ కాదని తరువాత రుజువైంది. అయినా మొదట నాలుగైదు సవాళ్లు ఎదురయ్యాయి. అవి సవాళ్లే గానీ, సేంద్రియ సేద్యానికి నిగూఢంగా సమాజంలో ఉన్న గౌరవాన్ని మాత్రం మా దృష్టికి తెచ్చాయి. అందుకే వాటిని సవాళ్లగా పరిగణిస్తూనే పరిష్కారాలను కూడా అందిస్తున్నాం.

సేంద్రియ పద్ధతులలో సాగు యాజమాన్య పద్ధతులు రైతులకు తెలియడం లేదు. కొందరికి తెలిసినా అవి అందుబాటులో లేవు. ఇప్పుడు కృషి విజ్ఞాన కేంద్రంలో సేంద్రియ పద్ధతిలోనే కూరలు, పళ్లు పండించడం ఆరంభించాం. ఆ పద్ధతిలోనే ప్రస్తుతం ఇక్కడ 20 రకాల పంటలు పండిస్తున్నారు. వీటన్నిటి యాజమాన్య పద్ధతులు కూడా రైతులకు అందుబాటులోకి తెచ్చాం.

సేంద్రియ సేద్యానికి అవసరమైన నాణ్యమైన, తక్కువ ధరలో ఉండే ముడి సరుకులు కూడా అందుబాటులో లేవు. అంటే, నాణ్యమైన, నమ్మకమైన స్థాయి కలిగిన బయో ఉత్పత్తులు. కాబట్టి మేమే పంచగవ్య వంటి గో ఉత్పత్తులు, వర్మి కంపోస్ట్ మొదలైనవి తయారు చేసి కర్షకులకు సరఫరా చేస్తున్నాం. ఈ కేంద్రంలో సేంద్రియ ఎరువుల కేంద్రాన్ని కూడా స్థాపించాం.

పోస్ట్ హార్వెస్ట్ సవాలు ఒకటి. అంటే, రైతు పంట కోత, అది వినియోగదారునికి చేరడానికి మధ్య కాలంలో జరిగే నష్టం. ఈ నష్టాలు తక్కువేమీ కాదు. 35శాతం నుంచి 40శాతం వరకు ఆ నష్టాలు ఉంటున్నాయని కేంద్ర ప్రభుత్వ పరిశోధన సంస్థలు చెబుతున్నాయి. ఈ నష్టాలు ఎక్కువగా ఆకుకూరలలో ఎదురవుతాయి. అవి త్వరగా పాడైపోతాయి. ఈ నష్టాలు తగ్గించాలి. అందుకు మ్యాప్ (ఎంఏపీ, మోడిఫైడ్ ఎట్మాస్ఫియర్ ప్యాకింగ్) సాంకేతిక పద్ధతితో పోస్ట్ హార్వెస్ట్ (పంటకోత అనంతర) నష్టాలను బాగా తగ్గించేందుకు ఇక్కడ పరిశోధనలు జరుగుతున్నాయి.

వినియోగదారులకు ఒక ప్రశ్న ఎదురవుతుంటుంది. తనకు కనిపించినవి నిజంగా సేంద్రియ ఉత్పత్తులేనా? అని. అది వాస్తవమే! అయితే అవి ఎక్కడ పండినవి అని అడుగుతూ ఉంటారు. నిజంగానే సేంద్రియ పద్ధతులలో సాగు చేసినా, రసాయనిక ఎరువులు వేసి పండించినవైనా ఆ క్షణంలోనే తేడా తెలియదు. కాబట్టి దీనికి కృష్టి విజ్ఞాన కేంద్రం సర్టిఫికేషన్‌ను ప్రారంభిస్తున్నాం. ఇందులో పద్ధతి ఎలా ఉంటుందంటే సేంద్రియ సాగులో ఉన్న రైతుకు ఒక క్యూఆర్ కోడ్ ఇస్తాం. దాని మీద వినియోగదారుడు ఫోన్‌తో స్కాన్ చేసినట్టయితే ఆ పంట, దాని వివరాలు, ఇతర వాస్తవాలు మన కృషి విజ్ఞాన కేంద్రం వెబ్ సైట్‌లో కనిపిస్తాయి. ఇది వినియోగదారుడికి నమ్మకం కలిగిస్తుందనే మేం అనుకుంటున్నాం.

ఈ నాలుగు అంశాలు పరస్పరం సంబంధం ఉన్నవే. అంటే యాజమాన్య పద్ధతులు, బయో ఇన్‌పుట్స్ లేదా ముడిసరుకులు అందించడం, మోడిఫైడ్ ఎట్మాస్ఫియర్ ప్యాకింగ్, సర్టిఫికేషన్, క్యూఆర్ కోడ్. ఇప్పుడు, మార్కెట్‌తో సేంద్రియ రైతులను అనుసంధానం చేసే ప్రయత్నం కూడా ఉంది. ప్రస్తుతం మన పంటలు ఈ ప్రాంతంలోనే

ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ ఫినాయిల్, పళ్లపొడి, సబ్బులు, కీళ్లనొప్పి నివారణ మందు, తల నూనె కూడా ఉత్పత్తి చేస్తున్నది. గ్రామీణ ప్రాంతాలలో ఈ ఉత్పత్తులను అలవాటు చేయడానికి జింగుర్తిలో తయారు చేస్తున్నారు. వీటిలో ఒక్క చుక్క రసాయనం కూడా ఉండదు. గో ఉత్పత్తులు మాత్రం వినియోగిస్తారు.

4000 కుటుంబాలకు చేరుతున్నాయి. ఇలా ఒక పూర్తి సర్కిల్‌ను నిర్మించడం బహుశా ఇక్కడే జరిగిందని చెప్పవచ్చు. అయినా, ఇది ఒక ఆరంభం మాత్రమేనని మేం అనుకుంటున్నాం.

అంటే వినియోగదారులు, వ్యాపారులు సిద్ధంగా ఉన్నారని అనుకోవచ్చునా?

ఆ సేద్యానికి అవసరమైన అన్ని వనరులు అందిస్తే సేంద్రియ వ్యవసాయం చేస్తామని రైతులు చెబుతున్నారు. నిజానికి చాలామంది రైతులు ఈ సేద్యానికి నూరు శాతం అనుకూలమే. ఈ ఉత్పత్తులు మాకు చేరిస్తే తాము కూడా మార్కెట్‌లో ఉంచుతామని వ్యాపారులు చెప్పారు. కొంతమంది ఇంటి అవసరాల కోసం సేంద్రియ వ్యవసాయం చేస్తామని ముందుకొచ్చారు. వారినీ ప్రోత్సహిస్తున్నాం. ఈ వ్యవసాయమే చేయాలనుకున్న మెదక్ జిల్లా రైతాంగానికి బయో ఇన్‌పుట్ కేంద్రాన్ని ప్రారంభించాం. మన సేంద్రియ ఉత్పత్తులు అంటే అమృతాహారమే. దీనిగురించి ప్రభుత్వాలు, ప్రజలు అంతా ప్రచారం చేసినట్టయితే అందరికీ లాభం. వ్యవసాయం లాభదాయకమవుతుంది. దేశమంతా వీటికి గిరాకీ ఉంటుంది. భూమాతను రక్షించుకున్నవాళ్ల మవుతాం.దేశంలో సేంద్రియ సేద్యం, ఉత్పత్తులు పెరిగితే ప్రపంచ ఆహారోత్పత్తులలోను భారత్ అగ్ర దేశంగా వెలుగొందుతుంది.

బయట క్షేత్రాలలో ఫలితాలు ఎలా ఉన్నాయి?

కేరళ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు 2015లో తమ ఇంటర్నల్ జర్నల్‌లో ఒక విషయం చెప్పారు. దాని ప్రకారం రసాయనిక సాగుబడి లాభాలు తెలుస్తాయి. కానీ అంతకు మించి ప్రయోజనాలు మన రైతులకు దక్కాయి. ఇదంతా సాధ్యమైందంటే కారణం– మా శాస్త్రవేత్తల బృందం దీక్ష. అటారీ సహకారం, ఏకలవ్య ఫౌండేషన్ పెద్దల ప్రోత్సాహం, దాతల ఔదార్యాలే.

రైతులకు తర్ఫీదు ఎలా ఉంది? ఎవరికైనా ఇక్కడ తర్ఫీదు ఇస్తారా?

ఇక్కడ రైతులందరికీ తర్ఫీదు ఇస్తారు. వారంపాటు శిక్షణ తరగతులు కూడా ఉంటాయి. బస, భోజనం ఉచితం. త్వరలో వ్యవసాయ పర్యాటకం కూడా ప్రారంభిస్తున్నాం. ఆసక్తి ఉన్నవారు ఇక్కడ ఒకరోజు గడిపి వెళ్ల వచ్చు. లేదా నేర్చుకొనేందుకురావచ్చు. ఆసక్తి ఉన్నవారందరినీ మేం ఆహ్వానిస్తున్నాం.

ఇంకొన్ని వివరాలు, ఫోటోలు పే.51లో..

24 గంటల విద్యుత్

తెలంగాణలో ఉచిత, సంక్షేమ పథకాల ఉచ్చు అధికార పక్షాన్ని చుట్టుకుంటోంది. తాజాగా రైతులకు అందించే ఉచిత విద్యుత్ అంశం పైన దుమారం చెలరేగుతోంది. తెలంగాణ రైతుల సంక్షేమం కోసం వ్యవసాయానికి నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని సందర్భం వచ్చినప్పుడల్లా ప్రభుత్వం ప్రకటిస్తోంది. కానీ, ఇటీవల కాలంలో విపక్షాలు చేస్తున్న నిరసనలతో అసలు బండారం బయటపడుతోంది. 24 గంటలు వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామన్న వాదన అంతా వట్టిదే అని బట్టబయలవుతోంది. దీనిపై చర్చ సందర్భంగా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు వేర్వేరు వాదనలు వినిపిస్తున్నారు. ఈ అంశంపై చర్చ మొదలయ్యే దాకా రోజుకు 12 గంటలు మాత్రమే వ్యవసాయానికి విద్యుత్ సరఫరా చేశారని, ఇప్పుడు మాత్రం సమయాన్ని 20 గంటలకు పెంచారని చెబుతున్నారు.

వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్తు ఇస్తున్నామంటూ ప్రభుత్వం ఇన్నాళ్లుగా చెబుతూ వస్తున్నది నిజం కాదనే వాదనకు బలం చేకూరుతోంది. అవసరమైన చోట్ల, అవసరం మేరకు మాత్రమే విద్యుత్తు సరఫరా జరుగుతోందని క్షేత్రస్థాయి పరిణామాలు చెబుతున్నాయి. ఇటు అధికార యంత్రాంగం, మరోవైపు అధికార పార్టీ చేస్తున్న ప్రకటనలు కూడా ఇది నిజమేనని నిర్ధారిస్తున్నాయి. విద్యుత్తు ఎన్ని గంటలు ఇస్తున్నామనే విషయం ముఖ్యం కాదని, నాణ్యమైన విద్యుత్తు ఇస్తున్నామా? లేదా? అనేదే ముఖ్యం అని ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు వ్యాఖ్యానించారు. మరోవైపు.. రైతులకు అసలు 24 గంటల కరెంట్ అవసరం లేదని, అయినా 24 గంటల కరెంట్ ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఈ ఇద్దరు చేసిన వ్యాఖ్యలు 24 గంటలు విద్యుత్తు సరఫరా జరగడం లేదని చెప్పకనే చెబుతున్నాయి. అంతేకాదు.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ సబ్‌స్టేషన్లలో ఉండే లాగ్‌బుక్‌లను అధికారులు స్వాధీనం చేసుకోవడం, ఒకవేళ సబ్‌స్టేషన్లలో ఉంచినా.. వాటిని ఎవరికీ చూపించవద్దని సిబ్బందికి ఆదేశాలివ్వడం కూడా దీనిని నిర్ధారిస్తున్నాయి. వాస్తవానికి టీఎస్ఈఆర్‌సీ చైర్మన్ టి.శ్రీరంగారావు 2022 మార్చి 23న ఓ ప్రకటన చేస్తూ.. వ్యవసాయానికి ఉదయం 6 గంటల నుంచి 11 గంటల దాకా పీక్ పీరియడ్‌లో కరెంట్ అవసరం లేదని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారని, ఆ మేరకు డిస్కమ్‌లకు సూచనలు ఇస్తామని చెప్పారు. ఆయన సూచనను డిస్కమ్‌లు పాటించాయన్న అభిప్రాయం కూడా ఇప్పుడు వ్యక్తమవుతోంది.

వ్యవసాయానికి 24 గంటలు కరెంట్ ఇవ్వడం లేదని, ఈ విషయాన్ని సబ్‌స్టేషన్లలో లాగ్‌బుక్కులను పరిశీలించి.. అక్కడే తేల్చుకుందామంటూ విపక్షాలు విసిరిన సవాల్‌తో అధికార బీఆర్ఎస్ ఇరుకున పడింది. ప్రస్తుతం ఆ సవాల్‌ను తప్పించుకొని.. 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదనే సత్యాన్ని అంగీకరించే దిశగా ప్రకటనలు చేస్తోంది. ట్రాన్స్‌కో సీఎండీ, మంత్రి ఎర్రబెల్లి వ్యాఖ్యలు అందులో భాగమేనని తెలుస్తోంది.

సబ్‌స్టేషన్ల వద్ద ఉండే కీలకమైన లాగ్‌బుక్‌లే కేంద్రంగా ప్రతిపక్ష కాంగ్రెస్ చేసిన సవాలు అధికార పక్షాన్ని ఇరుకున పెట్టినట్లే తెలుస్తోంది. వాస్తవానికి రెండేళ్లుగా వ్యవసాయ రంగానికి త్రీఫేజ్ కరెంట్ సరఫరాపై డిస్కమ్‌లు నియంత్రణ విధిస్తున్న విషయం విదితమే. పలు చోట్ల 9 నుంచి 12 గంటలే వ్యవసాయానికి త్రీఫేజ్ కరెంట్ ఇస్తున్నారు. అయితే త్రీఫేజ్ కరెంట్ సరఫరాపై నియంత్రణ

సుజాత గోపగోని, 6302164068

పై ప్రభుత్వం ద్వంద్వ వైఖరి!

కొనసాగుతుండగా ప్రతిపక్ష కాంగ్రెస్ అధికార పార్టీని టార్గెట్ చేస్తూ ఉద్యమిస్తోంది. ఇందుకు కాంగ్రెస్‌కు లాగ్‌బుక్ అనే బలమైన ఆయుధం లభించినట్లయింది. క్షేత్రస్థాయిలో సబ్‌స్టేషన్ల నుంచే అన్ని రంగాలకు కరెంట్ సరఫరా అవుతోంది. ఇక్కడ షిఫ్టులవారీగా పనిచేసే సిబ్బంది... విద్యుత్తు సరఫరా ఏ సమయంలో ఆగిపోతుంది? ఏ సమయంలో ఇస్తున్నామనే వివరాలన్నీ సమయం వేసి మరీ రికార్డు చేస్తుంటారు. అయితే 24 గంటల పాటు రైతులకు త్రీఫేజ్ కరెంట్ ఇవ్వడం లేదనే విషయం కూడా నల్లగొండ జిల్లాలోని సబ్‌స్టేషన్‌లలో ఉండే లాగ్ బుక్‌లతోనే తేటతెల్లమయింది. కాంగ్రెస్ లాగ్‌బుక్‌లే కేంద్రంగా అధికార పక్షాన్ని టార్గెట్ చేయడంతో ఆ

వున్నకాలను ఆవరేటర్లంతా ఏఈల చేతికి అప్పగించాలనే ఆదేశాలు వెళ్లాయి. దీంతో అవన్నీ సబ్‌స్టేషన్‌ల నుంచి మాయమయ్యాయి.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వనపర్తి జిల్లా పరిధిలో పలు సబ్‌స్టేషన్లలో లాగ్‌బుక్‌లను ఏఈలు స్వాధీనం చేసుకున్నారు. మరికొన్ని చోట్ల లాగ్‌బుక్‌లను ఎవరికీ చూపించొద్దని సబ్‌స్టేషన్లలోని ఆపరేటర్లకు ఏఈలు, ఇతర ఉన్నతాధికారులు మౌఖికంగా ఆదేశించినట్లు కొందరు సబ్‌స్టేషన్ నిర్వాహకులు చెప్పారు. నారాయణపేట, సంగారెడ్డి జిల్లాల్లో సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లన్నింటినీ ఏఈలు తెప్పించుకొని తమ వద్ద ఉంచుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లాగ్‌బుక్స్ సబ్‌స్టేషన్లలోనే ఉన్నా.. వాటిని ఎవరికీ చూపించవద్దని, ప్రజాప్రతినిధులు, విలేకరులు వచ్చినా ఫొటోలు తీయనివ్వవద్దని ఆపరేటర్లకు అనధికారిక ఆదేశాలు ఇచ్చారు. వికారాబాద్ జిల్లాలో రెండు, మూడు రోజుల క్రితం కొన్ని సబ్‌స్టేషన్ల నుంచి లాగ్‌బుక్‌లు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రాల్లోని సబ్‌స్టేషన్లకు కొత్తవి సరఫరా చేశారు. ఇతర సబ్‌స్టేషన్లకు ఇంకా ఇవ్వకపోవడంతో నోట్ బుక్‌ల్లో నమోదు చేస్తున్నారు.

ఐదు రోజుల క్రితం దాకా రోజుకు 12 గంటల పాటే త్రీఫేజ్ కరెంట్ ఇచ్చిన డిస్కమ్‌లు.. ప్రస్తుతం 20 గంటలకు పైనే కరెంట్ సరఫరా చేస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో ఐదురోజుల క్రితం వరకు 9 గంటలు విద్యుత్తు సరఫరా ఉండగా, నాలుగు రోజులుగా 24 గంటలు నరఫరా చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రోజూ వ్యవసాయానికి 10 నుంచి 12 గంటలే కరెంట్ ఇస్తున్నారు. నిజామాబాద్ జిల్లాలో పగటిపూట త్రీఫేజ్ కరెంట్ ఇస్తుండగా, కొన్ని మండలాల్లో రాత్రి 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల దాకా ఇస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఐదు రోజుల కిందటి దాకా రోజుకు 12 గంటల పాటు కరెంట్ ఇచ్చిన అధికారులు.. నాలుగు రోజులుగా రోజుకు 18 గంటల పాటు సరఫరా చేస్తున్నారు. ఇక హన్మకొండ జిల్లాలో రోజుకు 6 నుంచి 12 గంటలు మాత్రమే ఇస్తున్నారు. ఆదిలాబాద్‌లో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకే కరెంట్ అందుతోంది. వనపర్తి జిల్లాలో కొన్ని చోట్ల 12 గంటలు, మరికొన్ని చోట్ల 14 గంటలు కరెంట్ ఇస్తున్నారు.

2022 ఏప్రిల్‌లో ఎన్‌పీడీసీఎల్‌లో షెడ్యూల్ విడుదల చేసి, ఏ సర్కిల్ పరిధిలో ఎంత మేర కరెంట్ ఇవ్వాలనేది అధికారికంగా నిర్ణయించారు. కానీ, ఏడు గంటల పాటే విద్యుత్తు అందించారు. ఏ రోజు కారోజు షెడ్యూల్ విడుదల చేసి.. అధికారికంగా కోతలు అమలుచేశారు. ఆ తర్వాత ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చాక.. ప్రభుత్వం షెడ్యూల్‌ను పక్కనపెట్టి, మౌఖిక ఆదేశాలతో కరెంట్ కోతలు అమలు చేసింది. వాస్తవానికి ఉదయం 6 నుంచి 9 గంటల దాకా పీక్ పీరియడ్ ఉంటుంది. తిరిగి సాయంత్రం 6 నుంచి 10 గంటల దాకా డిమాండ్ అధికంగా ఉంటుంది. ఆ సమయంలో బహిరంగ విపణిలో కరెంట్ కొనుగోలు చేయాలంటే భారీగా వెచ్చించాలి. ఇది వ్యయంతో కూడుకున్న వ్యవహారం కావడంతో చాలా సందర్భాల్లో డిస్కమ్‌లు కరెంట్ కోతలు అమలు చేస్తున్నాయి. రాష్ట్రంలో 24 గంటల కరెంట్‌పై చర్చ మొదలైన తర్వాత కూడా డిస్కమ్‌లు వ్యవసాయానికి 12 గంటలలోపే కరెంట్‌ను సరఫరా చేస్తున్నాయి.

రాష్ట్రంలో రెండేళ్లుగా వ్యవసాయ విద్యుత్తు వినియోగంపై డిస్కమ్‌లు కఠినంగా నియంత్రణ విధిస్తున్నాయి. ఉదయం, మధ్యాహ్నం, రాత్రి.. ఇలా ఎప్పుడొస్తుందో తెలియక త్రీఫేజ్ కోసం రైతులు కళ్లలో కాగడా పెట్టుకొని ఎదురుచూడాల్సిన పరిస్థితి. కొన్ని చోట్ల పగటిపూట సరఫరా చేయగా, మరికొన్ని చోట్ల మధ్యాహ్నం, ఇంకొన్ని చోట్ల రాత్రిపూట త్రీఫేజ్ కరెంట్ ఇచ్చారు. వ్యవసాయ మోటార్లన్నీ త్రీఫేజ్ కరెంట్ ఉంటేనే నడుస్తాయి. కానీ కేవలం సింగిల్ ఫేజ్ కరెంట్‌కే డిస్కమ్‌లు పరిమితమవుతున్నాయి. దాంతో బోర్లలో పుష్కలంగా నీళ్లున్న రైతులంతా మోటార్లకు ఆటోమేటిక్ స్టార్టర్లు బిగిస్తున్నారు. త్రీఫేజ్ కరెంట్ వచ్చినప్పుడే మోటార్లు పనిచేసేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నీళ్లు అంతంత మాత్రంగా ఉన్న బోరుబావులు ఉన్న రైతులు మాత్రం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. త్రీఫేజ్ కరెంట్‌ను ఏ ప్రాంతంలో ఏయే సమయంలో ఇవ్వనున్నామనే అంశంపై డిస్కమ్‌లు ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది.

వ్యవసాయ మోటార్లకు 2018 జనవరి 1 నుంచి 24 గంటల కరెంట్ ఇస్తున్నామని విద్యుత్తు సంస్థలు ప్రకటించిన విషయం తెలిసిందే. వాస్తవానికి ఏ రైతు కోరకపోయినా ప్రభుత్వమే ఈ నిర్ణయం తీసుకుంది. కానీ, ఇది కూడా కొంతకాలం పాటే నడిచింది. నాలుగున్నరేళ్లుగా సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల దాకా కోత విధిస్తున్నారు. 24 గంటల కరెంట్ నిర్ణయానికి వ్యతిరేకంగా అప్పట్లో పలు జిల్లా పరిషత్తులు తీర్మానం కూడా చేసి ప్రభుత్వానికి పంపించాయి. విద్యుత్తు సంస్థల అధికారులు కూడా 24 గంటల కరెంట్ వద్దని ముఖ్యమంత్రికి చెప్పారు. అయినా కేసీఆర్ వినకపోవడంతో డిస్కమ్‌ల పరిస్థితి ఉల్టా పల్టా అయింది. ఎనిమిదేళ్లలో రూ.46 వేల కోట్లకు పైగా నష్టాలను మూటగట్టుకున్నాయి. ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వకపోవడంతో నష్టనివారణ చర్యల్లో భాగంగానే త్రీఫేజ్‌కు క్రమంగా మంగళం పాడాయి.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

దక్షిణాది రాష్ట్రాలలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో పార్టీ శాఖలను బలోపేతం చేసి, కొత్త ఊపిరులూ దేందుకు భారతీయ జనతా పార్టీ కేంద్ర నాయకత్వం రెండు తెలుగు రాష్ట్రాలకూ నూతన అధ్యక్షులను ప్రకటించింది. వచ్చే ఏడాదిలో జరుగనున్న కేంద్ర, రాష్ట్ర ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేసేందుకు ఆ రాష్ట్రాల రాజకీయ, సామాజిక, ఆర్థిక సమీకరణాల గురించి అవగాహన ఉన్న నాయకులనే బీజేపీ కేంద్ర నాయకత్వం ఎంపిక చేయడం వల్ల క్యాడర్‌లో ఊపువచ్చింది.

బీజేపీలో కొత్త

ఈ క్రమంలోనే భారతీయ జనతాపార్టీ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షురాలిగా దగ్గుబాటి పురందేశ్వరి నియమితురాలు కావడంతో బీజేపీ క్యాడర్‌లో ఉత్సాహం నెలకొంది. రెండు పర్యాయాలు ఎంపీగా, కేంద్రమంత్రిగా, పార్టీ మహిళా మోర్చా ఇన్‌ఛార్జిగా, జాతీయ ప్రధానకార్యదర్శిగా పనిచేసిన అనుభవంతో ఆమె అన్ని వర్గాలకు దగ్గరయ్యారు.

తన తొలి మీడియా సమావేశంలోనే పురందేశ్వరి రానున్న ఎన్నికలలో పార్టీ పోరాట లక్ష్యాన్ని ప్రజలకు తెలియచేశారు. జగన్ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలను చేశారు. నాలుగేళ్ల వైసీపీ పాలన అన్ని రంగాల్లోనూ తీవ్ర వైఫల్యం చెందిందని, సమస్యలు పరిష్కరించక, అభివృద్ధి చేయక, ఉపాధి అవకాశాలు కల్పించక పేదరికాన్ని మరింత పెంచిందని ఆరోపించారు. ఇచ్చిన హామీలన్నిటిని బుట్టదాఖలు చేశారని విమర్శించారు. సమాజంలో శాంతిభద్రతలు క్షీణించాయని, ఏ ఒక్కరూ శాంతితో లేరని మండిపడ్డారు.

అంతేకాదు, రాష్ట్రంలో భారీ లిక్కర్ స్కాం జరుగుతోందని, నాణ్యతలేని మద్యంతో ప్రజల ప్రాణాలు తీస్తున్నారని.. పాతిక శాతం మద్యం అమ్మకాలకు బిల్లులు ఉండటంలేదని.. ఇదంతా తాడేపల్లి ప్యాలెస్‌కే వెళ్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వానికి నిర్మాణ, నిర్వహణ సామర్థ్యం లేకుంటే పోలవరం ప్రాజెక్టు బాధ్యతను కేంద్రానికి అప్పగించాలని సలహా ఇచ్చారు. అస్తవ్యస్త విధానాలవల్ల విలువైన ప్రజాధనంతో పాటు, సమయం వృథా అవుతూ పోలవరం పథకం లక్ష్యం నెరవేరడం లేదన్నారు. 2024 ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. వైసీపీ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని ఆమె స్పష్టం చేశారు. తన సామర్థ్యాన్ని నమ్మి పార్టీ అధ్యక్ష రాలిగా నియమించిన బీజేపీ జాతీయ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలను కలుపుకుని పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పురందేశ్వరి అన్నారు. ఇప్పటివరకు పార్టీకి సేవలు చేసిన మాజీ అధ్యక్షుల సలహాలు, మార్గ దర్శకత్వంతో ముందుకెళ్తానని కూడా ఆమె సభాముఖంగా చెప్పడం విశేషం.

ఏపీలో ప్రస్తుతం విచిత్రమైన పరిస్థితి నెలకొంది. కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ రాష్ట్రానికి సహకరించడం లేదని, నిధులు ఇవ్వడంలేదని, ప్రత్యేక హోదా ఇవ్వలేదని, పోలవరం ప్రాజెక్టుకు అడ్డుపడుతోందంటూ పలు అసత్య ప్రచారాలను రాజకీయ పార్టీలు చేస్తున్నాయి. కాగా, ప్రజల్లో ఏర్పడిన ఈ అపోహాలను తొలగించేందుకు ప్రయత్నిస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఓట్లతో నిమిత్తం లేకుండా రాష్ట్రానికి అవసరమైన సహకారాన్ని బీజేపీ అందిస్తోందని పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వం అందించిన నిధులు, ప్రాజెక్టుల వివరాలు, వాటిని అందిపుచ్చుకోలేని రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల వివరాలను సైతం బయటపెట్టారు. ఇళ్ల నిర్మాణం, పంచాయతీ నిధులు దారి మళ్లింపు, నాసిరకం మద్యం తయారీ, అధిక ధరలతో విక్రయం, ఇసుక మాఫియా, భూ కబ్జాలు, మైనింగ్ మాఫియా తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు.

కేంద్ర ప్రభుత్వం పేదల కోసం పీఎం ఆవాస్ యోజన ద్వారా ఇళ్లను నిర్మిస్తే వాటిని లబ్ధిదారులకు ఎందుకు ఇవ్వడం లేదని, నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఎందుకు పూర్తిచేయడం లేదని ముఖ్యమంత్రి జగన్‌ను పురందేశ్వరి ప్రశ్నించారు. ఈ అంశంపై వైసీపీ ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక్కో ఇంటికి రూ. 1.80 లక్షల ఆర్థిక సహాయం చొప్పున ఆంధ్రప్రదేశ్‌కు 22 లక్షల ఇళ్లను కేంద్రం కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. వీటి విలువ రూ. 32,500 కోట్లుగా ఉందని, 9 ఏళ్లుగా రూ. 20 వేల కోట్లు ఇళ్ల కోసం కేంద్రం ఇచ్చిందని, ఇప్పటి వరకు 65 శాతం నిర్మాణం పూర్తికావాల్సి ఉండగా 35 శాతం కూడా నిర్మాణం కాకపోవడాన్ని ఆమె పట్టి చూపారు. అలాగే రోడ్ల నిర్మాణం చేపట్టక పోవడాన్ని ఆక్షేపించారు. వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఒక్క రోడ్డును నిర్మించలేదు సరికదా ధ్వంసమైన రోడ్లకు మరమ్మతులు చేయలేదు. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో కాంట్రాక్టర్లకు పాతబకాయిలు చెల్లించకపోవడంతో రోడ్ల నిర్మాణానికి ఎవరూ ముందుకు రావడం లేదని ఆమె ఆరోపించారు.

రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం నిర్మించిన జాతీయ రహదారులు తప్ప మరే ఇతర రహదారుల నిర్మాణం జరగలేదని, 2014 నుంచి ఇప్పటి వరకు రూ. 1.15 లక్షల కోట్లతో 4,500 నూతన జాతీయ రహదారులు నిర్మించినట్లు చెప్పారు. అలాగే విభజన చట్టంలో పొందుపరచిన జాతీయ విద్యాసంస్థలను కూడా రెండేళ్ల వ్యవధిలోనే ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రూ. 1610 కోట్లతో ఎయిమ్స్, రూ. 700 కోట్లతో ఐఐటీ, రూ. 680 కోట్లతో ఐఐఎం, రూ. 130 కోట్లతో త్రిపుల్ ఐటీ, రూ. 300 కోట్లతో ఎన్ఐటీ, రూ. 600 కోట్లతో నార్కోటిక్స్, ఓషన్ టెక్నాలజీకి రూ. 250 కోట్లు, సెంట్రల్ వర్శిటీ, గిరిజన వర్శిటీ, ఆగ్రి వర్శిటీ, పెట్రోలియం వర్శిటీ స్థాపించామన్నారు. తిరుపతి,

విశాఖ విమానాశ్రయాలను అంతర్జాతీయ స్థాయికి పెంపు, విజయవాడ విమానాశ్రయం విస్తరణ, రాజమండ్రి, కర్నూలు, కడప విమానాశ్రయాల ఏర్పాటు విషయాన్ని ప్రస్తావించారు.

సాధ్యంకాకుంటే 'పోలవరం' వదిలేయండి!

పోలవరం ప్రాజెక్టు విషయంలో కేంద్రం సహకరించడం లేదనడం అవాస్తవమని పురందేశ్వరి చెప్పారు. గతంలో సకాలంలో యూసీలు, లెక్కలు ఇవ్వకపోవడం వలన నిధుల మంజూరులో జాప్యం జరిగిందన్నారు. ఇటీవల రూ. 12 వేల కోట్లను కేంద్రం మంజూరు చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని చెప్పారు. కేంద్రం సహకరించడం లేదనిపిస్తే జాతీయ ప్రాజెక్టు కాబట్టి తిరిగి

కేంద్రానికి అప్పజెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. జగన్ రివర్స్ టెండరింగ్‌లో చిన్న కాంట్రాక్టర్లు బలయ్యారంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రూ.50వేల కోట్ల వరకు కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బకాయి ఉందన్నారు.

భూ కబ్జాలు - అవినీతి ఆరోపణలు

వైసీపీ నేతలు ప్రైవేటు భూములను కూడా కొట్టేస్తున్నారని, ఆ పార్టీ నేతలకు, అధికారులకు ముడుపులు ముట్టచెబితేనే వెనక్కి ఇస్తున్నారని ఆమె ఆరోపించారు. 'విశాఖలో ఒకరి స్థలాన్ని కడప రౌడీలు కబ్జా చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం ఏకంగా జీఓ జారీచేసింది. అయితే ఆ వ్యక్తి సుప్రీం కోర్టు వరకూ వెళ్లారు. ఇలా చేయడం ఎంతమందికి సాధ్యమవుతుంది. దసపల్లా భూముల యజమానులపై ఒత్తిడి తెచ్చి, డెవలప్‌మెంట్ కింద 16 నుంచి 17శాతం ఇచ్చారు. ఇలా ఎక్కడైనా జరుగుతుందా?' అని ప్రశ్నించారు.

మైనింగ్ వ్యాపారుల్ని బెదిరించి వాటిని లాక్కుని తమ అనుయాయులకు అప్పగించి దోచుకోవడం జగన్ పాలనలో నిత్యకృత్యమైందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని, ఎన్నో సంస్థలు రాష్ట్రం నుంచి తరలివెళ్లి ఇతర రాష్ట్రాల్లో పెట్టుబడులు పెడుతున్నాయని ఆక్షేపించారు. కేంద్ర ప్రభుత్వం సహకరిస్తున్నా రాష్ట్రం అందిపుచ్చుకోవడంలో వైఫల్యం చెందిందన్నారు.

అవకాశాలు అంది
పుచ్చుకోవడంలోనూ అలసత్వం

ఏషియన్ డెవెలెప్‌మెంట్ బ్యాంకు ఆర్థిక సహకారంతో 4,211 కోట్లతో విశాఖ – చెన్నై పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు, విశాఖ, మదనపల్లి, దొనకొండ, శ్రీకాకుళం, కొప్పర్తిల్లో పారిశ్రామిక నోడ్‌ల ఏర్పాటుకు, కనిగిరి – చిత్తూరుల్లో నేషనల్ ఇండస్ట్రియల్ మాన్యుఫాక్చరింగ్ జోన్ (నిమ్జ్) ఏర్పాటుకు కేంద్రం అనుమతులు ఇస్తే రాష్ట్రం భూసేకరణ విషయంలో చేస్తున్న తీవ్ర జాప్యం కారణంగా ఈ ప్రాజెక్టులు అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఇదే నిమ్జ్‌ను రాజస్తాన్‌లో ఏర్పాటు చేస్తే రూ. 25 వేల కోట్ల పెట్టుబడులతో ఆ ప్రాంతం అభివృద్ధి చెంది ఉపాధి అవకాశాలు పెరిగాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ అలసత్వం కారణంగా లక్షలాది యువత ఉపాధి అవకాశాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నడికుడి – శ్రీకాళహస్తి రైల్వేలైను, కోటిపల్లి – నరసా పురం లైన్ల నిర్మాణానికి రాష్ట్రం సహకరించడం లేదని విమర్శించారు.

క్షీణించిన శాంతి భద్రతలు

రాష్ట్రంలో అన్నింటా దోపిడీ చేస్తూ 'తొడ గిల్లి–

వేల్లూరు జయప్రకాష్ నారాయణ

బుగ్గ నిమిరిన' చందంగా తాయిలాలతో మభ్యపెడుతున్నారంటూ పురందేశ్వరి మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపు తప్పిన విషయాన్ని కూడా ఆమె ప్రస్తావించారు. బాపట్లలో పదో తరగతి విద్యార్థిని పెట్రోల్ పోసి తగులబెట్టడం, సొంత బాబాయ్ హత్యలో దోషులను తేల్చలేక సీబీఐకి ఇవ్వడం, దిశ యాప్‌తో మహిళలకు రక్షణ అంటూ చెప్పి మాటలకే పరిమితం కావడం, నెల్లూరులో పట్టపగలు ఒక ఇంట్లోకి ఆగంతకులు చొరబడి రెండు కిలోల బంగారం, నగదు తీసుకెళ్లడం ఇక్కడి శాంతి భద్రతల పరిస్థితికి అద్దం పడుతుందన్నారు.

విశాఖపట్నంలో సాక్షాత్తు పార్లమెంటు సభ్యుడి కుటుంబ సభ్యులను కిడ్నాప్ చేశారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎంపీ కుటుంబానికే రక్షణ కల్పించలేని ప్రభుత్వం ఇక ప్రజలను ఏం రక్షిస్తుందని ఆమె ప్రశ్నించారు.

రాష్ట్రానికి కేంద్రం ఆర్థిక సహాయం

రాష్ట్రానికి ఆర్థిక సహాయం ఇచ్చే విషయంలో కేంద్రం ఎప్పుడూ ఆలసత్వం చూపించలేదని పురందేశ్వరి పేర్కొన్నారు. రాష్ట్రాల అభివృద్ధికి గతంలో యూపీఏ ప్రభుత్వం హయాంలో 32 శాతం మాత్రమే ఇస్తే నేడు ఆ వాటాను బీజేపీ ప్రభుత్వం 42 శాతం పెంచింది. ఏపీకి 2023-24కు సంబంధించి రూ. 41,300 కోట్లు అందనుంది. ఇందులో గ్రాంట్ల రూపంలో రూ. 46,835 కోట్లు లభిస్తుంది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం 2021-26 వరకు రాష్ట్రానికి రూ. 23,037 కోట్లు అందనున్నాయన్నారు.

జీఎస్‌టీ 2023-24కు 3,500 కోట్లు లభిస్తుందని చెప్పారు. గ్రామీణా భివృద్ధికి కేంద్రం నిధులను నేరుగా జమ చేస్తే, ఆ నిధులను రాజ్యాంగ విరుద్ధంగా వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించుకుంటోందని, ఉద్యమాలు చేస్తున్న సర్పంచ్‌ల డిమాండ్‌లకు తలొగ్గి ఆ నిధులను వెంటనే పంచాయతీలకు బదిలీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. వైసీపీ వైఫల్యాలను విమర్శిస్తూనే రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ, సహకారాల గురించి పురందేశ్వరి వివరించడం గమనార్హ.

వ్యాసకర్త: చైర్మన్, సెంట్రల్ లేబర్ వెల్ఫేర్ బోర్డు, కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ.

స్ఫూర్తిమంతుడు జాంబవంతుడు

శ్రీ మహావిష్ణువు దశావతారాల్లో కొన్నింటిని (బహుశా నాలుగు కూర్మ, వామన, రామ, కృష్ణావతారాలు) చూసిన పరమభక్తుడు జాంబవంతుడు. సమస్త భూమండలాన్ని ఎన్నోసార్లు ప్రదక్షిణ చేసినవాడు. క్షీరసాగర మథనం జరుగుతున్నపుడు దేవతల కోరిక మేరకు భూగోళంపై వున్న ఔషధులన్నింటినీ అందులో పోశాడు. బలి చక్రవర్తి యజ్ఞం చేసినప్పుడు మహావిష్ణువు త్రివిక్రమావతారం ఎత్తినప్పుడు, సురగంగతో బ్రహ్మపాదాలు కడిగే సమయాన జాంబవంతుడు త్రివిక్రముడుకి అనేక ప్రదక్షిణలు చేశాడు.

* * *

జాంబవంతుడు బ్రహ్మ ఆవులించగా పుట్టిన భల్లూకరాజు. కృతయుగం నుండి ద్వాపరయుగం వరకు ఆయన ప్రస్తావన కనిపిస్తుంది. క్షీరసాగర మథనం సమయంలోను, వామనావతారం సమయంలోను జాంబవంతుడు ఉన్నాడు. రామాయణంలో రాముని పక్షాన పోరాడాడు. అడవిలో తనకు లభించిన శ్యమంతకమణితో పాటు తన కుమార్తె జాంబవతిని కృష్ణునికి సమర్పించాడు..

త్రేతాయుగంలో హనుమంత, అంగదాది వానర వీరులతో

అంతరంగశుద్ధి

❋ తాత్వి'కత' ❋

ఓ

ఒకసారి, ఒక గ్రామం లోని పెద్ద మనుషులు కొందరు ఆ ఊరికి దూరంగా ప్రశాంత వాతావరణంలో తపస్సు చేసుకుంటున్న ఒక ముని వద్దకు వెళ్లారు. వినయంగా నమస్కరించి చేతులు కట్టుకుని నిలబడ్డారు. వారిని ఆశీర్వదించిన ఆ ముని వారికి ఏం కావాలని అడిగాడు.

'మహాత్మా, గ్రామంలో ఒకే ఒక బావి ఉంది. మేము ఆ బావిలో నీరు తాగలేకపోతున్నాము' విన్నవించుకున్నారు.

"ఎందుకు, ఏమి జరిగింది? మీరు దాని నుండి నీరు ఎందుకు త్రాగలేకపోతున్నారు?" అని అడిగాడు ఆ ముని.

"మూడు కుక్కలు ఒకదానితో ఒకటి కొట్టుకుని బావిలో పడ్డాయి. అవి బయటకు రాలేక అందులో మునిగి చనిపోయాయి. ఇప్పుడు నీరు బాగా దుర్వాసన వస్తోంది, ఆ నీరు ఎలా తాగాలి?" అని గ్రామస్తులు అన్నారు.

"ఒక పని చేయండి, పవిత్రమైన గంగానది జలాన్ని తెచ్చి ఆ బావిలో కలపండి" అని చెప్పాడు.

"అలా ఎనిమిది నుంచి పది బకెట్ల గంగాజలం బావిలో పోసినా సమస్య అలాగే ఉండిపోయింది."

గ్రామస్థులు మళ్లీ ముని వద్దకు వెళ్లారు.

"సరే, మీరందరూ సమావేశమై భగవంతుని నామాన్ని జపిస్తూ, ప్రార్థన చేయండి," అన్నాడు.

ప్రజలు 'అలాగే!' అని, సాధువు సూచించినట్లు చేసారు, అయినప్పటికీ సమస్య అలాగే ఉంది.

ఈ సారి ఆ ముని "బావిలో కొన్ని సువాసన వచ్చే పదార్థాలు వేయండి" అని చెప్పాడు.

అది కూడా జరిగింది, కానీ! సమస్య ఇంకా కొనసాగింది.

ఇప్పుడు ఇంక ముని స్వయంగా బావి వద్దకు వచ్చాడు.

"చూడండి స్వామీ, పరిస్థితి అలాగే ఉంది, మేం ప్రతిదీ ప్రయత్నించి చూసాం, పవిత్ర గంగాజలం పోశాం, ప్రార్థనలు చేశాం. కీర్తనలు ఆలపించాం. ప్రసాదం పంచాము, బావిలో సువాసనగల పువ్వులు, పదార్థాలు వేసాం అని వివరించారు.

సాధువు అయోమయంగా చూస్తూ అడిగాడు, "అన్నీ చేసారు, కానీ ఈ బావిలో పడి, చనిపోయిన మూడు కుక్కల మృతదేహాలను తొలగించారా?"

గ్రామస్తులు, "అదేంటి, మీరు అలా చేయమని మాకు చెప్పలేదు కదా, మేం వాటిని బయటకు తీయలేదు, మిగిలినవన్నీ చేసాం, కానీ కుక్కలు ఇప్పటికీ బావిలోనే ఉన్నాయి!" అన్నారు.

వారి సమాధానానికి దిగ్భ్రాంతి చెందాడు ముని. కానీ ప్రశాంతంగా గ్రామస్తులకు ఇలా వివరించాడు.. "ఆ మూడు మృతదేహాలను బయటకు

దోర్బల పూర్ణిమాస్వాతి

సీతాన్వేషణకై సిద్ధమయ్యాడు. శతయోజన విస్తీర్ణమైన సాగరాన్ని దాటే ఉపాయం తెలియక వానరవీరులు విషణ్ణ వదనాలతో ప్రాయోపవేశానికి సిద్ధమవుతారు. కార్య నిర్వహణకు హనుమ సర్వ సమర్థుడని జాంబవంతుడే వారికి తెలియజెప్పాడు. హనుమంతుడికి ఆయన జన్మ వృత్తాంతం, శాపాల్లాంటి వరాల గూర్చి చెప్పి ఆయనకు ప్రేరణ నిచ్చాడు. యుద్ధరంగంలో మృతప్రాయులై పడి ఉన్నవారిలో బ్రతికినవారి కోసం విభీషణుడు, హనుమంతుడు వెదుకసాగారు. అప్పుడు జాంబవంతుడు కొద్దిగా తెలివి తెచ్చుకొని "అంజనా కుమారుడు ఆంజనేయుడు చిరంజీవిగానే ఉన్నాడు గదా?" అని అడిగాడు.

ఆశ్చర్యచకితుడైన విభీషణుడు 'తాతా! రామలక్ష్మణులు, అంగద, సుగ్రీవుల గురించి కాకుండా కేవలం హనుమంతుని గురించి మాత్రమే ఎందుకడుగు తున్నావు?" అని ప్రశ్నిస్తాడు.

"హనుమ సజీవుడుగా ఉంటే వానరసేన చచ్చినా బతికి తీరుతుందన్నమాటే. అందుకు భిన్నంగా జరిగితే మేము బతుకున్నా మృతులమే! వేగంలో వాయువుతోనూ, పరాక్రమంలో అగ్నితోనూ సరిసమానుడయిన హనుమంతుడుంటేనే మాకు ప్రాణాలపై ఆశ ఉంటుంది" అని చెబుతాడు. హనుమపై ఆయనకున్న విశ్వాసం అటువంటిది. అప్పుడు జాంబవంతుడు హనుమంతుణ్ణి ఆలింగనం చేసుకుని, బ్రహ్మాస్త్ర ప్రభావం వల్ల మూర్ఛితులైన వారిని కాపాడటం కోసం హిమగిరుల్లోని ఔషధాలను హనుమతో తెప్పిస్తాడు.

రామ రావణ యుద్ధం ముగిసిన తర్వాత రాముడు తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు చెప్తుండగా, జాంబవంతుడు మాత్రం తనకు సత్కారానికి బదులు రాముడితో ద్వంద్వ యుద్ధం చేయాలన్న అభిలాషను వ్యక్త పరుస్తాడు. తరువాత యుగంలో (ద్వాపరం) ఆ కోరిక తీరుతుందని రాముడు అతనిని ఆలింగనం చేసుకున్నాడు. కౌగలించుకుని నీ కోరిక తర్వాత తీరుస్తానని చెబుతాడు. ★

తీసే వరకు, బాహ్య చర్యలు ఎటువంటి ప్రభావం చూపవు, ముందుగా మీరు నీటి నుండి ఆ మురికిని బయటకు తీయాలి' అని హితవు చెప్పారు.

మన జీవిత కథ కూడా అలాంటిదే. దేహంలో.. 'కామం, క్రోధం, లోభం, అసూయ' అనే జంతువులు పోట్లాడుకుని, 'మనస్సాక్షి' అనే బావిలో చెదపురుగుల్లా చిక్కుకుపోయాయి. అవి మెల్లగా మన మనస్సాక్షిని లోపలి నుండి తినేస్తున్నాయి. మన జీవితాలను మెరుగుపరచుకోవడానికి బయటి నుండి చాలా కొత్త విషయాలను లోపలికి తీసుకుంటున్నాం, అయితే లోపల ఇప్పటికే కుళ్లి పోయిన లేదా పేరుకుపోయిన వాటిని తొలగించడానికి మనం ఏమి చేస్తున్నామో ఆలోచించాలి. ★

ప్రకృతి మనకు ప్రసాదించిన ఔషధ గుణాలు కలిగిన పండ్ల చెట్లల్లో విరిగి చెట్టు కూడా ఒకటి. దీనినే నక్కెర పండ్ల చెట్టు, బంక నక్కెర చెట్టు, యంక కాయల చెట్టు అనీ పిలుస్తారు. దీనిని ఇంగ్లీష్ లో ఇండియన్ చెర్రీని అని, హిందీలో లసోరా, లసోడా అని పిలుస్తారు. ఇవి ఎక్కువగా గ్రామాల్లో, రోడ్ల పక్కన కనిపిస్తాయి.ఈ కాయలు గుత్తుగుత్తులుగా కాస్తాయి. చాలామంది వీటిని ఎంతో ఇష్టంగా తింటారు. పండినవి మరింత రుచిగా ఉంటాయి. ఈ కాయలు లోపల బంకలాగా ఉండి తియ్యగా ఉంటాయి. కొందరు ఈ కాయలతో పచ్చడి చేసుకుంటారు.

ఈ చెట్టు ప్రతి భాగం ఔషధ గుణాలను కలిగి ఉంది. ఈ నక్కెర పండ్లు మనకు డ్రై ఫ్రూట్స్ రూపంలో కూడా లభిస్తాయి. ఈ పండ్లల్లో కాల్షియం, జింక్, ఐరన్, ప్రోటీన్స్, కాపర్, జింక్ వంటి ఎన్నో పోషకాలు ఉంటాయి. ఈ పండ్లను తినడం వల్ల శరీరానికి చలువ చేస్తుంది. రక్తదోషాలు పోతాయి. పండ్లను తినడం వల్ల పురుషులలో లైంగిక సమస్యలు తొలగిపోయి వీర్య కణాల సంఖ్య పెరుగుతుంది. జీర్ణ సామర్థ్యం పెరుగుతుంది. తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అజీర్తి సమస్య లతో బాధపడేవారు ఈ పండ్లను తినడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఈ చెట్టు ఆకులకు తలనొప్పిని తగ్గించే గుణం ఉంది. ఈ చెట్టు లేత ఆకులను పేస్ట్‌గా చేసి నుదుటిపై రాసుకోవాలి. అలాగే ఈ చెట్టు బెరడును పేస్ట్ గా చేసి చర్మ సమస్యలు ఉన్న చోట లేపనంగా రాసుకుంటే చర్మ సమస్యలు తగ్గిపోతాయి.

తరువాత ఈ నీటిని వడకట్టగా వచ్చిన కషాయాన్ని పుక్కిలిస్తే దంతాలు, చిగుర్లు ఆరోగ్యంగా మారతాయి. నోటి దుర్వాసన, నోటి పూత తగ్గుతాయి. అలాగే ఈ బెరడు కషాయంతో గాయాలను కడగడం వల్ల గాయాలు త్వరగా మానుతాయి. ఇంటి పెరట్లో వీటిని పెంచుకోవడం సులువే. ★

"ఇప్పుడు కూడా అలాంటి ఆలోచన ఉంది. అయితే, ఇది వ్యాపార పత్రిక కాదు. ఇందులో వ్యాపారం కోసం రచనలు వ్యాపారం కోసం ఉండవు. అలా అని, పూర్తిగా పాతకాలంలోకి వెళ్లిపోం. ఇప్పుడు జరిగేదంతా విధ్వంసం. రానున్న రోజులన్నీ చెడ్డవి అని చెప్పేలా ఉండవు. పత్రికకి కొన్ని గైడ్‌లైన్స్ పెట్టుకోవాలి. ఓ కమిటీ ఉంటుంది. అంతిమంగా నిర్ణయం మాత్రం నేను తీసుకుంటాను".

"బాగుంది సర్".

"బాగుంటుందంటావా? ఇక్కడ కూడా సమస్యలు వస్తాయా?"

"సమస్యలు ఎప్పుడూ వస్తుంటాయి సర్... మనం లాభాలు ఆశించనప్పుడు, ఓ ప్రయోజనం కోసం మంచి పనులు చేయాలనుకుంటే అవి వస్తాయి. అంత మాత్రాన అలాంటి ప్రయత్నమే వద్దు అనటం సరైంది కాదు" అన్నాడు రిత్విక్.

"గుడ్... మనం మళ్లీ మాట్లాడుకుందాం."

రిత్విక్ నమస్కరించి తన గదికి వచ్చాడు. తనని ఇప్పటికిప్పుడు ఎందుకు రమ్మన్నారో ఓ అంచనా వచ్చేలా ఉంది. ఈ వయసులో రామకృష్ణ గారు పత్రిక గురించి మాట్లాడటం కూడా కాస్త ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

* * *

ఆద్య ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతోంది.

"నేను విన్నాను. ఇంతకు ముందు పత్రికల్లో చదివాను. అదో గొప్ప అనుభవం అవుతుంది. తప్పకుండా వస్తాను. ష్యూర్! నువ్వు ఆ ఏర్పాట్లు చూడు. అలాగే," అని ఫోన్ కట్ చేసి వెనక్కి తిరిగింది. అక్కడ ఆదర్శ్ ఉన్నాడు.

"నీ పర్మిషన్ లేకుండా నీ స్పేస్‌లోకి అడుగు పెట్టాను ఆద్యా...." అన్నాడు.

అప్పుడు తండ్రి ముఖంలోకి చూసింది.

"నన్ను వెక్కిరిస్తున్నారా?"

"నీకు అలా అనిపించిందా?"

"దిసీజ్ నాట్ మై స్పేస్ నాన్నా...నా స్పేస్ ఇక్కడ వుంది" అని తన మెదడు చూపించింది.

అతని ముఖంలో భావాలు మారాయి.

"ఇది మమ్మీ స్పేస్. అఫ్ కోర్స్ మీది కూడా. నేను ఇక్కడ ఓ బాటసారిని. కొన్ని రోజులు ఉండి వెళ్లిపోయే అతిథిని. తర్వాతయినా నాదైన స్పేస్‌ని ఏర్పాటు చేసుకోవాలనుకుంటున్న ఓ ఆశాజీవిని".

"నీతో మాట్లాడాలి. ఇక్కడ మాట్లాడుకుందామా? బయటకు వెళ్దామా?"

"ఓపెన్‌గా మాట్లాడుకోవటానికి ఓపెన్ స్పేస్ ఎప్పుడూ బాగుంటుంది" అంది ఆద్య. పది నిమిషాల తర్వాత ఆదర్శ్ కారు డ్రైవ్ చేస్తున్నాడు. డ్రిజిల్ అవుతోంది... సన్నటి వాన చినుకులు.... వైపర్స్ పని చేస్తున్నాయి.

"అద్దం మీద వాన చినుకులు బాగుంటాయి" అంది.

"వాటిని క్లియర్ చేయకపోతే దారి కనిపించదు"

అప్పుడు తండ్రి కేసి చూసింది...

ఎండివై రామమూర్తి స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన

10

వాన చినుకులు ఆగిపోయాయి.

"ఎందుకు చినుకులు పడతాయో... ఎందుకు ఆగిపోతాయో" స్వగతంగా అనుకున్నాడు.

"ఇప్పుడు రుతువులు కూడా మారిపోతున్నాయి. అకాల వర్షాలు వస్తున్నాయి. అలాగే ఎండలు మండిపోతున్నాయి" అంది ఆద్య. అలా నెక్లెస్ రోడ్‌లోకి కారు మలుపు తిరిగింది.

పది నిమిషాల తర్వాత హుస్సేన్ సాగర్ ఒడ్డున ఇద్దరూ కూర్చున్నారు. ఎదురుగా బుద్ధ విగ్రహం కనిపిస్తోంది!

"నువ్వు ఎవరితోనో మాట్లాడుతున్నావు ఆద్యా... నేను వస్తాను, అంటున్నావు..."

"నా ఫ్రెండ్‌తో మాట్లాడాను... బాయ్ ఫ్రెండ్ కాదు" అంది నీటిని చూస్తూ ...

అప్పుడు ఆద్యని చూసాడు. తన ముఖంలో ఎలాంటి ఫీలింగ్స్ లేవు.

''నేను జైపూర్ వస్తా నన్నాను డాడ్".

"రాజస్థాన్ చూడాలనా – నాకు చెబితే మనం ముగ్గురం కలిసి వెళ్లేవాళ్లం".

"నేను వెళ్లేది రాజస్థాన్ చూడటానికి కాదు. లిటరరీ ఫెస్ట్‌కి వెళ్తున్నాను".

''లిటరరీ ఫెస్ట్ కా? వాళ్లు నిన్ను ఇన్‌వైట్ చేసారా?"

"లేదు. ఇంట్రెస్ట్ ఉన్న వారు ఎవరయినా పార్టిసిపేట్ చేయవచ్చు. అక్కడికి చాలా దేశాల నుంచి రైటర్స్ వస్తారు. క్రియేటర్స్ వస్తారు. మోర్ వాయిసెస్... ఈ ప్రపంచంలో భిన్న కాంటినెంట్స్‌లో థాట్ ప్రాసెస్ ఎలా ఉందో తెలుసు కోవచ్చు".

"అక్కడ రాజకీయాలు ఉంటాయంటారు"

"రాజకీయం లేని చోటు ఎక్కడ ఉంది నాన్నా... ఇంట్లో ఉండవా! ఇప్పుడు అవన్నీ ఎందుకు? మీరు ఏదో మాట్లాడాలన్నారు" అంది ఆద్య.

"మన మధ్య దూరం పెరుగుతోంది అనిపించింది. ముఖ్యంగా మీ అమ్మకీ, నీకూ మధ్యన".

"అమ్మ నాతో మాట్లాడటం లేదు. సీరియస్‌గా ఉంటోంది. ఒకే కప్పు కింద బతుకుతూ ఇలా ఉండటం నాకూ యిబ్బందిగా వుంది. అందుకని నేను హాస్టల్‌కి వెళ్లాలనుకుంటున్నాను నాన్నా...."

"అలాంటి నిర్ణయానికి వచ్చావా?"

"ఆ జీవితం నాకు కొత్తకాదు. చిన్నప్పుడే నన్ను చాలా దూరం పంపించి చదివించారు. అప్పుడు నాకు అమ్మా-నాన్నలతో పాటు, గ్రాండ్ పేరెంట్స్ కూడా గుర్తొచ్చే వారు. రాత్రిపూట నేను దుప్పటి ముసుగులో ఏడ్చేదాన్ని. తర్వాత అలవాటు పడ్డాను. అయిన వారందరికీ దూరంగా ఉండటం నాకు నచ్చలేదు. అందుకే వచ్చేశాను" అంది.

"నీ మీద ప్రేమ లేక కాదు. నీకు మంచి ఎడ్యుకేషన్ ఇవ్వాలని అక్కడికి పంపించాం".

"మంచి ఎడ్యుకేషన్ అంటే ఏంటి నాన్నా?"

అతను మాట్లాడలేకపోయాడు.

"ఇంటిని మించి, కుటుంబంలోని రిలేషన్స్ మించిన విద్య ఉందని నేను అనుకోను. అందులోనూ ఆ వయసులో... పిల్లలు కథలు వినాలనుకుంటారు. తమని హగ్ చేసుకోవాలి. చిన్న ముద్దులు ఇవ్వాలి. అలగాలి, అల్లర్లు చేయాలి అని కోరుకుంటారు".

"అవన్నీ చేస్తున్నావనే కదా... అంత దూరం పంపించింది".

"ఇది కూడా ఉందా! ఇప్పుడు కూడా అంతేగా. నేను ప్రశ్నలు అడగటం మీకు చిన్నపిల్లల అల్లరిగా అనిపిస్తోంది. అప్పుడు నేను, ఇప్పుడు మీరు అడుగుతున్నాం".

"నువ్వు బయటకు వెళ్లటం నాకు ఇష్టం లేదు. నువ్వు అమ్మతో మాట్లాడు. మన మధ్య ఇంకా దూరం పెరగకూడదు".

"ఇది అమ్మకు చెప్పారా?"

"చెప్పాను. నువ్వింక చిన్నపిల్లవి కాదు అని గుర్తించమన్నాను. అలాగే నువ్వు ఏం చదువుతావో నీ ఇష్టం. ఇందులో మా జోక్యం వుండదు. ఇంట్లో ఉన్నది మనం ముగ్గురం. నేను నా వ్యాపారంలో బిజీగాఉంటాను. నువ్వు నీ చదువులో తీరిక లేకుండా వుంటావు. మనందరికీ దొరికే సమయం ఎంత? ఆ కొద్ది గంటలైనా మనం ఎలాంటి వివాదాలు లేకుండా సరదాగా గడపలేమా? నువ్వే అంటున్నావు...ఇంక నేను మీ దగ్గర ఉండేది కొన్ని సంవత్సరాలు మాత్రమే అని.... అప్పటి దాకా సంతోషంగా ఉందాం".

ఆద్య మాట్లాడలేదు. బుద్ధుడిని చూస్తోంది.

"ఇంతకు ముందు బుద్ధుడిని చాలాసార్లు చూసావు".

"ప్రతిసారీ కొత్తగా వుంటుంది డాడీ... సన్ రైజ్ ... సన్ సెట్‌ని రోజూ చూస్తున్నామని బోర్ కొడుతుందా?"

"అమ్మా నాన్నలు కూడా అంతే ఆద్య".

"కుటుంబంలో అమ్మా నాన్నలే ఉండరు నాన్నా".

అప్పుడు అతన్నో పవనం బలంగా తాకి వెళ్లింది. ఆకాశం కేసి చూసాడు. మబ్బులు కమ్ముకుంటున్నాయి.

"వర్షం వచ్చేలా వుంది. మనం బయలు దేరదాం".

"వర్షం బుద్ధుడిని తడుపుతుంటే చూడాలని ఉంది. కారులో కూర్చుందాం. చాలామంది బుద్ధావతారం అని వ్యంగ్యంగానూ, సరదాగానూ అంటారు. శిలలా ఉంటాడనా! ఆయన జీవితం గురించి తెలుసుకోవాలనుకుంటున్నాను. ఇప్పటికీ ప్రపంచానికి ఆయన దారి చూపిస్తున్నాడు. బుద్ధుడిని అర్థం

పి. చంద్రశేఖర ఆజాద్
9246573575

చేసుకోవటం అంత సులభం కాదు".

"బుద్ధుడిలో లోపాలు లేవంటావా ఆద్య".

"అవి ఏంటో మీరు చెప్పండి".

"కట్టుకున్న భార్యని, కన్న కొడుకుని వదిలిపెట్టి వెళ్లిపోయాడు" అన్నాడు ఆదర్శ్.

"ఆయన మనిషి నాన్నా..." అంది.

అప్పుడు కూతుర్ని ఆశ్చర్యంగా చూసాడు.

"మీ పేరు ఆదర్శ్ అని తాత ఎందుకు పెట్టాడో తెలియదు. నాకు మీరు ఆద్య అని ఎందుకు పెట్టారో తెలియదు. మనం ఆ పేర్లకు తగినట్లు ప్రవర్తిస్తున్నామా? ఇప్పటి వరకు యశోధర కోణం నుంచి చాలా రచనలు వచ్చాయి. చరిత్రని ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు రాస్తారు, వ్యాఖ్యానిస్తారు. నాకు తెలిసి బుద్ధుడి కోణం నుంచి రాసిన రచన నా దృష్టికి రాలేదు. అతను అలా చేయటానికి వెనకాల కారణాలను, ఇంకో కోణంలో చూడవచ్చు కదా".

"అలాంటి పని నువ్వుకూడా చేయవచ్చు. ఎం.ఎ. లిటరేచర్ చేస్తానంటు న్నావుగా" అన్నాడు ఆదర్శ్.

* * *

కొంతమందికి కొన్ని అభిప్రాయాలుంటాయి. కొందరు నాటకాలను విపరీతంగా ప్రేమిస్తుంటారు. నాటకం రాసినవాడే నిజమైన రచయిత అని వారు నమ్ముతారు. అందులో డ్రామా ఉంటుంది. కేవలం గంటన్నర, రెండు గంటలలోపు ఓ జీవన దృశ్యాన్ని చూపించగలగాలి. సినిమా వేరు. వాళ్లు ఎక్కడి కయినా, ఏ లొకేషన్‌కైనా వెళ్లవచ్చు. వారికి ఎనభై నుంచి వంద దృశ్యాలు కావాలి. అందులో పాటలు ఉంటాయి. యుద్ధాలు ఉంటాయి.

రిత్విక్ లైబ్రరీ అద్దాల ముందు నిలబడి చూస్తుంటే గోవింద్ వచ్చాడు. అతన్ని చూసి "రేర్ కలెక్షన్ సర్" అన్నాడు.

"ఇందులో రామకృష్ణగారు సేకరించిన బుక్స్ వున్నాయి. మన ఆఫీస్‌లో ఇంకో పెద్ద లైబ్రరీఉంది".

"ఇవన్నీ చదవటానికి ఎన్ని సంవత్సరాలు కావాలి సర్...."

"ఏ సంస్థకయినా లైబ్రరీ చాలా అవసరం రిత్విక్... ఎప్పుడు ఏ అవసరం వస్తుందో తెలియదు. ఇలాంటి బుక్స్‌ని డిజిటలైజ్ కూడా చేయిస్తున్నాను. రా... కూర్చుందాం" అని తీసుకువెళ్లాడు. ఇద్దరూ కూర్చున్నారు.

"ఇప్పుడు మనం మళ్లీ పెద్ద ఎత్తున నవలల పోటీ పెడుతున్నాం రిత్విక్... అవన్నీ ఫైనలైజ్ చేసి వస్తున్నాను" అనగానే రిత్విక్ ముఖంలో ఓ రేఖ కదిలి మాయం అయింది.

"ఈ పోటీకి నువ్వు రాయటం లేదు. అంత సమయం నీకు ఉండదు"

"నేను చాలా పోటీల్లో పాల్గొనలేదు సర్. అప్పుడు సీరియల్స్‌తో బిజీగా ఉన్నాను. ఇప్పుడు ఆ బాధ నాకు లేదు".

ఆయన చిన్నగా నవ్వాడు.

"రామకృష్ణగారు కూడా ఓ పత్రిక పెట్టాలి అన్నారు"

"అవును. ఇలాంటి ఆలోచన వారికి ఎప్పుడో ఉంది. అందులోనూ, అది ఆయన డ్రీమ్ ప్రాజెక్ట్. నేను కూడా పెట్టమన్నాను. ఆ పత్రికకి సర్క్యులేషన్ పెరగాలి. పోటీ పడాలి లాంటి సమస్యలు లేవు. అయిదారు సంవత్సరాల క్రితమే ఇది జరగాల్సింది. తొందర్లోనే పత్రిక తీసుకు రావాలని ఆయన ఆరాటపడుతున్నారు" అన్నాడు గోవింద్.

ఆ తర్వాత మళ్లీ చెప్పటం ఆరంభించాడు.

"ఆ మధ్య సినిమా గురించి మనం మాట్లాడు కున్నాం. అది పూర్తికాలేదు. ఇప్పుడు నా స్నేహితుడూ, అభిమాని అయిన ఓ రచయిత కథ నీకు చెబు తున్నాను" అన్నాడు.

* * *

అతను ముందు చిన్న చిన్న కవితలు రాసేవాడు. తర్వాత నాటకాలు రాయటం మొదలుపెట్టాడు. స్వయంగా నటుడు కూడా. తెలుగు ప్రాంతాల్లోనే కాకుండా ఢిల్లీ, ముంబై, బెంగళూరు, కొల్‌కతా, ఇంకొన్ని నగరాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. అలాగే, అప్పటి మద్రాసు నగరంలో కూడా!

అలా అతని పేరు సినిమా వారి దృష్టికి వచ్చింది.

కొంతమందికి కొన్ని అభిప్రాయాలుంటాయి. కొందరు నాటకాలను విపరీతంగా ప్రేమిస్తుంటారు. నాటకం రాసినవాడే నిజమైన రచయిత అని వారు నమ్ముతారు. అందులో డ్రామా ఉంటుంది. కేవలం గంటన్నర, రెండు గంటలలోపు ఓ జీవన దృశ్యాన్ని చూపించగలగాలి. సినిమా వేరు. వాళ్లు ఎక్కడి కయినా, ఏ లొకేషన్‌కైనా వెళ్లవచ్చు. వారికి ఎనభై నుంచి వంద దృశ్యాలు కావాలి. అందులో పాటలు ఉంటాయి. యుద్ధాలు ఉంటాయి.

ప్రకృతిని భిన్న కోణాల్లో చూపించవచ్చు. చిన్న చిన్న షాట్స్‌లో గొప్ప అనుభూతిని, విషాదాన్ని పండించవచ్చు. నాటకంలో అలాంటి అవకాశాలు తక్కువ. కేవలం రెండు మూడు సెట్లు వుంటాయి. అందులోనే అన్నీ చూపించాలి. ముఖ్యంగా స్త్రీ పాత్రలు తక్కువ ఉంటాయి. ఆ పాత్రలు పోషించే వారూ తక్కువగా వుంటారు. ఇలాంటి సమస్యలు అనేకం ఉన్నాయి.

అలాంటి చోట ప్రేక్షకులతో చప్పట్లు కొట్టిం చటం, వారిని నాటకంలో లీనం చేయటంలో కీలకపాత్ర రచయితలది.

అందుకే నాటక రచయితకి జీవితం, నాటకీయత తెలిసి, అనుభవిస్తేనే ఏ నాటకం అయినా పండు తుంది అంటారు. అలా, అతను సినిమా రంగంలోకి వచ్చాడు. నాలుగయిదు సినిమాల వరకు అతని రచనలు నాటకాల్లానే ఉం దేవి...

"ఇతనెవరో కొత్త రచయిత వచ్చాడు. బాగా రాస్తున్నాడు" అనుకున్నారు ప్రేక్షకులు. అప్పుడు ఓ చిన్న సినిమా పెద్ద హిట్ అయింది. పెద్ద నిర్మాతలు, దర్శకులు, హీరోల దృష్టి అతని మీద పడింది.

అప్పటి నుంచి అతని జీవితం మారిపోయింది. అతను వంద సినిమాలు రాస్తే అందులో డెభ్భై సినిమాలు హిట్లు! పదిహేను సినిమాలు యావరేజ్, అయిదు మాత్రం డిజాస్టర్స్... ఇప్పటికీ అతని ప్రయాణం సాగుతోంది. ఇదీ స్థూలంగా అతని ఇంట్రడక్షన్.

అసలు కథలోకి వస్తే ఆ రచయితకి ఒకడే కొడుకు. మంచి అందగాడు. ఆరు అడుగుల ఎత్తు. ఎంతోమంది హీరోలను పరిచయం చేసిన ఆ రచయిత తన కొడుకుని హీరోని చేయాలనుకున్నాడు. అందుకు అన్ని విభాగాల్లో కొడుక్కి శిక్షణ ఇప్పిస్తు న్నప్పుడు, తను ఓ కథను తయారు చేసుకున్నాడు. ఈ సినిమాకి తనే దర్శకత్వం వహించాలి. అంతేకాదు నిర్మాత కూడా తనే....

మిత్రుల దగ్గర డబ్బులు అప్పు అడిగాడు. అందరూ తమ సహకారం ఇస్తామన్నారు. అతను అడిగితే ఏ పెద్ద నిర్మాతయినా, దర్శకుడైనా ఆ అబ్బాయిని పరిచయం చేస్తారు. అప్పటికీ అడిగారు.

"ఈ ఒక్క సినిమాని నాకువదిలిపెట్టండి. తర్వాత మీ ఇష్టం" అన్నాడు. ఆ సినిమా మొదలు పెట్టటానికి అన్ని ఏర్పాట్లూ జరిగాయి. అప్పుడు తెలిసింది.

"ఆ అబ్బాయికి కేన్సర్. అతను మూడు నెలలకు మించి బతకడు" అని!

* * *

"జీవితం చాలా క్రూరమైంది రిత్విక్... అది అతని జీవితంలో ఎలాంటి కల్లోలాన్ని రేపి ఉంటుందో ఆలోచించు. ఇప్పటికే నీకు ఆ రచయిత గురించి తెలిసి ఉంటుంది. వాళ్ల అబ్బాయి చనిపోవటం గురించి కూడా...."

"అవును సర్".

"ఇది జరిగి కూడా రెండు దశాబ్దాలు దాటాయి. బట్... అతను ఏ క్షణం తన కొడుకుని మరిచి పో లేదు. అప్పటినుంచి అతని జీవితం మారి పోయింది. అతను సినిమాలకు రచన చేయటం మానలేదు. కానీ పైకి కనిపించే వ్యక్తి వేరు. లోపల వేదన వేరు. అతను నన్ను అడిగాడు" అని ఆగాడు...

(సశేషం)

బొట్టుతో జీవితాన్ని తుడిచేశారు

అది పాపుల విముక్తి కోసం సిలువెక్కిన 'దయామయుడి' అనుచరగణం నడిపే పాఠశాల. పేరు సెయింట్ జేవియర్ స్కూల్. అక్కడ హిందూ మత చిహ్నాలు కనిపించినా క్రైస్తవం మొత్తం మైల పడుతుందన్న గుడ్డి నమ్మకం. ఇప్పటిదాకా హిందూ ధర్మం నుంచి బాలబాలికలను దూరం చేసే ప్రయత్నం జరిగింది. తాజాగా విద్యార్థులలో హిందూ మత చిహ్నాలు కనిపిస్తే ప్రాణాలు తీసుకునే పద్ధతులు నేర్పుతున్నది. అందుకే బొట్టుతో ఉదయం ప్రార్థనలో పాల్గొన్న ఓ బాలికకు ఆ పాఠశాల మరణ శాసనం రాయడమే ఇందుకు మంచి ఉదాహరణ. బొట్టుతో ప్రార్థనలో పాల్గొన్నందుకు ఆ చిన్నారి జీవితాన్ని సిలువెక్కించింది. బొట్టు పెట్టుకుని పాఠశాలకు వెళ్లిందా బాలిక. ఇంటికొచ్చి శవమైపోయింది. బొట్టుతో కనిపించినందుకు ఓ ఉపాధ్యాయురాలు ఆ బాలికను నలుగురు ముందు దుర్భాషలాడింది. ఆ తరువాత చేయి చేసుకుంది. ఇది భరించలేకే, ఈ వాస్తవాలతో ఒక లేఖ రాసి ఉరి వేసుకుంది. 'నన్ను నలుగురు ముందు ఆమె కొట్టింది. నేను స్కూలు ప్రాంగణం వదలిరాక తప్పని పరిస్థితి తెచ్చింది' – ఇదీ ఆ నోట్ సారాంశం.

ఇది జార్ఖండ్ రాష్ట్రంలోని, ధన్‌బాద్‌లో జూలై 10న జరిగింది. ఉషా కుమారి అనే 16 ఏళ్ల పదో తరగతి విద్యార్థినికి అక్కడి సెయింట్ జేవియర్ పాఠశాల ఇలాంటి చావును ఇచ్చింది. ఈ విషయం తెతుల్‌మరి పోలీసులు కూడా ధ్రువీకరించారు. ఆ ఉపాధ్యాయినిని అరెస్టు చేసినట్టు ధన్‌బాద్ శిశు సంక్షేమ కమిటి చైర్‌పర్సన్ ఉత్తమ్ ముఖర్జీ కూడా చెప్పారు. ఉపాధ్యాయ వృత్తికే, అసలు మానవజాతికే కళంకం వంటి ఆ ఉపాధ్యాయిని ఉషాకుమారి మీద చేయి చేసుకోవడం, ఆ బాలిక వెంటనే హనుమాన్ గఢి కాలనీలోని తన ఇంటికి వెళ్లి ఉరి వేసుకోవడం వెంట వెంటనే జరిగిపోయాయి. నా చావుకు ఆ ప్రిన్సిపాల్, ఆ ఉపాధ్యాయిని కారణమని సుస్పష్టంగా రాసింది. ఆ లేఖ ఆమె యూనిఫారమ్ జేబులోనే దొరికింది. దీనితో ఆ పాఠశాల ప్రిన్సిపాల్‌నీ, ఆ ఉపాధ్యాయినినీ కూడా అరెస్ట్ చేసి ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ చైర్‌పర్సన్ ప్రియాంక కానుంగో కూడా ఇదే విషయం చెప్పారు. ఆ విద్యార్థిని బొట్టు పెట్టుకుని పాఠశాలకు వెళ్లినందుకే కొట్టారు. మనస్తాపంతో బాలిక బలవన్మరణానికి పాల్పడింది. బాలిక తల్లి, గ్రామస్థులు, బంధువులు కలసి తెతుల్‌మరి–నయా మోర్ రోడ్డు మీద, సెయింట్ జేవియర్ పాఠశాల ఎదురుగా, బాలిక భౌతికకాయంతో ధర్నాకు దిగారు. మొదట పోలీసులు కూడా ఏమీ పట్టించుకోక పోయినా, అప్పుడు, అంటే ఆ బాలిక ఆత్మహత్య చేసుకున్న 24 గంటల తరువాత ఇక తప్పక రంగంలోకి దిగారు.

ఇక్కడ ఆ బాలిక తల్లి వైఖరి జాలి గొలిపేదిగా, అదే సమయంలో అవాంఛనీయంగాను కనిపిస్తుంది. ఉపాధ్యాయినిని చూడగానే తన బిడ్డ బొట్టును తీసేసిందనీ, అయినా ప్రార్థన వేళ బొట్టు ఎందుకు ఉందని ఆ ఉపాధ్యాయిని తిట్టి, కొట్టిందనీ ఆమె చెబుతున్నారు. ఒక సంవత్సరం క్రితమే ఆమె భర్త పోయారు. అవమానభారంతో ఇంటికి చేరిన కుమార్తె నోటి నుంచి అంతా విన్న ఆ తల్లి ప్రిన్సిపాల్‌ను కలుసుకోవాలని ప్రయత్నిస్తే ఆ మహానుభావుడు అసలు పట్టించుకోలేదు. ఇంత చేసిన ఆ ఉపాధ్యాయినిని కలుసు కుని క్షమించమని కోరడానికి కూడా ఆ తల్లి ప్రయత్నించింది. విఫలమైంది. అరగంట తరువాత ఇంటికి వెళ్లాక చూస్తే కూతురు ఏదో రాయడం గమనించారామె. ఏమిటీ అంటే స్కూల్ వర్క్ అని మాత్రమే చెప్పింది. నిజానికి అది సూయిసైడ్ నోట్.

ఇదే మరేదైనా పాఠశాలలో, ముఖ్యంగా హిందూ సంస్థలు నడిపే విద్యా సంస్థలో జరిగితే, ఆఖరికి బీజేపీ పాలిత రాష్ట్రంలో మరో మతం బాలిక ఏదో కారణంగా చనిపోయినా వర్షంలో డ్రైనేజీ పొంగినట్టు జాలి కవిత్వం చాలామంది పాత్రికేయుల కలాల నుంచి జాలువారేది. మహిళా సంఘాల పేరుతో చెలామణి అవుతున్న హిందూ వ్యతిరేక ముఠాలు తెగ మొరిగేవి. మేధావులు కొంగ్రొత్త పైత్యంతో సిద్ధాంతాల కత్తులు దూసేవారు. ఇది క్రైస్తవానికే సిగ్గుచేటు. మిషనరీ పాఠశాలలన్నీ సిగ్గుతో తల దించుకోవాలి. అదే సమయంలో వాటి వెంటపడే హిందువులు కూడా ఆ పని చేస్తే కొంతైనా పాప పరిహారమవుతుందేమో! ★

భారత్-ఫ్రాన్స్ సంబంధాల్లో కొత్త శకం!

ప్రధాని నరేంద్రమోదీ ఫ్రాన్స్‌లో 13-14 తేదీల్లో నిర్వహించిన అధికార పర్యటన రెండుదేశాల మధ్య సంబంధాల్లో మరో మైలురాయికి చిహ్నంగా నిలిచిపోయింది. ప్రధాని హోదాలో నరేంద్రమోదీ ఫ్రాన్స్‌లో పర్యటించడం ఇది ఆరోసారి. 1998, జనవరి 26న ప్రారంభమైన ఈ వ్యూహాత్మక భాగ స్వామ్యానికి 25ఏళ్లు నిండాయి. ఈ నేపథ్యంలో 2047 వరకు ద్వైపాక్షిక సంబంధాల విషయంలో రోడ్‌మ్యాప్‌ను రూపొందించేందుకు ఇరుదేశాలు అంగీకరించాయి. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని జులై 14న ఫ్రాన్స్ బాస్టిల్లె డే పరేడ్‌లో ముఖ్య అతిథిగా పాల్గొనడం విశేషం. మనదేశానికి చెందిన రాఫెల్ యుద్ధవిమానాలతో పాటు స్టెల్త్ డిస్ట్రాయర్ ఐఎన్ఎస్ చెన్నై ఈ ఉత్సవాల్లో పాల్గొన్నది. మొత్తం భారత్ త్రివిధ దళాలకు చెందిన 269మంది బాస్టిల్లె డే పరేడ్‌లో పాల్గొన్నారు. నిజానికి ఈ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా తొలిసారి పాల్గొన్న మన దేశ ప్రధాని డా॥మన్మోహన్‌సింగ్. మన త్రివిధదళాలకు చెందిన 400మంది సైనికులు అప్పట్లో ఈ పరేడ్‌లో పాల్గొనడం విశేషం. 2008 రిపబ్లిక్ పరేడ్‌కు ముఖ్య అతిథిగా నాటి ఫ్రాన్స్ అధ్యక్షుడు నికోలస్ సర్కోజి హాజరుకాగా, మరుసటి ఏడాది జరిగిన బాస్టిల్లె డే ఉత్సవాల్లో మన్మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

ఫ్రాన్స్‌లో యూసీసీ సేవలు అమల్లోకి రావడం ఒక విశేషం. ఈమేరకు రెండు దేశాలమధ్య ఒప్పందం కుదిరింది. అంటే ఫ్రాన్స్ వెళ్లేవారు రూపాయిల్లోనే చెల్లింపులు జరపవచ్చు. ఇప్పటికే ఈ సదుపాయం సింగపూర్, ఆస్ట్రేలియా, కెనడా, హాంకాంగ్, ఒమన్, కతార్, యు.ఎస్, సౌదీ అరేబియా, యుఎఇ, యుకెవంటి దేశాల్లో అమల్లో ఉండగా, తాజాగా ఈ జాబితాలో ఫ్రాన్స్ చేరింది.

ఫ్రాన్స్ అత్యున్నత అవార్డు "గ్రాండ్ క్రాస్ ఆఫ్ లీజియన్ ఆనర్"ను ఫ్రాన్స్ అధ్యక్షులు ఇమాన్యువల్ మెక్రాన్ చేతుల మీదుగా ప్రధాని నరేంద్రమోదీ అందుకోవడం గొప్ప విశేషం. ఈ అవార్డును స్వీకరించిన తొలి భారతీయ నేత నరేంద్ర మోదీ. గతంలో దక్షిణాఫ్రికా అధ్యక్షులు నెల్సన్ మండేలా సహా పలువురు ప్రముఖులు ఈ అవార్డును అందుకున్నారు. మార్సెల్లీలో కొత్త కాన్సులేట్ ఏర్పాటు, ఫ్రాన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేయాల నుకునే భారతీయ విద్యార్థులకు వీసాగడువు ఐదేళ్లకు పెంపు, తమిళ తత్వవేత్త తిరువళ్లువార్ విగ్రహాన్ని ఫ్రాన్స్‌లో కొద్ది వారాల్లో ప్రతిష్టించడం వంటివి ప్రధాని ప్రకటించిన అంశాలు.

కీలక ఒప్పందాలు

ప్రస్తుతం ఫ్రాన్స్ నుంచి నావికాదళం కోసం 26 రాఫెల్ యుద్ధ విమానాలతోపాటు మరో మూడు జలాంతర్గాములను భారత్ కొనుగోలు చేయనున్నది. ఇవికాకుండా ఫిఫ్త్ జనరేషన్ యుద్ధ విమానాలకు ఇంజిన్ల అభివృద్ధి, 12 టన్నులకంటే అధిక తరగతికి చెందిన ఇండియన్ మల్టీరోల్ హెలికాప్టర్ల (ఐఎంఆర్‌హెచ్) తయారీని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌తో కలిసి ఉమ్మడిగా చేపట్టేందుకు ఒప్పందం కుదిరింది. అదేవిధంగా అత్యధిక శక్తిగల అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ)ను కూడా ఉమ్మడిగా అభివృద్ధి చేసేందుకు డిఆర్‌డిఒ-ఫ్రాన్స్‌కు చెందిన సాఫ్రాన్ సంస్థల మధ్య ఒప్పందం కుదిరింది. దీనికి సంబంధించి డిజైన్‌ను డి.ఆర్.డి.ఒ. రూపకల్పన చేస్తుంది. ఈ ప్రాజెక్టు రోడ్‌మ్యాప్‌ను ఈ ఏడాది డిసెంబర్‌లోగా ఈ సంస్థలు రూపొందిస్తాయి. ఈ ఇంజిన్‌కు సంబంధించి నూటికి నూరుశాతం సాంకేతిక పరిజ్ఞాన బదలాయింపు జరపడానికి ఫ్రాన్స్ ముందుకు వచ్చింది. దీని తయారీలో ప్రైవేటు సంస్థలకు భాగస్వామ్యం కల్పిస్తారు. ప్రధాని పర్యటన సందర్భంగా అంతరిక్ష రంగంలో రెండుదేశాల మధ్య సమన్వయ సహకారాలు మరింత బలోపేతమయ్యాయి.

జమలాపురపు విఠల్‌రావు
సీనియర్ జర్నలిస్ట్

ఈనాటి ఈ బంధమేనాటిదో..

రెండు దేశాల మధ్య సంబంధాలు నేటివి కావు. రెండు దేశాల వాణిజ్య సంబంధాలకు శతాబ్దాల చరిత్ర ఉంది. మహారాజా రంజిత్‌సింగ్ సైన్యంలో రెండు వేలమంది ఫ్రెంచ్ సైనికులుండేవారు. ఆయన సైన్యంలోని "ఫౌజ్- ఇ- ఖాస్" బ్రిగేడ్ ఫ్రెంచ్ పద్ధతుల్లోనే ఉండేది. 17వ శతాబ్దం నుంచి 1954వరకు ఫ్రాన్స్‌కు వలసగా ఉన్న పుదుచ్చేరి నేటికీ ఫ్రాన్స్ పౌరులకు ప్రముఖ పర్యాటక కేంద్రం. నిజానికి భారత్-ఫ్రాన్స్‌లు వ్యూహాత్మక కూటమిగా ఏర్పడటానికి ప్రచ్ఛన్నయుద్ధ కాలంలోనే బీజాలుపడ్డాయి. నాటి సోవియట్ యూనియన్, మన దేశానికి రక్షణ, దౌత్యపరమైన భాగస్వామిగా కొనసాగుతున్నప్పటికీ, భారత్ పూర్తిగా యుఎస్ఎస్ఆర్‌పై ఆధారపడకుండా సమతుల్యతను సాధించేందుకు ఈస్నేహం దోహదపడిందనే చెప్పాలి. నాటో దేశమైనప్పటికీ, యు.ఎస్.ను లెక్క చేయకుండా భారత్‌కు అన్ని సందర్భాల్లో అండగా నిలిచిన మంచి మిత్రదేశం ఫ్రాన్స్. దక్షిణాసియాలో భారత్ ప్రాధాన్యతను గుర్తించిన దేశం కూడా ఫ్రాన్స్ మాత్రమే. 1971 ఇండో-పాక్ యుద్ధంలో మన దేశానికి మద్దతుగా ఫ్రాన్స్ నిలిచింది. 1990ల్లో యుఎస్ఎస్ఆర్ విచ్ఛినం తర్వాత, నాటి ఫ్రాన్స్ అధ్యక్షుడు జాకస్ చిరాక్ రెండు దేశాల మధ్య "వ్యూహాత్మక సంబంధాలను" ముందుకు తెచ్చారు. 1998లో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదిరినప్పటి నుంచి వివిధ రంగాల్లో ఇరుదేశాల మధ్య సంబంధాలు పటిష్టంగా కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ అణుశక్తి సంస్థ, అణుసరఫరా గ్రూపు దేశాలు, మన దేశంపై ఆంక్షలు ఎత్తేసిన తర్వాత, భారత్‌తో పౌర అణు ఒప్పందం కుదుర్చుకున్న మొట్ట మొదటి దేశం ఫ్రాన్స్. ఇండియా, ఫ్రాన్స్‌ల మధ్య రక్షణ, పౌర అణు ఇంధనం, అంతరిక్షం, భద్రత వంటి రంగాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతోంది. చైనా ఆగడాలు పెరుగుతున్న నేపథ్యంలో ఇండో- పసిఫిక్ ప్రాంతంలో ఈ భాగస్వామ్యం మరింత దృఢతరం కావడం విశేషం.

నిజమైన స్నేహితుడు

1998లో అణుపరీక్షలు నిర్వహించినప్పుడు ఫ్రాన్స్ మనదేశ చర్యను ఖండించలేదు. జి-8లోను, ఐక్యరాజ్యసమితిలో మనకు శాశ్వతసభ్యత్వం కోసం తిరుగులేని మద్దతునిచ్చి ఆప్తుడిగా నిలిచింది. మనదేశానికి పెద్దమొత్తంలో అణు ఇంధనాన్ని

సరఫరాచేసే దేశం ఫ్రాన్స్. గతంలో మన దేశానికి మిరాజ్-2000 యుద్ధవిమానాలను, స్కార్పియన్ క్లాస్ జలాంతర్గాములను సరఫరా చేసింది. ప్రస్తుతం మనదేశంలో ఫ్రాన్స్‌కు చెందిన వెయ్యి కంపెనీలు పనిచేస్తున్నాయి. వీటి మొత్తం వార్షిక టర్నోవర్ 20బిలియన్ డాలర్లు. దేశంలో ఫ్రాన్స్‌కు చెందిన 25 పరిశోధనా కేంద్రాలు పనిచేస్తున్నాయి. పెట్టుబడుల విషయంలో ఫ్రాన్స్ మనదేశంలో 11వ స్థానంలో ఉంది.

2000-2022 మధ్యకాలంలో భారత్‌లో ఫ్రాన్స్ పెట్టుబడులు 10.31 బిలియన్ డాలర్లు. మన మొత్తం విదేశీ పెట్టుబడుల్లో ఇవి 1.70%. 2021-22లో రెండుదేశాల మధ్య వార్షిక వాణిజ్యం 12.42 బిలియన్ డాలర్లకు చేరుకుంది.

అంతరిక్ష-రక్షణ రంగాలు

1960లో శ్రీహరికోట లాంచ్‌ప్యాడ్ నిర్మాణానికి సహాయం చేసిన దగ్గరి నుంచి, ఇరుదేశాల మధ్య అంతరిక్ష రంగంలో సహకారం మరింతగా బలపడుతూ వచ్చింది. 2020లో ఇస్రో, ఫ్రాన్స్‌కు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ స్పేస్ స్టడీస్ (సీఎన్ఈఎస్)లు "జాయింట్ వర్కింగ్ కమిటీ"ని ఏర్పాటుచేశాయి. తర్వాత ఈ రెండు సంస్థలు ఉమ్మడిగా మార్స్ మిషన్‌కు ప్రణాళిక సిద్ధంచేశాయి. అంతరిక్ష వ్యర్థాల సమస్యను పరిష్కరించడంలో కూడా ఫ్రాన్స్ మనదేశానికి సహాయం చేసింది. 2017-21 మధ్య కాలంలో మనదేశానికి రెండో అతిపెద్ద రక్షణ సరఫరాదారుగా రూపొందింది. సంప్రదాయిక స్కార్పియన్ జలాంతర్గాములను "2005 సాంకేతిక పరిజ్ఞాన బదలాయింపు ఒప్పందం" కింద ప్రవేశపెట్టడం, 36 రాఫెల్ యుద్ధ విమానాలను మనదేశం కొనుగోలు చేయడం ఇందులో భాగమే. వీటికితోడు టాటా కంపెనీ ఎయిర్‌బస్ భాగస్వామ్యంతో సి295 రవాణా విమానాల తయారీని వడోదరలో చేపట్టనుంది.

హిందూమహాసముద్రం కీలకం

హిందూమహాసముద్రంలో భద్రత విషయంలో రెండు దేశాలమధ్య పరస్పర సహకారం ఇటీవలి సంవత్సరాల్లో మరింతగా పెరిగింది. ముఖ్యంగా 7500 కిలోమీటర్ల తీరం, 1380 ద్వీపాలు, రెండు మిలియన్ చదరపు కిలోమీటర్ల ప్రత్యేక ఆర్థిక మండలం కలిగిన ఈ ప్రాంతంలో భారత్ పాత్ర అత్యంత కీలకం. ఇదే ప్రాంతంలో ఫ్రాన్స్‌కు చెందిన మయొట్టె, లారె యూనియన్ ద్వీపాలు, వీటికి సంబంధించిన ప్రత్యేక ఆర్థిక మండలం భద్రత చాలా ముఖ్యం. వీటితో పాటు జిబౌటీ, అబుదాబిల్లో కూడా దళాల మోహరింపు కొనసాగుతోంది. ఈనేపథ్యం లోనే "భారత్-ఫ్రాన్స్ భాగస్వామ్యానికి సంబంధించి ఉమ్మడి వ్యూహాత్మక విజన్"తో ముందుకు సాగేందుకు రెండు దేశాలు 2018లో ఒక అంగీకారానికి వచ్చాయి.

మింగుడుపడని చైనా వైఖరి

ప్రస్తుతం యూరోపియన్ యూనియన్ దేశాలు చైనా వైఖరిపట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. ముఖ్యంగా 'ఒకే చైనా' విధానం ఆమోదించాలని ఆ దేశంనుంచి వస్తున్న ఒత్తిళ్లు, చైనా దౌత్యంలో "ఉల్ఫ్ వారియర్" విధానాన్ని అనుసరిస్తుండటం ఈయూ దేశాలకు మింగుడు పడటంలేదు. ఈ నేపథ్యంలో "ఈయూ-చైనా: వ్యూహాత్మక దృక్కోణం" పేరుతో యూరోపియన్ కమిషన్ ఒక అధ్యయనాన్ని విడుదలచేసింది. ఇందులో చైనా అనుసరిస్తున్న "ప్రత్యామ్నాయ ప్రభుత్వ నమూనాలు" ఆమోద యోగ్యంగా లేవని స్పష్టం చేసింది. హిందూ మహాసముద్రం, పసిఫిక్ మహాసముద్ర ప్రాంతాల్లో చైనా అనుసరిస్తున్న దుందుడుకు వైఖరి ఫ్రాన్స్ ప్రయోజనాలకు ఇబ్బంది కలిగించేదిగా ఉండటం మరో ముఖ్యాంశం. ఈ నేపథ్యంలో చైనాపట్ల ఫ్రాన్స్‌లో వ్యతిరేకత పెరుగుతోంది.

కొనసాగుతున్న సవాళ్లు

ఇన్ని సానుకూలతలున్నప్పటికీ భారత్-ఫ్రాన్స్ ద్వైపాక్షిక సంబంధాలు ఇంకా కొన్ని సవాళ్లు ఎదుర్కొంటున్నాయనే చెప్పాలి. ఇప్పటివరకూ రెండు దేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరలేదు. అదేవిధంగా భారత్-ఈయూల మధ్య విస్తృత ప్రాతివదికన వాణిజ్య పెట్టుబడుల ఒప్పందం (బీటీఐఏ) కూడా లేదు.

ఇది రెండు దేశాల మధ్య మరింత స్వేచ్ఛగా వాణిజ్యం కొనసాగించడానికి ప్రధాన అడ్డంకి. ఇదే సమయంలో రెండు దేశాల మధ్య వాణిజ్య అసమతౌల్యత ఉంది. ఇది భారత్‌కు ఇబ్బంది కలిగించే విషయం. ఇదే సమయంలో మేధోపరమైన హక్కుల పరిరక్షణలో భారత్ విఫలమైందంటూ ఫ్రాన్స్ ఆరోపిస్తోంది. అయితే, హిందూమహాసముద్రంలో పెరుగుతున్న చైనా ప్రాబల్యం ప్రస్తుతం రెండుదేశాలను ఒక్కతాటిపై నడిపిస్తోంది. చైనా వైఖరి ఈ ప్రాంతంలో శాంతిని దెబ్బతీస్తుందని రెండుదేశాలు నమ్ముతున్నాయి.

మరో విశ్వసనీయ మిత్రదేశం యు.ఎ.ఇ.

ఫ్రాన్స్ పర్యటన తర్వాత మోదీ 15వ తేదీన అబుదాబి (యు.ఎ.ఇ) వెళతారు. టెక్నాలజీ, సెక్యూరిటీ, ఇంధన రంగాల్లో రెండు దేశాలమధ్య ఇప్పటికే మంచి సంబంధాలు కొనసాగుతున్నాయి. యు.ఎ.ఇ.పాలకుడు షేక్ మహమ్మద్ బిన్ జయాద్ అల్ నహ్యాన్‌తో చర్చలు జరుపుతారు. గత ఏడాది ఇద్దరు నేతల మధ్య జరిగిన చర్చల్లో భవిష్యత్తులో రెండుదేశాల భాగస్వామ్యానికి సంబంధించి రోడ్‌మ్యాప్‌పై ఒక అంగీకారానికి వచ్చారు. వచ్చే సెప్టెంబర్‌లో జరిగే జి-20 సమావేశానికి యు.ఎ.ఇ. ప్రత్యేక ఆహ్వానిత దేశంగా పాల్గొననుంది. ఈ ఏడాది చివర్లో యు.ఎ.ఇలో జరుగనున్న కాప్-28 సమావేశం కోసం రెండు దేశాలు సన్నిహితంగా పనిచేస్తున్నాయి. ఈ సదస్సుకు యు.ఎ.ఇ. ఆతిథ్యం ఇవ్వనుంది. 2022 మే నుంచి 2023 ఏప్రిల్ మధ్యకాలంలో రెండు దేశాలమధ్య జరిగిన వాణిజ్యం విలువ 50.5బిలియన్ డాలర్లు. ఇది గత ఏడాదితో పోలిస్తే 5.8% ఎక్కువ. యు.ఎ.యి. భారత్‌కు మూడో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. మనదేశ ఎగుమతుల్లో యు.ఎ.ఇ.ది రెండోస్థానం. మన దేశంలో పెట్టుబడుల్లో యు.ఎ.ఇ.ది నాలుగో స్థానం. ప్రస్తుతం యు.ఎ.ఇ.లో నివసిస్తున్న భారతీయుల సంఖ్య 3.5బిలియన్లు. అంటే యు.ఎ.ఇ. జనాభాలో 38శాతం భారతీయులే! ఈ నేపథ్యంలో ప్రధాని యు.ఎ.ఇ. పర్యటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ★

జాబిలిపై సంతకం

చంద్రయాన్-3 ప్రయోగంతో భారత్.. అమెరికా, చైనా, రష్యాల సరసన చేరబోతోంది. చంద్రయాన్-2 వైఫల్యం నుంచి పాఠాలు నేర్చుకున్న ఇస్రో నాలుగేళ్ల తర్వాత ఈ ప్రయోగం చేపట్టింది. నాసా కూడా ఆశ్చర్యపోయే రీతిలో ఒక పాన్ ఇండియా సినిమా కోసం వెచ్చించిన మొత్తంతోనే దీనిని పూర్తి చేసింది. ఇస్రో ప్రయత్నం ప్రాథమిక స్థాయిలో విజయవంతం కాగా, చంద్రుడిపై రోవర్ ఆగస్టులో కాలుమోపనుంది. ఇంత చవకగా అంత పెద్ద ప్రయత్నం చేసిన ఇస్రోకు ప్రపంచదేశాలన్నీ జేజేలు పలుకుతున్నాయి.

డాక్టర్ పార్థసారథి చిరువోలు
సీనియర్ జర్నలిస్ట్

"భారతదేశ అంతరిక్ష చరిత్రలో చంద్రయాన్-3 కొత్త అధ్యాయాన్ని లిఖించింది. దేశంలోని ప్రతి పౌరుడి ఆకాంక్షల్ని, కలల్ని ఇది నింగిలోకి మోసుకెళ్లింది. మన శాస్త్రవేత్తల నిబద్ధతకు ఈ ప్రయోగమే నిదర్శనం. వాళ్ల ఆత్మవిశ్వాసానికి పట్టుదలకు సెల్యూట్" అని ప్రశంసించారు భారత ప్రధాని నరేంద్రమోదీ. ఇస్రో దాదాపు నాలుగేళ్లుగా ఈ మిషన్‌పై పని చేస్తోంది. జులై 14వ తేదీ మధ్యాహ్నం 2.35 నిమిషాలకు నింగిలోకి దూసుకుపోయిన చంద్రయాన్-3 స్పేస్‌క్రాఫ్ట్ విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశించింది. దీని బరువు 3,921కిలోలు. భూమి నుంచి చంద్రుడి వరకూ దాదాపు 4 లక్షల కిలోమీటర్ల వరకూ ప్రయాణిస్తుంది. దీన్ని బాహుబలి రాకెట్‌గా అభివర్ణించిన ఇస్రో ఆ తరువాత దానికి లాంచ్ వెహికల్ మార్క్-3 గా పేరు పెట్టింది. చంద్రయాన్-3 ఉపగ్రహం చంద్రుడి వైపుగా తన ప్రయాణాన్ని మొదలు పెట్టిందని ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ ప్రకటించారు. ఈ ప్రయోగానికి సంబంధించిన మూడు దశలూ పూర్తయ్యాయి.

24 రోజుల పాటు ఇది భూమి చుట్టూ ప్రదక్షిణలు చేస్తుంది. ఆగస్టు 23 లేదా 24 న చంద్రుడి ఉపరితలంపై కాలుమోపుతుందని ఇస్రో అంచనా వేస్తోంది. ఇది అనుకున్న రీతిలో సురక్షితంగా సాగితే ఈ ప్రయోగం పూర్తిస్థాయిలో విజయవంతం అయినట్టు లెక్క.

కౌంట్‌డౌన్ పూర్తయిన వెంటనే రాకెట్ నిప్పులు కక్కుతూ నింగిలోకి దూసుకెళ్లింది. మూడో దశ పూర్తయిన వెంటనే ఇస్రో శాస్త్రవేత్తలలో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. 3.5లక్షల కిలోమీటర్ల ప్రయాణానంతరం చంద్రయాన్-3 చంద్రుడి కక్ష్యలోకి చేరుకుంటుంది. ప్రస్తుతం స్పేస్ క్రాఫ్ట్ ఆరోగ్యం సజావుగా ఉందని, అది కక్ష్యలోనే పరిభ్రమిస్తోందని ఇస్రో తాజాగా వెల్లడించింది. దీని గమనాన్ని శాస్త్రవేత్తలు జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు.

చంద్రయాన్-3 లక్ష్యాలు...

1. **చంద్రుడి ఉపరితలంపై సాఫ్ట్‌గా ల్యాండ్ అయ్యేలా చేయడం**
2. **రోవర్ సరైన విధంగా చంద్రుడిపై తిరిగేలా చేయడం**
3. **శాస్త్రీయ పరిశోధనలు**

2020 జనవరిలో ఇస్రో తొలిసారిగా చంద్రయాన్-3పై ప్రకటన చేసింది. డిజైన్‌పై పని చేస్తున్నామని, త్వరలోనే అసెంబ్లింగ్ పూర్తవుతుందని వెల్లడించింది. చంద్రయాన్-2 కన్నా పకడ్బందీగా దీన్ని డిజైన్ చేశారు. ముఖ్యంగా ల్యాండర్ లెగ్స్‌ని మరింత దృఢంగా తయారుచేశారు. దీనిని 2021లోనే ప్రయోగించాలని భావించినా కోవిడ్ కారణంగా వాయిదా వేశారు. అప్పటికే ప్రొపల్షన్ సిస్టమ్ టెస్టింగ్ పూర్తయ్యింది. జులై 14న ప్రయోగం చేపడతామని ఇస్రో అధికారికంగా ప్రకటించింది. ల్యాండర్, రోవర్ మాడ్యూల్ వేరువేరుగా ఉన్న ఈ స్పేస్ క్రాఫ్ట్ చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీపంలో ల్యాండ్ అవుతుంది. ప్రొపల్షన్ మాడ్యూల్

కోసం...

ఇస్రో చైర్మన్ సోమనాథ్

భూమి చుట్టూ పలుసార్లు తిరిగి చంద్రుడిపై దిగుతుంది. చంద్రుడిపై గురుత్వా కర్షణకు అనుగుణంగా కిందకు దిగుతుంది. ల్యాండర్ విడిపోతుంది. లాంచ్ అయినప్పటి నుంచి సరిగ్గా నెలరోజుల తరవాత చంద్రుడిపై మాడ్యూల్ దిగుతుంది. అయితే, చంద్రుడిపై సూర్యోదయం ఎలా ఉందన్న దానిపైనే ల్యాండింగ్ ఎప్పుడన్నది ఆధారపడి ఉంటుంది. ఒకవేళ ఆలస్యం జరిగితే.. ల్యాండింగ్ కూడా జాప్యమవుతుంది. అదే జరిగితే...ఇస్రో ల్యాండింగ్‌ని సెప్టెంబర్‌కి రీషెడ్యూల్ చేస్తుంది. కానీ...ఈ మిషన్‌లో కీలకమైన అంశం ఇదే. ల్యాండింగ్‌కి కనీసం 15 నిమిషాల సమయం పడుతుంది.

ఈ ప్రయోగం విజయవంతం కావటంపై ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, అంతరిక్ష శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సహా పలువురు కీలక నేతలు ప్రశంసలు కురిపించారు. చంద్రయాన్-3తో భారతదేశం యావత్ ప్రపంచానికి స్ఫూర్తిగా నిలుస్తుందని ఇస్రో మాజీ శాస్త్రవేత్త నంబి నారాయణన్ పేర్కొన్నారు. అధికార, ప్రతిపక్ష నాయకులంతా ఇస్రో సైంటిస్ట్‌లకు అభినందనలు తెలిపారు.

గత అనుభవాల నుంచి పాఠాలు

చంద్రయాన్ -2 ప్రయోగం చేపట్టిన 2019 సెప్టెంబర్ 6వ తేదీన దేశం అంతా ఉత్కంఠగా ఎదురు చూసింది. అనుకోని అవాంతరాల వల్ల అనుకున్న లక్ష్యం నెరవేరలేదు. ఇస్రో శాస్త్రవేత్తలంతా కన్నీటి పర్యంతమయ్యారు. ఈసారి కచ్చితంగా విజయం సాధించాల్సిందేనన్న పట్టుదలతో పనిచేశారు. ఈ ప్రాజెక్ట్‌కి అయిన ఖర్చు రూ.615 కోట్లు. దాదాపుగా త్రిబుల్ ఆర్ సినిమాకు వెచ్చించిన మొత్తం అది. ఇంత తక్కువ మొత్తంలో ప్రయోగం చేపట్టటం సాధ్యమా అని అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు. స్పేస్‌క్రాఫ్ట్‌లో ప్రొపల్షన్ మాడ్యూల్, ల్యాండర్ మాడ్యూల్, రోవర్ ఉంటాయి. ఇవే చంద్రుడిపై ఉన్న కీలక సమాచారాన్నంతా భూమికి చేరవేస్తాయి. ఈ మూన్ రేస్‌లో ఇప్పటికే అమెరికా, రష్యా, చైనా చంద్రుని మీద సురక్షితంగా దిగగలిగాయ. ఇప్పుడు భారత్ వంతు వచ్చింది. చంద్రయాన్ -3 విజయం సాధిస్తే, అమెరికా, రష్యా, చైనాతోపాటు భారత్ కూడా చరిత్ర సృష్టిస్తుంది. చంద్రుడిపైకి అత్యాధునికమైన పరికరాలను మోసుకెళుతున్నారు.

గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్టు ఇస్రో వెల్లడించింది. ఎలాంటి అత్యవసర పరిస్థితులు వచ్చినా వాటిని ఎదుర్కొనే సామర్థ్యం చంద్రయాన్-3కి ఉందని ఇస్రో చీఫ్ ఎస్ సోమనాథ్ ధీమా వ్యక్తం చేశారు. సాఫ్ట్‌వేర్‌లో లోపాలు తలెత్తకుండా చాలా జాగ్రత్తగా ఏర్పాట్లు చేశారు. అదనంగా కెమెరాలు అమర్చారు. సాఫ్ట్‌వేర్‌ని మెరుగుపరిచారు. ఏదైనా ముప్పు తలెత్తితే ప్రమాదాలను పసిగట్టేలా సాంకేతిక మార్పులు చేశారు.

ఇస్రో భవిష్యత్ లక్ష్యాలు

చంద్రయాన్-1లో ఆర్బిటర్, మూన్ ఇంపాక్ట్ ప్రోబ్ ప్రయోగించారు.

చంద్రయాన్-2లో ఆర్బిటర్‌తో పాటు, ల్యాండర్, రోవర్ కూడా పంపించారు.

చంద్రయాన్-3లో... ఆర్బిటర్ లేకుండా ల్యాండర్, రోవర్ మాత్రమే పంపిస్తున్నారు. ఈ ప్రయోగంలో చంద్రయాన్-2లో ప్రయోగించిన ఆర్బిటర్‌నే ఉపయోగించుకోనున్నారు.

చంద్రయాన్-3లో సాధించిన విజయాలను బట్టి, సేకరించిన సమాచారాన్ని బట్టి చంద్రయాన్-4, ఆ తర్వాత వరస ప్రయోగాలు కొనసాగుతాయి. అవన్నీ విజయవంతమవుతూ ఉంటే రాబోయే రోజుల్లో చేపట్టే ప్రయోగాల్లో మానవ సహిత అంతరిక్ష నౌకలను పంపిస్తారు. ఈ దిశగా ఇప్పటికే కొన్ని ప్రయోగాలు కూడా జరుగుతున్నాయ. ఇస్రో చేపట్టబోయే గగన్‌యాన్ కూడా ఇందులో భాగమే. భారత తొలి వ్యోమగామి రాకేశ్ శర్మ, రష్యాకు చెందిన సోయజ్ వ్యోమ నౌకలో అంతరిక్షంలోకి వెళ్లి వచ్చారు. ఇలా ఇతర దేశాల సాయంతో కాకుండా పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో మానవుల్ని అంతరిక్షంలోకి పంపేందుకు గగన్ యాన్ ప్రయోగాల్ని ఇస్రో చేపట్టబోతోంది.

ముందున్న సవాళ్లివి..

చంద్రయాన్ ప్రయోగాల్లో ఇప్పటి వరకూ ప్రయోగించిన ఆర్బిటర్లు కానీ, ల్యాండర్లు, రోవర్లు కానీ వేటినీ తిరిగి భూమ్మీదకు తీసుకురావాల్సిన పనిలేదు. కానీ వ్యోమగాముల్ని చంద్రుడిపైకి పంపిస్తే వాళ్లను సురక్షితంగా భూమ్మీదకు తీసుకురావాల్సి ఉంటుంది. అందుకోసం క్రూ మాడ్యూళ్లను తయారు చేయాలి.

చంద్రయాన్ -3 విడిభాగాలు హైదరాబాద్‌లో తయారీ

చంద్రయాన్ -3 విడిభాగాలు హైదరాబాద్‌లో రూపుదిద్దుకోవటం తెలుగు వారికి, తెలంగాణ వారికి గర్వకారణమని చెప్పాలి. చంద్రయాన్-2 వైఫల్యంతో పాఠాలు నేర్చుకున్న ఇస్రో ప్రతి విషయంలోనూ జాగ్రత్తలు తీసుకుంది. చంద్రయాన్-3 విడిభాగాలను హైదరాబాద్‌లో తయారు చేశారు. కూకట్‌పల్లిలోని ప్రశాంత్‌నగర్ లోని నాగసాయి ప్రెసిషన్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కొన్ని స్పేర్ పార్ట్‌లను రూపొందించింది. రోవర్, ల్యాండర్, ప్రొపల్షన్ మాడ్యుల్స్‌లో బ్యాటరీలు ఏర్పాటు చేసుకునే విడి భాగాలను ఇక్కడే తయారు చేశారు. కంపెనీ యజమాని డీఎన్ రెడ్డి 1998 నుంచి ఇస్రో ప్రయోగించిన 50 శాటిలైట్లలో పలు విడిభాగాలు అందిస్తూ వచ్చారు. చంద్రయాన్-3 విజయాన్ని ప్రభుత్వం, శాస్త్రవేత్తలతోపాటు ఇందులో భాగస్వాములైన ప్రతి ఒక్కరూ ఆస్వాదిస్తున్నారు. ★

నాసా పంపిన విధంగా సాధ్యమైనంత తక్కువ కాలంలో చంద్రుడిని చేరేలా భారీ రాకెట్లను నిర్మించాల్సి ఉంటుంది. చంద్రుడి మీద దిగేలా మానవ సహిత ల్యాండర్లను పంపించడమే కాదు.. సదరు ల్యాండర్ తిరిగి భూమికి తిరిగి రావాలంటే చంద్రుడికి కొంత ఎత్తులో కమాండ్ మాడ్యూల్ కూడా ఉండాలి.

ఈ కమాండ్ మాడ్యూల్ నుంచే ల్యాండర్ చంద్రుడి మీద దిగి, అక్కడ వ్యోమగాములు పరిశోధనలు చేసిన తర్వాత, తిరిగి వాళ్లు అదే ల్యాండర్ మాడ్యూల్‌లో తిరిగి చంద్రుడి ఉపరితలంపై ఉన్న కమాండ్ మాడ్యూల్‌కి వచ్చి చేరాలి. ఆ తర్వాత ఈ కమాండ్ మాడ్యూల్‌ను తిరిగి భూమికి తీసుకురావాలి.

ఈ ప్రయోగాలన్నీ పది రోజుల లోపు వ్యవధిలోనే పూర్తి చేయాలి. దీనికి అత్యాధునిక సాంకేతికత, భారీ రాకెట్లు తయారు చేయాలి. చంద్రుడి మీద వాతావరణం సరిగా ఉండదు. అంతరిక్షంలో ఉష్ణోగ్రత కూడా చాలా తక్కువకు పడిపోతుంది. ఇక్కడ కూడా రాకెట్లు ప్రయాణించేలా క్రయోజనిక్ ఇంజిన్లను రూపొందించాలి.ఇవన్నీ సాధించే దిశగా ఇస్రో అడుగులు వేస్తోంది.

పెట్టల్ని తోలే టెక్నిక్‌తో...

మాములుగా వడిశెలలో రాయి పెట్టి కొట్టిన దానికంటే గిరగిరా తిప్పి విసిరితేనే రాయి ఎక్కువ దూరం వెళ్తుంది. ఇదే సిద్ధాంతాన్ని అచ్చంగా అమలు చేస్తున్న ఇస్రో చంద్రుడిపై ప్రయోగాలకు ఉపయోగిస్తోంది. దాని వల్ల తక్కువ వ్యయంతో ప్రయోగాన్ని చేపట్టగలిగింది.

మరోవైపు అంతరిక్ష రంగంలోకి ప్రైవేట్ పెట్టుబడులను భారత్ స్వాగతిస్తోంది. చంద్రయాన్-3 విజయవంతమైతే ఆ పెట్టుబడులు వెల్లువెత్తే అవకాశాలున్నాయి. 2020లో ఇండియన్ స్పేస్ ఎకానమీ విలువ 9.6 బిలియన్ డాలర్లుగా ఉంది. 2025నాటికి ఇది 13 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. ప్రస్తుతానికి దేశ వ్యాప్తంగా ఈ రంగానికి సంబంధించి 140 కంపెనీలున్నాయి. మూన్ రేస్‌లో దూసుకుపోతున్న ఇండియా అమెరికాకి చెందిన మూన్ మిషన్ ఆర్టెమిస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. అవసరమైతే విదేశాల సహకారమూ తీసుకుంటామన్న సంకేతాలిచ్చింది. అంతరిక్ష రంగంలో వట్టు సాధించాలన్న భారీ లక్ష్యంతో ఉంది. మూన్ మిషన్ కోసం చైనా, రష్యా చేతులు కలిపాయి. కానీ భారత్ మాత్రం సొంతగా ఈ మిషన్‌ని చేపట్టింది.

★

జయ జయహో

మన దేశానిది పోరాట స్ఫూర్తి. మాట తప్పకుండా, మడమ తిప్పకుండా ముందుకు సాగడమే తరతరాల రివాజు. ఈ రెండింటికీ ప్రబల ఉదాహరణ తేదీలు – మొన్నటి జులై 14, రానున్న ఆగస్ట్ 23. భారత రోదసి సంస్థ (ఇస్రో) చేపట్టి ఫలప్రదం చేసిన మహాప్రక్రియ... చంద్రయాన్-3 ప్రయోగం. అగ్రదేశాలు మూడూ (అమెరికా, రష్యా, చైనా) ఇదివరకే ల్యాండర్లను చందమామ మీద దించినా, ఏకంగా 'దక్షిణ ధ్రువానికి చేరడమన్నది' భారతీయ శాస్త్రవేత్తల ఘనాతిఘన విజయం కానుంది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష శోధన కేంద్రం వేదిక నుంచి వాహన నౌక ద్వారా ప్రయోగించగానే జాతి పులకించింది. చంద్రయాన్-2లోని ల్యాండర్ వైఫల్యాన్ని ఇప్పుడు అధిగమిస్తూ భారత్ విజయకే తనం ఎగురవేయనుంది. చంద్ర ఉపరితలంపైన సురక్షిత ల్యాండింగ్, అక్కడ రోవర్ సంచార సామర్థ్యాల గమనింపు, శాస్త్రీయ పరిశీలనల వేగవంతంతో ఆ 'కూర్పు'ను మరింత అవగతం చేసుకోవడం ప్రధాన లక్ష్యాలు. మూడు కీలక భాగాలైన ప్రొపల్షన్ మాడ్యూల్, ల్యాండర్, రోవర్‌లలో మొదటిది అతి పెద్దసోలార్ ప్యానెల్‌తో నిండిన పేటికా నిర్మాణం. రెండోది (ల్యాండర్) కూడా విశ్లేషణ పరికరాలను తరలించే పెట్టె ఆకారమే. మూడోది రోవర్ దీర్ఘ చతురస్రంగా ఉండే చక్రం. ఉపరితల పయనం సాగించాలన్నా, నమూనాలన్నింటినీ సమీకరించాలన్నా, చందమామ రసాయన, భౌగోళిక కూర్పును సమగ్రంగా విశ్లేషించాలన్నా అదే. అంటే ఒక విధంగా సంచార ప్రయోగశాల అన్నమాట. ఆ రోవరే దేశంలోని ల్యాండర్ – గ్రౌండ్ కంట్రోల్ బృందంతో కమ్యూనికేషన్ కొనసాగిస్తుంటుంది. భూమి, చంద్రుడి మధ్య దూరమైన లక్షలాది కిలోమీటర్ల మేర ప్రయాణం. రెండింటి నడుచ నమీపస్థితిని పరిపూర్తిగా గణించిన తర్వాతే, ప్రయోగ తేదీని నిశ్చయించుకుంది భారత అంతరిక్ష పరిశోధనా వ్యవస్థ.

ఇదే సందర్భంలో 'ఒక మహిళాశక్తి' యావత్ జాతి దృష్టిని ఆకర్షిస్తోంది. రాకెట్ విమెన్‌గా ఆమెను సంభావిస్తూ, ప్రాజెక్టు ఇన్‌ఛార్జి (బాధ్యురాలు)గా గౌరవిస్తూ జేజేలు పలికింది. ఆమే రీతూ శ్రీవాత్సవ. లక్నో విశ్వవిద్యాలయం నుంచి ఎంఎస్‌సీ, బెంగళూరు కేంద్రంగా ఎంటెక్. ఇస్రోలో పాతికేళ్లుగా మంగళ యాన్ మిషన్ సహా అనేక రూపకల్పనల్లో తానూ ప్రధాన భాగస్వామిని. దీక్షా దక్షతలకు గుర్తుగా పదిహేనేళ్ల క్రితమే యువశాస్త్రవేత్తగా అవార్డు విజేత. చిన్న నాటి నుంచీ రాత్రిళ్లు జాబిల్లిని చూసి ఎంతగానో మురిసేది. ఆ వెన్నెల రాజ్యంలో ఉన్నవాటిని శోధించి తెలుసుకోవాలని కలలు కనేది. ఎలాగైనా సరే నెలరాజు ప్రాంతమంతటినీ అవగాహనకు తెచ్చుకోవాలని – ఎక్కడ ఏ సమాచారం కనిపించినా దరిచేర్చుకుని పదిలపరుస్తుండేది. సంస్థలో పలు

రీతూ!

జంధ్యాల శరత్‌బాబు
సీనియర్ జర్నలిస్ట్

'ఆపరేషన్స్'కు సంచాలిక బాధ్యతలు వహించి, ప్రాచుర్యాన్ని సొంతం చేసుకున్న మేటి వనిత.

చంద్రయాన్ -2 వైఫల్యాన్ని విశ్లేషించుకుని అంతర్మథనం చేసుకున్న ఇస్రో ,ఇప్పటి ప్రయోగంలో మార్పు చేర్పులెన్నో చేసింది. చంద్ర ఉపరితలాన్ని బలంగా తాకినా గట్టిగా నిలిచేలా ల్యాండర్ అంచుల డిజైన్‌ను సరిచేసింది. అనువైన అత్యాధునిక సాఫ్ట్‌వేర్‌ను జోడించింది. ఆర్బిటర్, మిషన్ కంట్రోల్‌తో అన్వయానికి దీటుగా కెమెరాల సంఖ్యను పెంచింది. ఇంధన పరిమాణ హెచ్చింపు, సౌర ఫలకాల పెంపుదల, సెన్సర్ల ఆధునికీకరణ..మరెన్నో ముందు జాగ్రత్తలు తీసు కుంది. ప్రత్యామ్నాయాల ఏర్పాట్లను సైతం ముందుగానే సంసిద్ధపరచుకుంది. ఆగస్ట్ 23, ఆ తర్వాత ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్, రోవర్ మిళిత రూపం విడిపోయి; చంద్రుని ఉపరితలం దిశగా తరలుతుంది. సంబంధిత ఇంజిన్ల అండదండలతో వేగాన్ని తనకు తానుగా ఎప్పటికప్పుడు సర్దుబాటు చేసుకుంటుంది. వీటన్నింటినీ, ఈ ముఖ్య అంశాల పరంపర అంతటిని రీతూ సంపూర్ణంగా అధ్యయనం చేయగలిగారు. తిరుపతి జిల్లాలో స్పేస్ సెంటర్ వద్ద రాకెట్ కౌంట్‌డౌన్ ప్రక్రియ మొదలయ్యే

ముందువరకు నరాలు తెగేంత ఉత్కంఠ. ప్రతీ శాస్త్రవేత్త, సాంకేతిక సిబ్బందిలోనూ ఎంతెంతో ఉద్విగ్నత. చంద్ర యాన్-3తో నిండిన ఎల్‌వీఎం-3 పీ4 వాహక నౌక అది. ఇస్రో ఛైర్మన్, సంబంధిత శాఖల - విభాగాల - బృందాల నిర్వాహకులు, ఇంకా ఎందరెందరిలోనూ అనుక్షణ ఉద్వేగ తీవ్రత. దక్షిణ ధ్రువానికి చేరువలోని నిర్ణీత అక్షాంశం వద్ద ఎంచుకున్న ప్రాంతంలో ల్యాండింగ్ జరగాలంతే! అదే అందరి, అక్కడి ప్రతి ఒక్కరి ఏకైక ప్రగాఢ కోరిక. అప్పుడే విశ్వరహస్యాలెన్నింటినో వెలికితీసే సావకాశం భారత్ వశమవుతుంది. పురాతన శిలలపరంగా శోధనల ముమ్మరం తోనే, విశ్వ ఆవిర్భావ విశేషాలనేకం ఇంకా వెలికివస్తాయి. అందుకే ఉపగ్రహ ప్రాజెక్టు డైరెక్టర్లతోపాటు మిషన్, అసోసియేట్ మిషన్ డైరెక్టర్ల, వెహికల్ రంగ సంచాలకుల్లో అత్యంత ఉత్సుకత. వీరందరి నడుమ రీతూ మదిలోనూ భావనా సంచలనం. ఆమెది తొలి నుంచీ శాస్త్రీయ అధ్యయన కోణం. సకల మానవాళికీ ముఖ్య ఆకర్షణగా మారిన చంద్రుడి పరిణామ క్రమాన్ని ఇంకెంతో

సీనియర్ శాస్త్రవేత్తగా రీతూకి పలు అనుభవాలున్నాయి. మార్స్ ఆర్బిటర్ మిషన్‌తో ఎంతో పరిణతి పొందగలిగారు ఇప్పటికే. రాకెట్ విమెన్‌గా ప్రస్తుతం ఇంత పేరు సాధించారంటే - ప్రధాన నాయకత్వ బృందంలో తనూ ఒకరు కావడమే కారణం. ఏళ్లగా సర్వశక్తులనీ వినియోగిస్తూ వస్తున్నారు.

తెలుసుకుని తీరాలన్న జీవితకాల పట్టుదల.

పట్టుదలలో మేటి

సీనియర్ శాస్త్రవేత్తగా రీతూకి పలు అనుభవాలున్నాయి. మార్స్ ఆర్బిటర్ మిషన్‌తో ఎంతో పరిణతి పొందగలిగారు ఇప్పటికే. రాకెట్ విమెన్‌గా ప్రస్తుతం ఇంత పేరు సాధించారంటే - ప్రధాన నాయకత్వ బృందంలో తనూ ఒకరు కావడమే కారణం. ఏళ్లగా సర్వశక్తులనీ వినియోగిస్తూ వస్తున్నారు. ఇదే చంద్రయాన్-3 మిషన్‌లో దరిదాపు అరవైమంది మహిళా శాస్త్రవేత్తలు పనిచేస్తున్నప్పటికీ; పలు కేంద్రాల సిస్టమ్స్ అసోసియేట్స్‌గా వ్యవహరిస్తున్నప్పటికీ... రీతూలో ప్రత్యేకత నిత్య పరిశ్రమ. మిషన్ నాయకురాలిగా ఫలితాలను స్వీకరించగలిగిన వ్యక్తిత్వ ప్రతిభ. ఏరోస్పేస్ ఇంజనీరుగా అపార అనుభవం. స్వరాష్ట్రం ఉత్తర్‌ప్రదేశ్. మధ్య తరగతి కుటుంబం. సోదరీ సోదరులు నలుగురి మధ్య ఆత్మీయతతో పెరిగారు. తాను ఫిజిక్స్‌లో డాక్టరేట్. అప్పట్లో యంగ్‌సైంటిస్ట్ పురస్కృతిని నాటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం నుంచి అందుకున్నారు. మరింత సమున్నత గౌరవంగా ఆ సందర్భాన్ని నేటికీ ప్రస్తావిస్తుంటారామె. తను అనేకానేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. ఇస్రో టీమ్‌అవార్డుతో సొసైటీ ఆఫ్ ఇండియా ఏరోస్పేస్ టెక్నాలజీ పురస్కారాన్నీ స్వీకరించారు.

సంకల్పశక్తికి చిరునామా

ఆమె మాటల్లోనే.... 'సైన్స్ అనేది నా దృష్టిలో కేవలం ఒక పాఠ్యాంశం మాత్రమే కాదు. అదొక జీవన దృక్పథం. అంతరిక్ష శోధన గురించే బాల్యం నుంచీ పరితపించాను. ఇస్రోలో నాకు ఉద్యోగం వచ్చినట్లు లేఖ అందుకు న్నప్పుడు నా సంతోషం ఆకాశమంత! మా కుటుంబం ఉండేది రాజాజీ పురంలో. ఒక్కసారిగా పేరూ ప్రఖ్యాతులు వరించాయి. ఇదంతా గర్వకారణమే. అన్నింటికీ మించి, అంతరిక్ష అన్వేషణ రంగంలో ప్రస్తుతం మనదొక అపురూప ఘనత. ప్రయోగిత వ్యోమనౌక చంద్రకక్ష్యకు చేరేది ఆగస్ట్ 23వ తేదీన. మూడేళ్ల వెనక్కిళ్లి చూద్దాం. అప్పుడు చంద్రయాన్-2 ప్రయోగం ఎక్కడ ఎలా అయిందో గుర్తుచేసుకుంటే బాధగానే ఉంటుండేది. నాటి విక్రమ్ ల్యాండర్ ఏమైంది? చందమామ దక్షిణ ధ్రువం వద్ద భద్రంగా దిగడంలోనే సఫలం కాలేకపోయింది. ఇప్పుడైతే అక్కడే, సరిగ్గా ఆ చోటనే మన చంద్రయాన్-3 ల్యాండర్ రోవర్‌ను అదేచోట దింపుతుందన్నది ప్రధాన విషయం. నాటి వైఫల్యాన్ని అరికట్టేలా సరిపడా సాంకేతికతను నేటి ల్యాండర్‌లో అమర్చారు మా శాస్త్రవేత్తలు. మన చంద్రలోక పయనం ఇది మూడోది. అక్కడి వాస్తవికతను పరిశీలించగలిగితే, భూమి మొట్టమొదట ఏ విధంగా ఉండేదో సులువుగానే తెలిసిపోతుంది. ఇటు వంటి శాస్త్రీయ ప్రయోగాల పరంపరాలన్నీ జాతికి ఉత్తేజం పెంచేవే! ఒక వనితా శాస్త్రవేత్తగా అన్ని విధాలా సంతోషిస్తున్నాను'. ★

జిన్నా భావ

భారత రాజకీయాలు ఎత్తుకు పై ఎత్తులతో అనూహ్యమైన మలుపు తిరుగుతున్నాయి. ప్రతిపక్షం వేసిన ప్రతి ఎత్తుగడనూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ తనదైన శైలిలో చిత్తు చేస్తూ వస్తున్నారు. రానున్న ఎన్నికల్లో ఏ విధంగా అయినా ప్రధాని మోదీకి చెక్ పెట్టాలన్న ఉద్దేశంతో కొద్దిరోజుల కిందట ప్రతిపక్ష పార్టీలన్నీ పాట్నాలో సమావేశం పెట్టుకుని, తమ ఐక్యతను చాటిన కొద్ది రోజులకే ప్రధాని వారికి తిరుగులేని సవాలును విసిరారు. అదే, యూసీసీగా చెప్పుకుంటున్న ఉమ్మడి పౌరస్మృతి

ఇది కేవలం రాజకీయ వ్యూహం కాదు, ఒక తాత్విక సవాలు కూడా. కాగా, ఇది పాట్నాలో కలుసుకున్న 15 రాజకీయ పార్టీలూ మూడు గ్రూపులుగా విడిపోయేలా చేసింది. ఒక గ్రూపు

ఎస్ గురుమూర్తి
'తుగ్లక్' సంపాదకులు
ఆర్థిక, రాజకీయ వ్యవహారాల విశ్లేషకుడు

యూసీసీని పూర్తిగా వ్యతిరేకిస్తుండగా, రెండవ బృందం దానికి మద్దతు ప్రకటిస్తుండగా, మూడవ జట్టు మద్దతుపలకాలా, వ్యతిరేకించాలా అనే మీమాంసలో పడి అయోమయంలో కొట్టు మిట్టాడుతోంది. అయితే, ఒక విషయం మాత్రం సుస్పష్టంగా చెప్పుకోవలసి ఉంది. ప్రధాని యూసీసీ భావన అన్నది కేవలం ప్రతిపక్షాలను విభజించాలన్న ఉద్దేశంతో ప్రతిపాదించింది కాదని, లోతుగా ఆలోచించి చేసినదని అనిపిస్తుంది. యుసిసికి మద్దతు ఇవ్వకపోవడం అంటే దేశ విభజనకు ముందు బ్రిటిష్‌వారు 1937లో ఆమోదించిన షరియ చట్టాన్ని సమర్థించడమే అన్న విషయం ఆయనకు తెలుసు. యూసీసీ అన్నది స్వచ్ఛమైన పలకమీద రాయడం కష్టం. దానిని 1937 చట్టాన్ని సరిదిద్దడమే. ప్రస్తుత రాజకీయ నాయకులు 1937 షరియా చట్టం, దాని నేపథ్య విషయంలో పూర్తి నిరక్షర కుక్షుల్లా కనిపిస్తున్నారు. ఒకవేళ 1937 చట్టం వెనుక ఉన్న నీచపు కథను మోదీ గుర్తు చేస్తే, అది ప్రతిపక్షాలను పూర్తిగా ధ్వంసం చేసేంత శక్తిమంతమైన రహస్యాలను బట్టబయలు చేస్తుంది. ఈ చట్టపు కథను గుర్తు చేసుకోవడం అంటే, విభజన ముందస్తు భారతదేశాన్ని పునఃస్థాపించడమే. ప్రధాని మోదీ కలల ప్రాజెక్టు కూడా అదేలా కనిపిస్తోంది.

కథ తర్వాత క్లైమాక్స్ ముందు...

సుదీర్ఘ కథను తర్వాత చెప్పుకుందాం. ఇప్పుడు నేరుగా క్లైమాక్స్‌కు వెళ్ళిపోదాం. 1937కు ముందు ముస్లింలు అనుసరించింది, పాటించింది, ప్రభుత్వం కూడా అనుసరించింది షరియాను హిందూ చట్టాలను... మరొక్కసారి చెప్పుకుందాం – హిందూ చట్టాలను మాత్రమే. భారతదేశవ్యాప్తంగా అన్ని శాఖలకు చెందిన ముస్లింలూ క్రోడీకరించని స్థానిక హిందూ సంప్రదాయాలను, ఆచారాలను అనుసరించేవారు. భారతదేశాన్ని హిందువులూ, ముస్లింలుగా విభజించాలనే పట్టుదలతో ఉన్న బ్రిటిష్‌వారికి, గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ నుంచి ముస్లింలను ఆకర్షించాలని తహతహలాడుతున్న ముస్లిం లీగ్‌కు మధ్య జరిగిన ఇరుపక్షాలకూ లాభకరమైన ఒప్పందమే ఈ 1937 షరియా చట్టం. స్థానిక హిందూ సంప్రదాయాలు, ఆచారాల ద్వారా హిందువులతో పూర్తిగా కలిసిపోయిన ముస్లింలను మొదటగా వారి నుంచి దూరం చేసి, హిందూ వ్యతిరేక ఇస్లామిక్ అస్తిత్వాన్ని వారికి సృష్టించి, అంతిమంగా భారత విభజనకు మార్గాన్ని సుగమం చేయడం లీగ్ ఉద్దేశ్యం.

ముస్లిం లీగ్ రహస్య లక్ష్యానికి బ్రిటిష్ వారు ఆజ్యం పోస్తూ, లీగ్ ప్రతిపాదించిన 1937 చట్టానికి అంగీకారం తెలిపారు. ఈ 1937 చట్టం మిషన్‌లో ఇతర రహస్యమైన, నీచమైన పిట్ట కథలు కూడా ఉన్నాయి. అటు బ్రిటిష్, ఇటు లీగ్ ఉమ్మడి వ్యూహమైన 1937 చట్టంలో ఇస్లామిక్ షరియాను విధ్వంసం చేసే నిబంధనలు ఉన్నాయి. ఎలా? షరియా చేసే కీడు నుంచి జిన్నాను, జమిందార్లను, ముస్లిం నాయకులను కాపాడి, వారి ఆస్తి హక్కులను పరిరక్షించేందుకు 1937 చట్టంలోకి హిందూ సంప్రదాయాలను, ఆచారాలను రహస్యంగా దిగుమతి చేసుకున్నారు. ప్రస్తుతం పవిత్ర ఇస్లాం చట్టంగా కీర్తిస్తున్న 1937 షరియా చట్టంలో లీగ్ నాయకుల ఆస్తి హక్కులను కాపాడే హిందూ చట్ట నిబంధనలు ఉన్నాయా? అవును! ఉన్నాయి. నిజానికి, ఇది 1,000 సంవత్సరాల నేపథ్యం కలిగిన

విస్ఫోటక కథ.

1000 ఏళ్లపాటు ఉనికిలో లేని షరియా!

భారతదేశంలోకి 7వ శతాబ్దంలో వాణిజ్యం ద్వారాను, 8వ శతాబ్దంలో కాసీంలు, ఘజ్నీల వంటివారి కత్తుల ద్వారాను ఇస్లాం ప్రవేశించింది. పదవ శతాబ్దం నాటికి అది భారతదేశంలోని అత్యధిక భాగాలకు విస్తరించింది.

ఇస్లాంలో మార్పులేని భాగమని ఇప్పుడు ఇస్లామిస్టులు వాదిస్తున్న షరియాను భారతదేశంలోని కపట ఇస్లాంవాదుల కోసం ఎప్పుడు చట్టంగా చేశారు? ఎవరైనా ఊహించగలరా? కాదు, 11వ శతాబ్దంలోకాదు, కనీసం 12లో లేదా 13వ శతాబ్దంలో లేక 14వ, 15వ, 16వ లేక 17వ, ఇంకా మాట్లాడితే, ఇస్లాం రాజుల పాలన అంతమైన

న.. బ్రిటిష్ యోజన

కాలమ్నై, అధికారం తొలుత హిందువులైన మారాఠాలకు తర్వాత బ్రిటిష్‌వారి చేతుల్లోకి వెళ్లిన 18వ శతాబ్దంలో కూడా కాదు. బ్రిటిష్‌పాలన వేళ్లూనుకొని, విస్తరిస్తున్న 19వ శతాబ్దంలో కూడా కాదు. మరి అయితే ఎప్పటి నుంచి?

ఇస్లాం మతం పుచ్చుకున్న వా కోసం షరియా చట్టాన్ని చేయకుండానే అత్యంత ప్రచండమైన మొగల్ పాలకుడైన ఔరంగజేబు మరణించిన నూట పాతికేళ్లకు పైబడిన కాలం తర్వాత 1937లో ఈ చట్టం వచ్చింది. నాటి మతం పుచ్చుకున్న వారు షరియా కన్నా అప్పటికి ఉనికిలో ఉన్న స్థానిక అంటే హిందూ ఆచార, సంప్రదాయాలను ఆమోదించి,

అనుసరించడాన్ని బ్రిటిష్ ప్రభుత్వం గుర్తించింది. భారతీయ ముస్లిం వర్గాలలో వారసత్వ వ్యవహారాలలో అప్పటివరకూ అనుసరిస్తున్న ఆచార, వ్యవహారాలకు బ్రిటిష్‌వారు బలాన్ని ఇచ్చారని ' ది హిస్టరీ ఆఫ్ ఎవల్యూషన్ ఆఫ్ ముస్లిం పర్సన్ లా ఇన్ ఇండియా' పుస్తక రచయిత కె.కె. అబ్దుల్ రెహ్మాన్ (1986) పేర్కొన్నారు.

గుప్త రాజకీయ అజెండా, రహస్య ఆర్థిక అజెండా

అటువంటప్పుడు షరియా కోసం 1937లో హఠాత్ ప్రయత్నం ఎందుకు? ఈ ప్రశ్నకు అనుబంధంగా మరొక రెండు ప్రశ్నలు తలెత్తుతాయి: మొదటిది, దాదాపు 1,000 సంవత్సరాల కాలం షరియా చట్టం గురించి ఆలోచించని ముస్లిం మతం పుచ్చుకున్నవారు, తమంతట తాముగా షరియా చట్టాన్ని ఎందుకు డిమాండ్ చేస్తున్నారు? లేదా, దాదాపు రెండు దశాబ్దాల కాలంపాటు భారత్‌ను పాలించిన బ్రిటిష్ పాలకులు, హిందూ– ముస్లిం ఐక్యతకు ఏదో ఒకరకంగా విఘాతం కలిగించే సుదీర్ఘ పరిణామాలు కలిగిన షరియా గురించి అకస్మాత్తుగా ఆలోచించారా? ఈ రెండు ప్రశ్నలకు సమాధానంగా, 1937 చట్టం అన్నది ముస్లిం లీగ్‌కు (అంటే ముస్లింలకు కాదు), బ్రిటిష్ వారికీ మధ్య జరిగిన ఒప్పందం వాస్తవం వెలుగులోకి వస్తుంది. మొదటగా, మతం పుచ్చుకున్నవారు షరియాను కోరలేదు. ఆ కోరిక కోరింది ముస్లిం లీగ్. తమ పాలనను కొనసాగించుకోవాలన్న కోరిక కలిగిన బ్రిటిష్ వారికి హిందూ, ముస్లింలను విభజించాలనే గుప్త అజెండా ఎప్పుడూ ఉండేది. షరియాను డిమాండ్ చేసిన లీగ్ నాయకులకు దేశాన్ని భజించాలన్న రహస్య రాజకీయ అజెండాతో పాటుగా తమ ఆస్తి హక్కులను కాపాడుకునేందుకు హిందూ చట్టాన్ని రహస్యంగా నిలుపుకోవడం ద్వారా షరియా నుంచి తప్పించుకునే వ్యక్తిగత ఆర్థిక అజెండా ఉంది. ఇప్పుడు, 1937 షరియాను చూద్దాం. అది పూర్తి చట్టం కాదన్నది సుస్పష్టమే. 1937 చట్టం అన్నది చట్టబద్ధమైన ఇస్లామిక్ చట్టమే కాదు, అందులోకి రహస్యంగా తరలించిన హిందూ చట్టం కొనసాగింపుల మేళవింపు. లీగ్ నాయకులు ఒక బాణంతో రెండు పిట్టలను కొట్టారు. మొదటగా, హిందూ సాంప్రదాయాలు, అలవాట్లు చట్టాలలో మమేకమైపోయిన భారతీయ ముస్లింలను మానసికంగా వేరు చేయడమే కాదు, కాలక్రమంలో జరుగనున్న దేశవిభజనకు వారిని సంసిద్ధం చేశారు. రెండవది, వారు షరియా నుంచి తప్పించుకోవడమే కాదు, సంప్రదాయ హిందూ చట్టాల కింద సంపన్నమైన, శక్తిమంతమైన ముస్లిం లీగ్ నాయకులు వారసత్వ సంపదను అనుభవిస్తూ తమ ఆర్థిక బలాన్ని పరిరక్షించుకున్నారు. అది కేవలం భారతదేశం, హిందువులకు వ్యతిరేకమైన కుట్ర మాత్రమే కాదు, సాధారణ ముస్లిం ప్రజానీకానికి వ్యతిరేకమైన కుట్ర కూడా.

షరియాలోకి హిందూ చట్టం అక్రమ రవాణా

మతం పుచ్చుకున్నవారు అనుసరిస్తున్న సంప్రదాయ హిందూ చట్టం స్థానంలో వారిపై షరియాలోని అనేక నిబంధనలను రుద్ది వారిచేత అనుసరింప చేసేందుకు 1937 చట్టంలోని కీలక భాగంలో కేవలం 92 పదాలను మాత్రమే ఉపయోగించారు. 1937లోని ఈ 92 పదాలనే ముస్లింలు అతిక్రమించలేని దైవికమైన, మార్పులేని ఇస్లామిక్ చట్టంగా భావించి, వాదిస్తున్నారు.

కానీ, 1937 షరియా చట్టమే, నిజంగా ముస్లింలకు నిర్దేశించిన దైవిక షరియా చట్టమా? కాదు. అది వాస్తవానికి ఇస్లామిక్ షరియాకు వ్యతిరేకం, అలాగే కొనసాగుతున్నది కూడా. ఎందుకు? హిందూ చట్టం ప్రదానం చేసే మూడు కీలక హక్కులను అది షరియత్‌లోకి అక్రమంగా రవాణా చేసుకుంది. హిందువులలాగానే, నచ్చినవారికి, పిల్లలకు తమ ఆస్తులకు సంబంధించి వీలునామాలు రాసేందుకు ముస్లింలకు 1937 చట్టం అనుమతిస్తుంది. అయితే, ఇస్లాంలో నిషిద్ధం! రెండవది, అది నాడు, నేడూ కూడా విలువైన ఆస్తి అయిన వ్యవసాయ భూమికి మినహాయింపును ఇచ్చి, ముస్లింలపై హిందూ రుషులు ప్రతిపాదించిన చట్టాలు అనువర్తితం కావడాన్ని కొనసాగించింది. మూడవది, ఇస్లామిక్ చట్టం, ప్రవక్త నిషేధించిన దత్తతను హిందువులలాగే, పిల్లలు లేని ముస్లింలు కూడా చేసుకోవడానికి అనుమతి ఇచ్చింది. స్వచ్ఛమైన ఇస్లామిక్ ధర్మశాస్త్రం దృష్టిలో చూస్తే, 1937 చట్టం ఖురాన్ వ్యతిరేకమే కాదు, ఇస్లాంలో దైవదూషణ కూడా. 1937 షరియత్ చట్టంలోకి హిందూ చట్టాన్ని రహస్యంగా తరలించడం ద్వారా ఎవరు లబ్ధి పొందారు?

జిన్నాకు, జమిందార్లకు హిందూ చట్టం : సాధారణ ముస్లింలకు షరియా

తమ ఆస్తులకు సంబంధించి వీలునామాలు రాసే హక్కుకు షరియాలో అనుమతి లేదు. దీనిని తొలుత తన కోసం వ్యక్తిగత ఒప్పందంగా 1937లోకి అక్రమంగా చొప్పించేందుకు జిన్నా చర్చించాడు. తనకున్న భారీ ఎస్టేట్‌ను షరియా ప్రకారం కాకుండా

తనకు నచ్చినవారికి బదిలీ చేయాలని జిన్నా భావించాడు. కాగా, 1937 చట్టం వచ్చిన రెండేళ్ల తర్వాత, అంటే 1939 మే 30న ముస్లిమేతరుడు, పార్సీ అయిన వ్యక్తిని వివాహం చేసుకున్న తన కుమార్తె దీనాకు వారసత్వ హక్కు లేకుండా చేసేందుకు జిన్నా వీలునామా రాసాడు. ఆయనకున్న ఏకైక వారసురాలిగా, షరియా కింద మొత్తం ఎస్టేట్‌ను ఆమె పొందవచ్చు. అయితే, తన కుమార్తె దీనాకు వారసత్వ హక్కు లేకుండా చేయాలని జిన్నా భావించాడన్న విషయాన్ని ఆయన స్నేహితుడు, ప్రముఖ న్యాయమూర్తి, న్యాయనిపుణుడు ఎం.సి. చాగ్లా ధృవీకరించారు. అందుకే, తన సోదరి ఫాతిమాకు తన వీలునామా రాస్తూ, ముంబైలోని ప్రతిష్ఠాత్మకమైన మలబార్ హిల్స్ ప్రాంతంలో ప్రస్తుం రూ. 1,000 కోట్లఉ విలువ చేసే 2.5 ఎకరాలలో విస్తరించిన భారీ బంగ్లాతో సహా స్థిర, చరాస్తుల నన్నింటినీ సంక్రమింపచేశాడు. వారసత్వ హక్కులు లేని దీనాకు కొద్దిపాటి ఏడాదికి కొంత మొత్తాన్ని ఇస్తూ, ధార్మిక సదుపాయాలను కల్పించేందుకు అనేక అంశాలను అందులో పొందుపరిచాడు. ఇక్కడ మరొక ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, దీనా పుట్టింది ఒక పార్సీ మహిళకు కావడం. ఆమెను వివాహం చేసుకున్న జిన్నా ఆమెను ఇస్లాం మతం స్వీకరింపచేశాడు. ఇక 1937 చట్టంలో రెండు షరియా అతిక్రమణలు – వ్యవసాయ భూములను మినహాయించడం, దత్తత తీసుకునేందుకు అనుమతించడం అన్నవి ముస్లిం లీగ్‌కు వెన్నుముకగా ఉన్న జమిందార్లు, ఆస్తులు కలిగిన సంపన్నుల కోసం రూపొందించి, చేసినవే. వ్యవసాయ భూములను మినహాయించడం అన్నది హిందూ చట్టంలో లాగానే అది మగవారసుల చేతుల్లో ఉండేలా చూడటమే కాదు, షరియా ప్రకారం అందులో సెంటు భూమి కూడా దక్కకుండా అయింది. అలాగే, జమిందార్లు, ఇతరులు కూడా హిందువుల లాగానే మగపిల్లలను దత్తత చేసుకునేందుకు అవకాశమివ్వడమే కాక షరియా ప్రకారం ఆస్తిలో మరొక మగవారసుడు కోరకుండా ఉండేందుకు దత్తత చేసుకునే హక్కును పొందు పరిచారు. సాధారణ ముస్లింలకు 1937 చట్టమే షరియా, కాని జిన్నాకు, జమిందార్లకు హిందూ చట్టం.

ఇస్లాంకు వ్యతిరేకంగా ఒప్పందం చేసుకున్న నాయకులు

1937 షరియత్ చట్టంలోకి షరియా వ్యతిరేక హిందూ చట్టాన్ని అక్రమంగా ప్రవేశపెట్టాలని ఎవరు పట్టుబట్టి ఉంటారు? బ్రిటిష్ వారు అయితే అయి ఉండరు.

ముస్లింలకు దత్తత చేసుకునే హక్కు ఉండాలని లేదా ఆస్తులకు వీలునామా రాసే హక్కు లేదా 1937 చట్టం పరిధి నుంచి వ్యవసాయ భూములను మినహాయించడం కోసం వారు ఎందుకు పట్టుబడతారు? 1937 చట్టంలోకి హిందూ చట్టాన్ని రహస్యంగా ప్రవేశపెట్టడం ద్వారా ఎవరు లబ్ధిపొందారు? లీగ్ నాయకులు పొందారు తప్ప బ్రిటిష్‌వారు కాదు. తమ కోసం హిందూ చట్టాన్ని కొనసాగించాలని పట్టుబట్టి, బ్రిటిష్‌వారితో ఒప్పందం చేసుకున్నవారు దాని నుంచి లబ్ధి పొందేవారు అయి ఉంటారని చెప్పడానికి ఏ రుషి, ముని అవసరం లేదు.

1937 షరియా చట్టం ముస్లింల చట్టమని, దానిని పార్లమెంటు కూడా తాకరానిదంటూ కప్పులెక్కి కేకలేసిన వారంతా, ఇస్లామిక్ రాజకీయాల కోసం ఉద్దేశించిన షరియా చట్టమే 1937 చట్టమనే విషయాన్ని జిన్నా, జమిందార్ల ఆర్థిక అవసరాల కోసం ఉద్దేశించిన హిందూ చట్టమనే అంశాన్ని కాదనగలరా? బ్రిటిషు వారితో చేసుకున్న ఒప్పందం ద్వారా షరియాలోకి అక్రమంగా హిందూ చట్టాన్ని తీసుకువచ్చి తమ ఆస్తిపాస్తులను కాపాడుకున్న లీగ్ నాయకులు, ముస్లింలలో మతపరమైన ఉద్వేగాలను రెచ్చగొట్టారు.

కేవలం 10 సంవత్సరాలలోనే 1937 షరియా చట్టం, హిందూ, ముస్లింల సామాజిక మేళవింపును విచ్ఛిన్నం చేసి, వారిని విభజించి, ముస్లిం అస్తిత్వాన్ని ఘనీభవింపచేసి, 1947లో వాస్తవరూపం దాల్చిన విభజన డిమాండ్‌ను 1940ల్లో పెట్టించింది.

'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' నుంచి



'ఉమ్మడి పౌరస్మృతి' ఎవరి మతస్వేచ్ఛనూ హరించదు!

కరీంనగర్ : దేశం అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలంటే 'ఉమ్మడి పౌరస్మృతి' అమలు తక్షణావసరమని ప్రముఖ విశ్లేషకులు మామిడి గిరిధర్ అభిప్రాయపడ్డారు. జూలై 15న కరీంనగర్‌లో ప్రజ్ఞాభారతి, తపస్ సంస్థలు సంయుక్తంగా 'ఉమ్మడి పౌరస్మృతి' అంశంపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడి గిరిధర్ మాట్లాడారు. యూనిఫాం సివిల్ కోడ్ (యూసీసీ) ముస్లిం మత స్వేచ్ఛను హరిస్తుందని కొందరు మాట్లాడుతున్నారని, ఇది పూర్తిగా అబద్ధమని చెప్పారు. దీని ప్రకారం దేశంలోని ప్రతి పౌరుడికి ఒకే రకమైన చట్టం వర్తిస్తుంది తప్ప, ఇది ఏ మత స్వేచ్ఛను హరించదని చెప్పారు. ఈ చట్టం అమలుకు మద్దతుగా దేశ వ్యాప్తంగా అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డా॥ పొలాస రాంకిరణ్ మాట్లాడుతూ ఉమ్మడి పౌరస్మృతి అనేది దేశాన్ని ఏకతాటిపై నడిపించే బ్రహ్మాస్త్రమని పేర్కొన్నారు.

ప్రజ్ఞాభారతి జిల్లా చైర్మన్ డాక్టర్ ఎల్. రాజభాస్కర్ రెడ్డి సభాధ్యక్షత వహించగా డి. నిరంజనాచారి, ఎలగందుల సత్యనారాయణ, కట్ట రాజేశ్వర్, మందల నగేష్ రెడ్డి, దేశిని శ్రీనివాస్, గన్నమనేని రంగారావు, వెచ్చ మురళి, తుమ్మల రమేష్ రెడ్డి, కన్న కృష్ణ, కొమురవెల్లి వెంకటేశం, గాలిపెల్లి శంకరయ్య, ఢిల్లీ డిఫెన్స్ అకాడమీ సతీష్‌రెడ్డి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. ★

కరీంనగర్‌లో 'ఉమ్మడి పౌరస్మృతి' జాగృతి పత్యేక సంచిక ఆవిష్కరణ

కరీంనగర్: 'ఉమ్మడి పౌరస్మృతి'పై జాగృతి ప్రచురించిన ప్రత్యేక సంచికను జూలై 8న కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ ఉమ్మడి పౌరస్మృతి పూర్వాపరాలు, ప్రస్తుత ఆవశ్యకతను జాగృతి ప్రత్యేక సంచికలో చక్కగా వివరించారని కొనియాడారు. ఇందులో ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సంఘచాలక్ బూర్ల దక్షిణామూర్తి, సహవిభాగ్ సంఘచాలక్ డా.చక్రవర్తుల రమణాచారి, జిల్లా సంఘచాలక్ నిరంజనాచారి, డా. రాజభాస్కర రెడ్డి, కరీంనగర్ ఫిల్మ్ భవన్ అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బోయినపల్లి నర్సింగరావు, గాజుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు. ★

'ఉమ్మడి పౌరస్మృతి'పై ప్రత్యేక సదస్సు

హైదరాబాద్: నగరంలోని ఉప్పల్‌లో గల రాఘవ కన్వెన్షన్ హాలులో జూలై 16న ఉప్పల్ భాగ్ రాష్ట్ర చింతనా కార్యక్రమం జరిగింది. ఇందులో ముఖ్యవక్తగా కస్తూరి రాకాసుధాకర్, ముఖ్యఅతిథిగా డాక్టర్ భరత్ చంద్ర, భాగ్ కార్యవాహ చిన్నమ్ రాజు పాల్గొన్నారు.

దాదాపు 140 మంది ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో యూనిఫాం సివిల్ కోడ్ అవసరం గురించి పలువురు వక్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ★

కేదార్ యాత్ర దివ్యానుభూతి



నాడు..

జీవుడుండగానే జీవితకాలంలో కాశీని చూడాలి.

నేడు..

శివసన్నిధి చేరే ముందుగానే కేదార్‌నాథ్ వెళ్లాలి.

రవాణా మార్గాలు అంతగా లేని సమయంలో కాశీ వెళ్లి రావడమంటే గొప్ప సాహసంగా ఉండేది. అందుకే, కాశీ నుంచి తిరిగి వచ్చిన వారు దానిని పండుగలా జరుపుకుని, ఊరందరికీ భోజనాలు పెట్టుకునేవారు. మరి అప్పట్లో కేదార్‌నాథ్‌కు వెళ్లాలన్న ఊహ ఆధ్యాత్మికంగా ఉన్నత స్థాయిలో ఉన్నవారికి తప్ప సామాన్యులకు వచ్చేది కాదేమో! అయితే, ఇప్పుడు రవాణా సదుపాయాలు పెరగడంతో ఆ క్షేత్రాన్ని సందర్శించాలనే తపన కూడా పెరిగింది. కానీ, అప్పుడూ, ఇప్పుడూ కూడా కేదార్‌నాథ్ వెళ్లడం కష్టమే. అయినా, జనానికి కష్టం తర్వాత వచ్చే ఇష్టమంటే మక్కువ. అందుకే, అప్పుడు కాశీకి వెళ్లినట్టే – ఇప్పుడు కేదార్‌నాథ్ ప్రాణాలకు తెగించి ప్రయాణిస్తున్నారు.

ఉత్తరాఖండ్ రాష్ట్రంలో సముద్ర మట్టానికి సుమారు 11755 అడుగుల ఎత్తున గల కేదార్‌నాథ్ కొండపై ఆక్సిజన్ వాయువు తక్కువగా ఉండి ఊపిరి సరిగ్గా ఆడదు. అందుకే కృత్రిమ ఆక్సిజన్ కిట్ కూడా ఉండాలి. ఎముకలు కొరికే మైనస్ డిగ్రీల చలిని తట్టుకోవాలి. వాస్తవానికి, ఆదిశంకరాచార్యులు చెప్పిన చార్‌ధామ్ క్షేత్రాలు – అంటే తూర్పున పూరీ, పడమర ద్వారక, దక్షిణాన రామేశ్వరం, ఉత్తరాన బదరీనాథ్‌లే తప్ప జాబితాలో కేదార్‌నాథ్ లేదు. కాని, ఆధునిక చార్‌ధామ్ క్షేత్రాలుగా పేరుపొందిన వాటిలో ఈ క్షేత్రం చేరింది. అందులో మిగిలినవి బదరీనాథ్, యమునోత్రి, గంగోత్రి. ఈ నాలుగు నయా చార్‌ధామ్‌లలో మిగిలిన మూడింటి కంటే కేదార్‌నాథ్ దర్శనం అతికష్టతరమైంది. అయినా భక్తకోటి ఈ క్షేత్రానికి బారులు తీరుతున్నారు. నాకు ఈ ఏడాది మే 23న ఈ క్షేత్ర దర్శన భాగ్యం కలిగింది. 2013లో వరద ప్రళయం తర్వాత, 2019లో కరోనా కారణాలవల్ల తగ్గుముఖం పట్టిన కేదార్‌నాథ్ యాత్ర, 2023లో అనూహ్యంగా పుంజుకుంది. భక్తులతోపాటు పర్యాటక ప్రియులు కూడా పోటెత్తుతున్నారు. జనంతో పర్వతదారులు చీమల బారుల్ని తలపిస్తున్నాయి.

క్లిష్ట మార్గం...

గంగోత్రి, బదరీనాథ్‌లకు పెద్దగా కష్ట పడకుండా నేరుగా వాహనాల్లో వెళ్లవచ్చు. యమునోత్రి, కేదార్‌నాథ్‌లకు, మరీ ముఖ్యంగా, కేదార్‌నాథ్ ప్రయాణం అతికష్టం. అక్కడికి వెళ్లాలంటే ముందుగా దర్శన తేదీని తెలియజేస్తూ రిజిస్ట్రేషన్ చేసుకొని, ఆ అనుమతి పత్రాన్ని దగ్గర పొందాలి. సోన్‌ప్రయాగ అనే ఊర్లో ఆ పత్రాన్ని చూపించాలి. తర్వాత అక్కడ నుంచి 3 కిలోమీటర్లు వెళ్లి గౌరీకుండ్ అనే కేదార్ పర్వత దిగువ ప్రాంతానికి చేరుకోవాలి.

ఐదు మార్గాలు...

కేదార్ పర్వతం గౌరీకుండ్ 16 కిలో మీటర్లు పొడవున ఉంటుంది. అతి కష్టమైన ఇరుకైన ఎత్తుపల్లాల రహదారి ఇది. అనేకచోట్ల నిట్టనిలువుగా నిచ్చెనలా మెట్లు ఉంటాయి. ఈ పర్వతంపైకి నడక, ఒక మనిషి మరొక మనిషిని వీపున మోసే పుట్టీ, నలుగురు మనుష్యులు ఒక మనిషిని మోసే డోలీ అనే పల్లకి, గుర్రం, హెలికాప్టర్ ..ఇలా ఐదు రకాలుగా వెళ్లవచ్చు. మన ఆర్థిక పరిస్థితులను బట్టి వీటిలో ఏదో

ఒకదానిని ఎంచుకోవాలి. ఒక్కొక్కసరి ఆర్థికంగా బాగున్నా అందరికీ హెలికాప్టర్ సౌకర్యం అందుబాటులో ఉండకపోవచ్చు. దీని రుసుం రాను,పోను ఆరువేల రూపాయలు కావడంతో విపరీతమైన పోటీ ఉంది. నూటికి ఒక్కరికి కూడా టికెట్ దొరకటం లేదు.

నాకు హెలికాప్టర్ టికెట్ గాని, డోలీ అనే పల్లకీ గాని దొరక్క పోవటంతో గుర్రంపై ప్రయాణాన్ని ఎంచుకున్నాను. వెళ్లిరావడానికి రూ.8 వేలు. ప్రయాణ సమయం వెళ్లడానికి నాలుగున్నర గంటలు, రావడానికి నాలుగు గంటలు. ఉదయం ఆరున్నర గంటలకు గుర్రం ఎక్కితే ఒకటి రెండు స్వల్ప విరామాలతో పదిన్నర గంటలకు కేదార్‌నాథ్ గుడి ప్రాంతానికి చేరుకున్నాను. ఎండపుణ్యమా అంటూ చలిబాధ లేకపోవటంతో సాయంత్రం నాలుగు గంటల వరకు కేదారేశ్వరుని ఆలయ ప్రాంగణంలోనే గడిపిన తరువాత తిరుగు ప్రయాణమై రాత్రి 8 గంటలకు గౌరీకుండ్ చేరుకోవడంతో యాత్ర సుఖప్రదంగా ముగించాను. కేదార్‌నాథ్ పర్వతం ఎక్కగానే హిమాలయ పర్వతం అధిరోహించినంత ఆనందం కలిగింది. నడిచి వెళ్లినవారు ఇంతకంటే ఆనందాన్ని పొందుతారు. కేదారేశ్వరుని గుడి చుట్టూ వెండి కొండలు అబ్బురపరుస్తాయి. భక్తుల సందడి చెప్పనే అక్కరలేదు.

ఉత్తరాఖండ్ రాష్ట్రాన్ని దేవభూమి అని ఎందుకంటారో ఈ యాత్ర తర్వాత అర్థమైంది. ఇంత రద్దీ ఉన్న ఆధ్యాత్మిక క్షేత్రానికి రవాణా సౌకర్యాలను మరింత మెరుగుపరచాలి. వృద్ధులను, శారీరక పటిష్టత లేనివారిని దృష్టిలో ఉంచుకొని హెలికాప్టర్ సర్వీసుల సంఖ్యను బాగా పెంచాలి. కాగా, ఉత్తరాఖండ్ ప్రభుత్వం వెయ్యి కోట్ల ఖర్చుతో సోన్ ప్రయాగ్ నుంచి కేదార్‌నాథ్‌కు రోప్‌వే వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.ఈ పథకం పూర్తయితే గంటకు దాదాపు రెండు వేల మంది భక్తులు కేదార్‌నాథ్‌ను చేరుకుంటారు. అప్పుడు ఆ యాత్ర మరింతగా అందుబాటులోకి వస్తుంది. ఆరోజు త్వరలోనే రావాలని కోరుకుంటూ, వేచిచూద్దాం!

పుట్టా సోమన్నచౌదరి
94403 39682

యువ ప్రతిభకు అవకాశాలు

వికసిత భారతం సంకల్ప సిద్ధిపై తన నిబద్ధతను కేంద్ర ప్రభుత్వం త్రికరణశుద్ధిగా చాటుకుంటోంది. ఈ మేరకు యువత ప్రతిభా సామర్థ్యాలకు తగిన ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్న వాగ్దానాన్ని త్వరత్వరగా నెరవేరుస్తోంది. ఇందులో భాగంగా 10 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'ఉపాధి మేళా' ఐదో విడతగా మే 16వ నిర్వహించిన కార్యక్రమంతో మరింత విస్తరించింది. 'ప్రధానమంత్రి ఉపాధి మేళా' ద్వారా ఇప్పటివరకు 3,59,000మంది యువత ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్నారు. కాగా, దేశంలో ఇంకా ఎందరో శక్తిమంతులైన కర్మయోగులున్నారు. ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీకి ఒకవైపు ఉద్యమ తరహాలో కృషి చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, మరోవైపు దేశవ్యాప్తంగా ఉపాధి కల్పనకు బలమైన పునాది వేస్తోంది. ఇందులో భాగంగా గత తొమ్మిదేళ్ల నుంచీ నియామక ప్రక్రియ మరింత సమర్థంగా, న్యాయంగా, పారదర్శకంగా సాగేలా రూపొందించింది. లోగడ నియామక ప్రక్రియ పూర్తికి 'స్టాఫ్ సెలక్షన్ కమిషన్' 15 నుంచి 18 నెలల సమయం తీసుకునేది. నేడు 6 నుంచి 8 నెలల్లో అది పూర్తవుతోంది. ఇలా ఒకదాని వెంట మరొకటిగా ఉపాధి మేళాలను నిర్వహిస్తూ 10 లక్షల నియామక పత్రాలను అందచేయాలన్న ప్రధాన లక్ష్యం దిశగా దేశం నేడు దూసుకుపోతోంది.

ఈ నేపథ్యంలో 5వ జాతీయ ఉపాధి కల్పన మేళాలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ– "నేడు

దరఖాస్తు నుంచి ఫలితాల దాకా మొత్తం ప్రక్రియ ఆన్లైన్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. గ్రూప్–సి, డి ఉద్యోగాలు ఇంటర్వ్యూతో నిమిత్తం లేకుండా పత్రాల స్వీయ–ధ్రువీకరణతోనే భర్తీ అవుతున్నాయి. అవినీతి లేదా బంధుప్రీతికి అవకాశం శూన్యం కావడం అన్నది ఈ కృషిలో కీలక ప్రయోజనం. అంతేకాదు... గత తొమ్మిదేళ్లలో మూలధన వ్యయం దాదాపు నాలుగు రెట్లు పెరిగి, దాదాపు రూ.34 లక్షల కోట్ల మేర నిధులు వెచ్చించిన ఫలితంగా అత్యాధునిక మౌలిక సదుపాయాలు సమకూరడమేగాక ప్రజలకు ఉపాధి అవకాశాలు, పెట్టుబడుల రాక, రికార్డు స్థాయి ఎగుమతులతో దేశంలోని మూలమూలనా అవకాశాలు సృష్టి అవుతున్నాయి" అని అన్నారు. కేంద్ర ప్రభుత్వంతోపాటు గుజరాత్, అస్సాం సహా, అనేక రాష్ట్రాలు కూడా యువతరం పట్ల తమ నిబద్ధతను చాటుకుంటూ ఉపాధి మేళాలు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా నియమితులైన వారిని ఉద్దేశించి మాట్లాడుతూ–"ఈ నియామకంతో మీ జీవితంలో ఒక నూతన అధ్యాయం మొదలవుతుంది. కాబట్టి అందివచ్చిన అవకాశాన్ని మీరంతా సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాను" అని ప్రధానమంత్రి హితవు పలికారు.

జాతీయ ఉపాధి మేళా: యువత పట్ల నిబద్ధతకు నిదర్శనం

- వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో కొత్తగా నియమితులైన సిబ్బందికి 2023 మే 16న దాదాపు 71,000 నియామక పత్రాలు వితరణ చేయడం జరిగింది.
- అంతకుముందు, 2023 ఏప్రిల్ 13న కూడా కేంద్ర ప్రభుత్వం వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో కొత్త సిబ్బందికి దాదాపు 71,000 నియామక పత్రాలను అందజేసింది.
- దీనికి ముందు 2023 జనవరి 20న మూడో దశ ఉపాధి మేళాలో ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో కొత్తగా నియమితులైన వారికి దాదాపు 71,000 నియామక పత్రాలు అందచేశారు.
- దేశవ్యాప్తంగా 45కు పైగా నగరాల్లో 2022 నవంబర్ 22న నిర్వహించిన కార్యక్రమంలో 1,000 మందికి పైగా యువతీ యువకులు నియామకపత్రాలు అందుకున్నారు.
- కాగా, వివిధ రాష్ట్రాల్లో 2022 అక్టోబర్ 22న నిర్వహించిన తొలి ఉపాధి మేళాలలో మాత్రం ఏకకాలంలో 75,000 మందికి నియామక పత్రాలను ప్రధాని మోదీ విడుదల చేశారు.

'న్యూ ఇండియా సమాచార్' నుంచి

లడేంగే-ఔర్

ఆంధ్ర భాషా సంస్కృతుల ప్రచారానికై బూర్గుల రంగనాథరావు, భాస్కరభట్ల కృష్ణారావు ప్రభృతులు మే 26, 1943న రెడ్డి హాస్టల్ (నిజాం వ్యతిరేక పోరాటంలో రెడ్డి హాస్టల్‌కు కొన్ని పేజీలు కేటాయించాలి) లోని గ్రంథాలయంలో సమావేశమై నిజాం రాష్ట్ర ఆంధ్ర సారస్వత పరిషత్‌ను ఏర్పాటు చేశారు. దాని ప్రథమ మహాసభ జూన్ 1న జరిగింది. ఆ తర్వాత నుంచి సురవరం ప్రతాపరెడ్డి, పి.వి.నరసింహారావు, బూర్గుల రామకృష్ణారావు, బెజవాడ గోపాలరెడ్డి, మర్రి చెన్నారెడ్డి, అడవి బాపిరాజు వంటి మహా మహులెందరో ఈ సంస్థ ద్వారా తెలుగు భాషా, సంస్కృతుల ప్రచారానికి కృషి చేశారు. దేవులపల్లి రామానుజరావు జీవితాంతం కృషి చేశారు.

ఓరుగల్లు కోటలో కీర్తిశేషులు సురవరం ప్రతాపరెడ్డిగారి అధ్యక్షతన 1944లో ఆంధ్రసారస్వత పరిషత్ ప్రథమ వార్షికోత్సవాలు జరిగాయి. ఓరుగల్లు అనగానే ఒడలు పులకరిస్తాయి. కాకతీయుల కాలం కళ్లముందు కన్పిస్తుంది. ఇక్కడ చక్కటి శిల్పాలున్నాయి. వాటిని మతోన్మాదులు వికృతం చేశారు. ముక్కులు చెక్కి, వక్షోజాలను కక్షతో నరికి, వికృతం చేశారు, ప్రాచీన కళా సంపదను పాడు చేశారు.

నిజాం ప్రభుత్వం అలాంటి వాళ్లకు తోడ్పాటు అందించేది. బ్రిటిష్ వారు సాహిత్య సభలకు, మత సంబంధ ఉత్సవాలకు అడ్డు తగిలేవారు కారు. కానీ, నిజాం ప్రభుత్వం ఎలాంటి సభలకైనా... అవి సాహిత్య సభలు కానీ, మత సంబంధ సభలు జరుపుకోవడానికైనా అనుమతి తీసుకోవాలని ఒక కట్టుబాటు చేసింది. అనుమతి పొందినా సంఘ విద్రోహశక్తులు సభల్ని జరగనిచ్చేవి కావు.

కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు

గణేష్ ఉత్సవాలు జరుపుకుంటే రజాకారులు గలాటాలు చేసి, హత్యల దాకా వెళ్లేవారు. రజాకార్ అంటే స్వచ్ఛంద సేవకుడు అని అర్థం. కానీ వారు చేసే సేవ హత్యలు, మానభంగాలు, ప్రాచీన శిల్పాలను వికృతం చేయటం వంటి చర్యలే. ఇవి రెండవ ప్రపంచ యుద్ధంలో నాజీల దురాగతాలను మించిపోయాయి. తెలంగాణలో సాహితీ చైతన్యానికి విశేషమైన కృషిచేసిన వారిలో ప్రథములు ఆంధ్ర సారస్వత పరిషత్‌వారు. దాని ప్రథమ వార్షికోత్సవాలు ఓరుగల్ కోటలో ప్రారంభమయ్యాయి. చక్కటి పందిళ్లు వేశారు. ఎందరెందరో సాహితీవేత్తలు, కవులు సభలకు వచ్చారు. రజాకార్లు ఉక్రోషంతో ఆ పందిళ్లు తగులబెట్టారు. కవుల దగ్గర కలాలున్నాయి, గళాలున్నాయి. కాని కత్తుల్లేవు. కలాలకు, గళాలకు భయపడ్డ ప్రభుత్వం రజాకార్లను ఉసికొల్పింది. తీరా కవి సమ్మేళనం ప్రారంభించే సరికి అగ్నిజ్వాలలు, భస్మరాశులు! ఏమైనా సరే కవి సమ్మేళనం జరిపి తీరవలసిందే అన్నారు సురవరం ప్రతాపరెడ్డి, దేవులపల్లి రామానుజరావు. అటుపిమ్మట దాశరథి కృష్ణమాచారిని సంప్రదించారు. "జ్వాలలో ఆహుతి అయిపోతాం గాని కవి సమ్మేళనం జరిపే తీరుతాం" అన్నారు కృష్ణమాచారి. ఇంక శాంతించేది లేదు.. 'లడేంగే ఔర్ మరేంగే' పోరాడదాం, అవసరమైతే ప్రాణాలైనా వదులుదాం అన్నారు ఇతర కవులు. కాలిపోయిన పందిళ్ల బూడిద వేడిగా అరికాళ్లకు తగులుతున్నది. అయినా కృష్ణమాచారితోనే ప్రారంభించారు సభను. ఆయన తన కవితను చదివారు.

"ఓ పరాధీన మానవా! ఓపరాని
దాస్యము విదల్చలేని శాంతమ్ముమాని
తలుపులను ముష్టి బంధాన కలచివైచి
చొచ్చుకొని పొమ్ము, స్వాతంత్ర్య సురపురమ్ము".

సురవరం అధ్యక్షులు గనుక సురవరం స్ఫురించింది కృష్ణమాచార్యునికి. అలాగే నిర్భయంగా పద్యాలు చదువుతున్నారు కృష్ణమాచారి. "సింహగర్జన చేశావు నాయనా!" అన్నారు ప్రతాపరెడ్డి కౌగిలించుకొని. దేవులపల్లి రామానుజరావు పుష్పహారం వేశారు. దూరం నుంచి ఓ రాయి వచ్చి ప్రతాపరెడ్డి అధ్యక్ష పీఠం మీద పడింది. మరో రాయి విసురుగా వచ్చి పడ్డది. "ఇవి రాళ్లు కావు...పూలు. చదవండి" అన్నారాయన.

ఈలోగా జన సాంద్రత పెరిగింది. తండోప తండాలుగా జనం, ఆ కోలాహలం రజాకార్లకు హాలాహలం. ఇక లాభం లేదని రజాకార గూండాలు తోక ముడిచారు. అర్ధరాత్రి వరకూ కవితాగానం జరుగుతూనే ఉంది. ఆకలి లేదు, నిద్రలేదు, చక్కగా జరిగిపోయింది సభ.

ఆ తరువాత ఆంధ్ర మహాసభ కార్యకర్తలతో కలిసి వరంగల్ జిల్లాలో రోజూ ఊరూరూ తిరిగి సభ పెట్టడం, ప్రజల్ని నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడటానికి సిద్ధం చేయడం ఇదే మా పని అన్నారు కృష్ణమాచారి. ఓ రోజు అదే జిల్లాలోని మానుకోట తాలూకా బయ్యవరం గ్రామానికి వెళ్లి సభ పెట్టగా, "నిజాం ముర్దాబాద్" అనే నినాదంతో ఆ సభ ప్రారంభమైంది. కృష్ణమాచారి అలా కాదు జిందాబాద్‌తో ప్రారంభిద్దామని వెంటనే గాంధీజీ జిందాబాద్, ఆంధ్రమహాసభ జిందాబాద్ అనే నినాదాలతో సభను ప్రారంభించారు.


సురవరం

బూర్గుల

"పల్లెటూరి ప్రజలనంతా, కొల్లగొట్టే నిజామోడా
కింగ్ కోటి మీద రేపే రంగు జండా
యెగురులేరా"

అనే పాటను ఓ బాలిక పాడింది. కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి, "రజాకార్లను గ్రామంలో అడుగుపెట్టనివ్వం" అని జనం శపథం చేశారు, "కలిసి కట్టుగా పని చేస్తామని వాగ్దానం చేశారు, "నిజాం తొత్తులైన జమిందార్లను ఎదిరిస్తాం" అని నినాదం చేశారు. రాత్రి పొద్దు పోయేదాకా పాటలు, పద్యాలు, బుర్రకథలు, ఆటలు, బాగా హుషారుగానే జరిగింది. అక్కడికి కృష్ణమాచారి పుట్టిన గూడూరు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఆ ఊరికి ఓ దొర వారున్నారు (జమీందారు). ఈ వార్తలు వేగుల ద్వారా దొరవారికి, రజాకారులకు చేరుతూనే ఉన్నాయి. కృష్ణమాచారి తప్పక గూడూరు వస్తాడు. అక్కడే కడ తేర్చాలని పథకం వేశారు. ఈ రహస్యం ఎవరికీ తెలియదు.

గూడూరు రెండు మైళ్లే కదా! అక్కడ కృష్ణమాచారి తాతయ్య, అమ్మమ్మ ఉన్నారు. చూసి రావచ్చునని బయలుదేరి వెళ్లాడు. భోజనం చేస్తుండగా పోలీసులు

మరేంగే

స్థానిక దొరవారు కృష్ణమాచారిని తీసుకురమ్మని పోలీసులను కోరాడు. ఆ గడీలో చడీచప్పుడు లేకుండా ఖతం చేయాలని వారి కుట్ర. పోలీసులు అందుకు అంగీకరించలేదు. తెల్లవారి అక్కడికి పదిమైళ్ల దూరంలో వున్న నెల్లికుదురు హెడ్ పోలీసుస్టేషన్‌కు నడిపించి తీసుకువెళ్లారు. అప్పట్లో యోధులకు చేతులకు బేడీలు, నడుముకు తాడు, తుపాకులతో ఇద్దరు పోలీసులు వెంట నడిచేవారు. నెల్లికుదురు పోలీసు అమీన్ (ఇనస్పెక్టర్) చాలా క్రూరుడు. కృష్ణమాచారి జేబులు తనిఖీ చేయగా ఎర్ర సిరాతో రాసిన పద్యం దొరికింది, లాక్కున్నాడు. "విప్లవగీతం రాస్తున్నావా?" అన్నాడు. అది విప్లవ గీతమే కాని నాది కాదు సర్! మహమ్మద్ ఇక్బాల్ గీతానికి అనువాదం, నా స్వంత రచనకాదు" అన్నాడు.

వచ్చి తలుపు తట్టారు "గిరఫ్తార్" (అరెస్టు) అన్నారు. వాళ్ల అమ్మమ్మ, తాతయ్య నిర్ఘాంతపోయి, ఘొల్లున ఏడ్చారు. ఆ రాత్రి స్థానిక పోలీసు స్టేషన్‌లో కటకటాల వెనుక గడిపారు కృష్ణమాచారి.

స్థానిక దొరవారు కృష్ణమాచారిని తీసుకురమ్మని పోలీసులను కోరాడు. ఆ గడీలో చడీచప్పుడు లేకుండా ఖతం చేయాలని వారి కుట్ర. పోలీసులు అందుకు అంగీకరించలేదు. తెల్లవారి అక్కడికి పదిమైళ్ల దూరంలో వున్న నెల్లికుదురు హెడ్ పోలీసుస్టేషన్‌కు నడిపించి తీసుకువెళ్లారు. అప్పట్లో యోధులకు చేతులకు బేడీలు, నడుముకు తాడు, తుపాకులతో ఇద్దరు పోలీసులు వెంట నడిచేవారు. నెల్లికుదురు పోలీసు అమీన్ (ఇనస్పెక్టర్) చాలా క్రూరుడు. కృష్ణమాచారి జేబులు తనిఖీ చేయగా ఎర్ర సిరాతో రాసిన పద్యం దొరికింది, లాక్కున్నాడు. "విప్లవగీతం రాస్తున్నావా?" అన్నాడు. అది విప్లవ గీతమే కాని నాది కాదు సర్! మహమ్మద్ ఇక్బాల్ గీతానికి అనువాదం, నా స్వంత రచనకాదు" అన్నాడు. ఒరిజనల్ చదవమంటే చదవగా "ఇంత విప్లవం ఇక్బాల్‌లో ఉందా?" అని ఆశ్చర్య పోయాడు. "ఉంది, 'ఇది బార్-ఎ-జిబ్రాయేల్' అనే ఇక్బాల్ కావ్యం లోనిది" అన్నారు కృష్ణమాచారి. దానితో చేతులకు బేడీలు తీయించాడు, నడుం తాడు విప్పమన్నాడు. అంతవరకు బాగానే ఉంది... కృష్ణమాచారి "నన్ను త్వరగా జైలుకు పంపండి" అన్నాడు. "జైలుకు నీ శవం వెడుతుంది, మొదటి దేహశుద్ధి" అన్నాడు అమీన్. చిత్రహింసలకు అతడు ప్రసిద్ధి. దైవికంగా అతని కూతురు, అల్లుడు వచ్చారు. ఆ గొడవలో పడి కృష్ణమాచారిని మరిచిపోయాడు. కాపలా కాస్తున్న పోలీసులు అలిసిపోయి ఉన్నారు, బావర్చీని (వంటవాడు) మచ్చిక చేసుకుని కబుర్లు చెప్తుంటూ, ఎవరో పిలవడంతో అతడు వెళ్లాడు. ఇదే సరైన సమయం అని కృష్ణమాచారి కన్నడీ నుండి తప్పించుకున్నాడు. పొలాల్లో, నదుల్లో, అడవిలో అలా పరిగెడుతూనే ఉన్నాడు. కొంత తెలిసిన ప్రాంతం గనుక సులువుగా తప్పించుకోగలిగాడు.

ఇంతకీ ఇక్బాల్ కవిత ఏమంటే, "యే పొలమున నిరుపేదకు దొరకదో తిండి... ఆ పొలమున గల పంటను కాల్చేయండి" ఈ కవిత అసంకల్పితంగా పెదవుల మీద పలుకుతూనే ఆ పంటపొలాల్లో నుంచి పరుగెత్తి, పరుగెత్తి తప్పించుకోగలిగాడు. తనను ఖతం చేయాలనుకున్న గూడూరు దొరవారిని తీవ్రవాదులు హతమార్చారు. ఇది దైవిక న్యాయం గాక మరేమిటి?



10 సం॥ల తరువాత సారస్వత పరిషత్తు సభలను గురించి ఆంధ్రేతరులు ఏమనుకున్నారో తెలుసుకోవాలంటే "మరాఠ్వాడా" అనే మరాఠీ ద్వైవారపత్రిక సంపాదకీయంలోని కొన్ని పంక్తులను పరిశీలించవచ్చు...

"ఇటీవల జరిగిన ఆంధ్రసారస్వత పరిషత్తు సభలను గురించిన రిపోర్టు ఈ పత్రికలో ప్రచురించ బడింది. మరాఠీ విద్వాంసులు, మరాఠీ సాహిత్య సంస్థలు మరోసారి ఆంధ్రసభల రిపోర్టును చిత్తగించాలి. ఆంధ్ర సారస్వత పరిషత్తువారి నుంచి మనం నేర్చుకోవలసింది చాలా ఉంది. తమ సాహిత్యాన్నీ, సంస్కృతినీ లోకానికి తెలియపరచే పనిలో ఆంధ్రులు నునంఘటితులుగా వని చేస్తున్నారు. త్వరలో మరాఠీ సాహిత్య పరిషత్తు సభలు జరుగనున్న దృష్ట్యా, వివిధ సంస్థలవారు తమ తమ కార్యకలాపాలను గురించి సింహావలోకనం చేసుకోవాలి. ఆత్మ పరిశోధన చేసుకోవాలి. " (జనవరి, 15, 1953) ''మరాఠ్వాడా'' ద్వైవారపత్రిక, హైదరాబాదు.

"లోక్ విజయ్" అనే మరాఠీ వారపత్రిక ఏమి రాసిందో కూడా చిత్తగించండి.

"పట్టుమని పదేళ్లుకాలేదు, ఆంధ్రసారస్వత పరిషత్తు స్థాపించబడి, ఇంత కొద్ది వ్యవధిలో తెలంగాణాలో ఈ సంస్థ శ్లాఘనీయమైన కృషిచేసింది. రెండువందల ముప్పై రెండు శాఖలున్న ఈ పరిషత్తువారు 'నిర్వహించే పరీక్షలను' రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ప్రాథమిక స్థాయి నుంచి పట్టభద్ర స్థాయి వరకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. మరే సోదర భాషల పరీక్షలకు ఇంతమంది అభ్యర్థులు వెళ్లడంలేదు. రమారమి పాతిక వేలమంది తెలుగు విద్యార్థులకు డిప్లొమాలు లభించాయి."

"తెలుగు కథానికకు అంతర్జాతీయ స్థాయిలో బహుమతి లభించింది. ('గాలివాన'- శ్రీపాలగుమ్మి పద్మరాజు) దీన్నిబట్టి తెలుగు సాహిత్యం ఎంత అభివృద్ధి చెందిందో అంచనా కట్టవచ్చు."

"పోలీసు చర్య తర్వాత హైదరాబాదు రాష్ట్రంలో ఆంధ్ర సారస్వత పరిషత్తు అన్ని అన్యభాషల సంస్థలకంటే ముందు నడుస్తున్నది"

"దేశంలో దారిద్ర్యం, ఆకలి ఉన్నంత కాలం ఉత్తమ సాహిత్యం సృష్టించ బడజాలదు" అని రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు అన్నారు. (ఢిల్లీ ఎక్స్‌ప్రెస్ పత్రిక (జనవరి,13, 1953)

"శ్రీ రాధాకృష్ణన్‌గారి దర్శనం కోసం నిరీక్షిస్తున్న సభాసదుల సందడి చెప్పనలవిగాకుండెను. వారు వచ్చిన తరువాత సభ ప్రారంభించగానే, ఇరవై అయిదు వేల జనమున్నూ గొప్ప శిక్షణకు లోబడినట్లుగా నిశ్శబ్దంగా నుండిరి. శ్రీ రాధాకృష్ణన్ గారు తెలుగులో రచితమైన తమ ప్రారంభోపన్యాసం చదువుతూ ఉన్నప్పుడు సభాస్థలమంతా ఆనంద ముతో నిండియుండెను. అందులో - వారు, మాతృ భాషయెడ గౌరవం, తెలుగుభాష యెడ ఆదరం, సంస్కృతి వికాసమునకు గల ప్రాధాన్యం, సాహిత్యాభి వృద్ధికి కడుపునిండా తిండి యుండవలసిన అవశ్యకత నొక్కి చెప్పినప్పుడు వారి మాటలు శ్రోతలకు కర్ణరసాయనముగా వినబడినవి". డాక్టర్ గిడుగు సీతాపతిగారి అభిప్రాయం : (ఆంధ్రప్రభ 1953 జనవరి 25). ★

పాటల నిండా వెన్నెల మాటలు మోసే ఊయల

ఆధునికాంధ్ర కవుల్లో నిత్యనూతన కవి, నిరంతర కవి డా॥ సి.నారాయణరెడ్డి. సంప్రదాయాన్ని జీర్ణించుకున్న అభ్యుదయ కవి, సినీ ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న 'తెరకవి'. పద్యాన్ని హృద్యంగా, గేయాన్ని శ్రవణపేయంగా, వచన కవిత్వంలో కూడా అంత్యప్రాసలు అలవోకగా ప్రయోగించి కవితా ప్రియుల మన్ననలందుకున్న మహాకవి. సి.నా.రె.దాదాపు 70 కావ్యాలూ, వేలాది సినీ గీతాలు రాశారు.ఆధునిక విమర్శలో ప్రామాణికమైన "ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయము– ప్రయోగములు" అనే సిద్ధాంత గ్రంథాన్ని రచించారు.

ఆయనకు జీవితాంతం కవిత్వం నిత్య వ్యాపకం. 'కవిత్వం రాయకుంటే ఏ.సి.గదిలో ఉన్నా ఉక్కపోస్తుంది' అనేవారు. వేలాది సాహితీ ప్రసంగాలతో శ్రోతలను అలరించిన ఆయన ప్రజ్ఞ అనితర సాధ్యం.



సి.నా.రె. పూర్తి పేరు సింగిరెడ్డి నారాయణ రెడ్డి. ఆయన 1931వ సంవత్సరం జూలై 29వ తేదీన కరీంనగర్ జిల్లా సిరిసిల్ల తాలూకా హనుమాజీ పేటలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు బుచ్చమ్మ, మల్లారెడ్డి. ఆయన పాఠశాల విద్యాభ్యాసం సిరిసిల్ల, కరీంనగర్, హనుమాజీ పేటలో సాగింది. హైదరాబాద్ చాదర్‌ఘాట్ కళాశాలలో 1949లో ఇంటర్మీడియట్ చదివారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి 1954నాటికి ఎం.ఏ. పట్టా పొందారు. కొన్నాళ్లు నిజాం కళాశాలలో లెక్చరరుగా పనిచేశారు. ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం పర్య వేక్షణలో "ఆధునికాంధ్ర కవిత్వము – సంప్రదాయ ములు – ప్రయోగ ములు" అనే సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించి, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి 'పిహెచ్.డి' డిగ్రీ పొందారు. ఇది ఎందరో ఆధునిక పరిశోధకులకు ప్రామాణిక గ్రంథం.

1963 నుండి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో రీడర్‌గా, ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆయన ప్రతిభకు నిదర్శనాలుగా ప్రతిష్ఠాత్మకమైన పదవులెన్నో వరించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా, అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయాల ఉపాధ్యక్షులుగా పనిచేశారు. రాజ్యసభ సభ్యులుగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక మండలి అధ్యక్షులుగా గణనీయమైన సేవలందించారు.

మహాకవిగా, సినీ గేయకవిగా, వక్తగా, గొప్ప సాహితీవేత్తగా, ప్రతిభా వంతుడైన ఆచార్యుడిగా, పరిశోధనా పర్యవేక్షకుడిగా, పరిపాలనా దక్షుడిగా ప్రతి రంగంలో తనదైన ముద్రను వేసుకున్నారు.

"సాహిత్యం ద్వారా గ్లామర్ గడించిన అపురూపమైన

ఏకైక వ్యక్తి సి.నా.రె" అని చెప్పిన ఆచార్య ఎన్.గోపి మాటలు స్తవాలు కాదు, వాస్తవాలు. సి.నా.రె. 1952 నుండి 2017 దాకా నిరంతరం రచనలు చేశారు. పద్య కవిగా కలం పట్టి హృద్యమైన కవితా ఖండికలు రాశారు. అద్భుతమైన చారిత్రక గేయ కావ్యాలు రాశారు. వచన కావ్యాలు తనదైన శైలిలో అప్రయత్న ప్రాస విన్యాసాలతో రూపొందించి సాహితీ ప్రియులను అలరించారు.

సి.నా.రె రచనలు

నవ్వని పువ్వు, అజంతా సుందరి (గేయ నాటికలు). జాతిరత్నం, నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు (చారిత్రక కావ్యాలు) అక్షర గవాక్షాలు, మధ్య తరగతి మందహాసం, మంటలూ– మానవుడూ, ఉదయం నా 'హృదయం', మార్పు నా తీర్పు, ఇంటిపేరు చైతన్యం, రెక్కలు, నడక నాతల్లి, 'కాలం అంచుమీద', కవిత నా చిరునామా, నిరంతరం ఆరోహణ, దృక్పథం, కలసాక్షిగా (వచన కవితా సంపుటాలు), విశ్వంభర (సమగ్ర వచన కావ్యం) భూమిక, మట్టి మనిషి, ఆకాశం (దీర్ఘ వచన కావ్యాలు) సమదర్శనం (ముక్తక కావ్యం), ప్రపంచపదులు (విశిష్ట కావ్యం), తెలుగు గజళ్లు, సమీక్షణం, మావూరు మాట్లాడింది (వ్యాస సంపుటాలు), మీరాబాయి, శిఖరాలు – లోయలు (అనుసృజనలు), ముచ్చటగా మూడు వారాలు – "మలేసియా తెలుగువాణి", సోవియట్ రష్యాలో పదిరోజులు, పాశ్చాత్య దేశాల్లో 50 రోజులు (యాత్రా సాహిత్య గ్రంథాలు),

పగలే వెన్నెల (చలనచిత్ర గీతాల సంకలనం), "పాటలో ఏముంది – నా మాటలో ఏముంది?" (సినిమా పాటల విశ్లేషణ), "సి.నా.రె. శ్లోక్తులు' వంటి గ్రంథాలన్నీ ప్రసిద్ధాలు.

అవార్డులు - బిరుదులు

ఆయన రచనలకెన్నో అవార్డులు లభించాయి. ఆయన అందుకోని జాతీయస్థాయి అవార్డులు లేవు. 'మాటలూ – మానవుడూ' కావ్యానికి రాజా లక్ష్మీఫౌండేషన్ అవార్డు లభించింది. ఆయన కావ్యాలకు సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు, కుమారన్ ఆశాన్ అవార్డు, భారతీయ భాషా పరిషత్తు కలకత్తా వారి 'భిల్వార్' అవార్డు లభించాయి.

'విశ్వంభర' కావ్యానికి పతిష్ఠాత్మక మైన జ్ఞానపీఠ అవార్డు (1988) లభించింది. తెలుగు సాహిత్యంలో విశ్వనాథ సత్యనారాయణ తరువాత జ్ఞానపీఠ అవార్డు అందుకున్న కవి సి.నా.రె. భారత ప్రభుత్వం 1992లో ఆయనను 'పద్మభూషణ్'తో సత్కరించింది.

సి.నా.రె. కవితా విశేషాలు

ఆయన చెప్పినట్లు "నా పేరు కవి / ఇంటిపేరు చైతన్యం / ఊరు సహజీవనం / తీరు సమభావనం / నా వచనం బహువచనం / సామ్యవాదం / కవిత్వం నా మాతృభాష / ఇతివృత్తం మానవత్వం"– సహజీవనం, సమభావం – సామ్యవాదం – మానవతా దృక్పథం. సి.నా.రె. కవిత్వంలో ప్రధానాంశాలు. ఆయన కవిత్వం పాత కొత్తల మేలుకలయిక. కవిత్వానికి అవసరమైన గురజాడ తత్త్వాన్ని, శ్రీశ్రీ అభ్యుదయ వారసత్వాన్ని జీర్ణించుకున్న మహాకవి. అభ్యుదయం – శాంతి – విప్లవం – మానవత – సమతలు ఆయనకు పంచప్రాణాలు. అన్నింటిలో ప్రధానంగా మానవతావాదం గుబాళిస్తుంది. ఆయన కవితకు మానవత జయ పతాక.

నూతన ధోరణులన్నింటినీ ఆహ్వానించే సమన్వయ ధోరణికి ఆయన నిలువుటద్దం. ఆయన కవితా ఉద్యమాలన్నింటినీ సమర్థించారు. వివాదం లేని కవితా బంధువుగా వ్యవహరించారు.

తెలంగాణా సాహిత్యోద్యమంలో క్రమశిక్షణ గల సైనికునిలా పనిచేసినపుడు పృథక్తివాదాన్ని (విభజనవాదం) నిర్భయంగా ఖండించి తన కలాన్ని, గళాన్ని మేళవించి జనాన్ని ప్రబోధించినపుడు... దానవతా విలయతాండ వాన్ని తిరస్కరించి, మానవతా మహనీయ రూపానికి హారతులెత్తినప్పుడూ నారాయణ రెడ్డిలో అనంత చైతన్యాన్ని నేను కళ్లారా చూశాను"– అన్న దాశరథి మాటల్లో సి.నా.రె.లోని దీక్షాదక్షత, సమైక్యతా ప్రబోధం, మానవతావాదం స్పష్టమవుతున్నాయి.

"నారాయణరెడ్డి తిలక్‌లాగా రెండంచుల

డా॥పి.వి.సుబ్బారావు

రిటైర్డ్ ప్రొఫెసర్, 9849177594

పదనుగల కత్తి. కవిత్వంలో అగ్ని చల్లగలడూ, అమృతం కురిపించగలడూ" అన్న కుందుర్తి మాటల్లో సి.నా.రె కవితా ప్రతిభద్యోతకమవు తుంది. ఆచార్య జి.వి.సుబ్రహ్మణ్యం సి.నా.రె. కవితా తత్త్వాన్ని వివరిస్తూ "విశ్వమానవ హృదంతరాళాల్లోని జలపాతాల సవ్వడినీ, విప్లవ వేడినీ రంగరించి తన కవితా జగత్తులో మానవతా దృక్పథానికి మనోజ్ఞ రూపాన్ని దిద్దుతున్న మహాశిల్పి. పద్యం నుండి గేయానికీ, గేయం నుండి వచనానికీ అభ్యుదయాన్ని సాధిస్తూ 'పట్టింది బంగారంగా, పలికింది కవిత్వంగా ప్రగతి సాధిస్తున్న కవీంద్రులు రెడ్డిగారు. మనిషి లోని మమతను, బాధను, కన్నీటినీ, మున్నీటినీ, అంగారాన్నీ, శృంగారాన్నీ, వియోగాన్నీ, విప్లవాన్నీ కవితలో కీర్తించడం రెడ్డిగారి మతం' – అన్న మాటలు అక్షర సత్యాలు.

ఆధునికాంధ్ర కవితారంగంలో సాటిలేని మేటి కవి. నిరంతరం ప్రతిభ గుబాళించిన నిత్య నూతన నవయువకవి సినారె. ఆయన భౌతికంగా దూరమైనా సాహితీ ప్రియుల గుండెల్లో చిరస్మరణీయులు. తెలుగు సినీ ప్రేక్షకుల హృదయాల్లో చిరంజీవి. ఆ మహనీయునికిదే నివాళి. ★



కథ

అనంతవిశ్వాలు

కర్ణ

ఈ ప్రపంచంలో అనేకచోట్ల నిధులు దాచి పెట్టారు. కొండల్లో, నీటిలో, భూమిలో భద్రంగా ఉన్నాయి. వాటిని పొందడం అందరి తరం కాదు. నీకు రాసి పెట్టుంటే ఆ సంపద సమాచారం వెతుక్కుంటూ వస్తుంది. అప్పుడు అవకాశాన్ని చేజార్చుకోకుండా ఒడిసి పట్టుకోవాలి. అయితే, అందుకోసం నువ్వు ఎన్నో సాహసాలు చేయాలి. ఒక్కోసారి ప్రాణంపోయే పరిస్థితి రావొచ్చు. భయపడకూడదు. సంపద నీకు దక్కే సమయంలో వాతావరణం కూడా నీకు సహకరించదు. అన్నింటినీ భరించాలి. అప్పుడే విజయం నీ సొంతమవుతుంది' ఒకతను మరో వ్యక్తికి చెప్తున్నాడు.

వెంకా ఈ మాటలు విని 'వీళ్లెవరో పిచ్చోళ్లలా ఉండారు బా.. అయినా మనకెందుకులే.. అసలు లైఫ్ ఎటు పోతాందో అర్థం కాదులేదు బా.. తిన్డం, తిరగడం, వెబ్ సిరీస్‌లు, సినిమాలు డౌన్లోడ్ చేస్కొని చూడ్డం, లేటుగా పడుకోవడం తప్ప కొత్తగా ఏమీలేదు. ఎంతకాలం ఇట్లా..' నెల్లూరులోని ఓ వీధిలో కేఫ్ బయట టీ తాగుతూ... సిగరెట్, కాలుస్తూ స్నేహితుల వైపు చూసి అన్నాడు.

'నిధి నాకు దొరకాలని కోరుకుంటున్నా బా.. జీవితంలో ఇక ఏ దిగులూ ఉండదు. ఇలాంటివి నీకు నచ్చవులే. అయినా మాకేమన్నా నెలకి 50వేల జీతమొచ్చే ఉద్యోగాలుండాయా? పిచ్చిలేస్తాంది. డబ్బడిగితే మా అయ్య పళ్లు కొరకతాన్నాడు' అనిల్ ఫోన్ చూస్తూ అన్నాడు.

'ఇక్కడ నేనుండలేను బా.. ఎలాన్ మస్క్ తొందర్లో జనాన్ని మార్స్ మీదకి తీస్కాపోతాడంట. నేను ఆడికెళ్లిపోయి కొత్త లైఫ్ స్టార్ట్ చేస్తా.' వెంకా చెప్పిన మాటలిన్న అనిల్, కృష్ణ, మోహన్ ఉలిక్కిపడ్డారు. 'ఫేసు ఇట్టా తిప్పు బా.. నువ్వు మార్స్ మీదకి పోతావా?.. జరిగే పనేదైనా ఉంటే చెప్పు..' అనిల్ నవ్వుతూ అన్నాడు.

'సర్లే.. నాకు స్పేస్ అంటే పిచ్చి. యూట్యూబ్‌లో ఆ వీడియోలు చూస్తంటా కదా.. అలా ఆ ఆశ పుట్టింది. మీరు అంతలా వెక్కిరించబళ్లేదు. రేయ్ అనిలా.. నీకూ ఏదో ఒకటి ఉండే ఉంటాది కదా.. అదేంటో చెప్పు..'

'ఉందన్కో.. కాకపోతే నీలాంటిది కాదురా వెంకా .. మా ముత్తాత అప్పట్లో బ్రిటిష్ అమ్మాయిని చేస్కొని, కొన్నేళ్లకి అంతులేని సంపదతో ఇంగ్లండు కెళ్లి సెటిలై పోయుండాల్సింది. అదే జరుగుంటే ఈపాటికి నేను లండన్లో రాయల్ లైఫ్ అనుభవిస్తూ ఉండేవాడిని.'

'వామ్మో.. వాయ్యో.. ను మామూలోడివి కాదు బా.. సరే గానీ నీ సంగతి చెప్పరా కృష్ణా..' వెంకా నవ్వాపుకోని అడిగాడు.

'అది బా.. అది.. నేను తీసే నేచర్ వీడియోలకి యూ ట్యూబ్లో మిలియన్స్‌లో వ్యూస్ రావాలి. బాగా డబ్బొస్తాది. అప్పుడు వేరే పని చేయబళ్లేదు.. ఆ ప్లానింగ్లో ఉండా..

'ఇది కొద్దిగా బెటర్రా కృష్ణా.. నీ సంగతి చెప్రా మోహన్..'

'నాది కొంచెం ఇలాగే ఉంటాది బా.. ఇండియా మొత్తం బైక్లో తిరగాలి. రోజూ కొత్త ప్లేసుల్ని వీడియోస్ తీసి యూ ట్యూబ్లో పెట్టాలి. దేశాన్ని చూసినట్టూ ఉంటాది. డబ్బుకి డబ్బొస్తాది.'

'మీరిద్దరూ గట్టిగానే ప్లాన్ చేస్తాండారు బా..' వెంకా మాట్లాడుతుండగా సుమన్ వచ్చాడు.

'రారా బా.. ఏంది ఫుల్ జోషులో ఉండావు.'

'మన జీవితాలు మారిపోయే విషయంతో ఒచ్చినా..' అని సుమన్ చెప్పడంతో అందరూ 'ఏంట్రా అది. ఏంట్రా అది. తొందర్గాచెప్పు' అన్నారు.

'నిన్న మా నాయనకి భోజనం ఇచ్చొద్దామని పనికాడికి పోయినా. అక్కడిద్దరు మాట్లాడుకుంటంటే ఇన్నా.. ఉదయగిరి కొండ మీద చిన్నచిన్న కోటలు ఏడెనిమిది ఉండాయంట. ఒకదాంట్లో నిధి ఉందని చుట్టుపక్కల ఊళ్లలో ప్రచారం ఉందంట. ఆ నిధి సంపాయిస్తే జీవితంలో స్థిరపడిపోయినట్టేనని చెప్పుకుంటుండారు. మనమెళ్లి నిధి సంపాయిద్దాం బా.. ఏమంటారు?'

'కొంపదీసి సమాచారం వెతుక్కుంటావచ్చిందా?' అనుకుని వెంకా ఆశ్చర్య పోయాడు. ఇందాక నిధి గురించి మాట్లాడుకున్నోళ్లు ఉన్నారేమోనని చూశాడు. అయితే అక్కడెవరూ లేరు.

నలుగురూ కాసేపు ఏం మాట్లాడలేదు. ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు.

'రేయ్ వెంకా.. వాళ్లని పిచ్చోళ్లన్నావు. చూశావా మన్కి రాసుండాది కాబట్టే సమాచారం ఒచ్చి పడింది,' అనిల్ వెలిగిపోతున్న ముఖంతో చెప్పాడు.

'ఉఫ్.. అనిలా.. కాసేపు ఆగురా సామీ.. సుమన్ బా.. సినిమాల్లో చూపిస్తంటారు కదా.. ఫస్ట్ మ్యాప్ కోసం ఫైట్లు, చేజ్లు చేస్తారు. తర్వాత అపాయాల్ని తప్పించుకోని ఆఖర్లో నిధిని సొంతం చేస్కుంటారు. ఇప్పుడు మనం అలా చేయాలా..' వెంకా వెటకారంగా అడిగాడు.

'మాస్తావా.. పద్మనాభస్వామి, పూరీ జగన్నాథ స్వామి టెంపుల్స్‌లో అంతులేని నిధి ఉందని విన్నాం కదా.. చాలాచోట్ల ఇదే పరిస్థితి ఉంటుందంట. ఉదయగిరికి చాలా చరిత్ర ఉండాది రా.. అక్కడ పురాతన కోటలు, ఆలయాలుండాయి. యుద్ధాలప్పుడు రాజులు వాళ్ల సంపదని దాచేసేవారు. కొన్ని ఈ కాలంలో బయటడుతుండాయ్.'

'ఆపురా.. పనికొచ్చినోళ్లు మాట్లాడుకున్న పనికిరాని మాటలిని నువ్ మాకు చెప్తాండావ్.'

'అలా తీసిపారేయకు బా.. మనం పట్టించుకోని విషయాల్లో ఒక్కోసారి లోతెక్కువ ఉంటాది. మన జీవితాలు మారిపోయే పాయింట్ ఇదేనేమో.. ఆలోచించు.' సుమన్ చెప్పగా అనిల్, కృష్ణ, మోహన్ వెళ్దామని వెంకాని బతిమిలాడారు.

'రేయ్ ఏం మాట్లాడతన్నార్రా మీరు.. ఈ విషయం పోలీసోళ్లకి తెలిస్తే బాగా కుమ్మి లోపలేస్తారు. నేనొప్పుకోను..'

'అంత తెలివి తక్కువగా ఏం చేయంలే బా.. మనం చిక్కకుండా ప్లాన్ వేద్దాం..' అనిల్ అన్నాడు.

మోహన్ వెంటనే 'నాకో ఐడియా ఒచ్చింది బా.. ఉదయగిరిలో పురాతన కోటలు, ఆలయాల మీద డాక్యుమెంట్రీ తీస్తున్నామని చెప్దాం. కెమెరాతో అన్నీ షూట్ చేద్దాం. కోట దగ్గర క్యాంప్ఫైర్ వేసుకొని ఉంటామని అక్కడికెళ్దాం. ఎవరికీ అనుమానం రాదు. సైలెంటుగా నిధి కోసం వెతుకుదాం.. దొరికితే మన అదృష్టం. లేకపోతే డాక్యుమెంట్రీని యూట్యూబ్లో పెడితే డబ్బులొస్తాయ్.' అని చెప్పాడు.

'సూపర్ బా.. ఈ ప్లాన్ బాగుండాది. మనం వెళ్తున్నాం.' వెంకా అందరి వైపు చూస్తూ చెప్పాడు.

రెండు రోజులయ్యాక సరంజామాతో అందరూ మారుతీ ఆమ్నీ వ్యాన్లో బయలుదేరి ఉదయగిరికి చేరుకున్నారు. ప్రజల్ని నమ్మించేందుకు ఉదయం కొన్ని చారిత్రక కట్టడాలను వీడియో తీశారు. సాయంత్రం కొండ కిందకు చేరుకున్నారు. పైకి వెళ్లే దారి దారుణంగా ఉంది. అయినా కష్టపడి చీకటి పడేలోగా మొదటి కోట సమీపానికి చేరారు. అక్కడి పరిస్థితులు ఏ మాత్రం వారికి అనుకూలంగా లేవు. వాతావరణం పగ పట్టింది. గాలి భయపెట్టేలా వీస్తోంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం మొదలైంది. ఒకరి చేతులు ఒకరు పట్టుకుని సామాన్లు మోసుకుంటూ కోట లోపలికి వెళ్లారు. శిథిలావస్థకు చేరుకున్న ఆ కట్టడాన్ని మెరుపుల వెలుగులో చూసి మరింత ఆందోళనకు గురయ్యారు.

'సంపద నీకు దక్కే సమయంలో వాతావరణం కూడా నీకు సహకరించదు.' ఈ మాటలు వెంకాకి గుర్తొచ్చాయి. 'మనకు నిధి దక్కుతుంది బా..' అన్నాడు స్నేహితులతో..

బయట వాతావరణంలో ఎలాంటి మార్పూ లేదు. కోట లోపలే టెంట్లు వేశారు. తర్వాత ఏం చేద్దామని స్నేహితులు మాట్లాడుకుంటున్నారు. కాసేపటికి ఓ మూలన ఆకాశానికి గురిచేసినట్లుగా వెలుగు ప్రసరించింది. దీనిని చూసి కృష్ణ, సుమన్, మోహన్ భయపడ్డారు.

'ఏం కాదుబా.. అందరం వెళ్లి చూద్దాం. ఒకవేళ అక్కడే నిధి ఉంటే మిగతా కోటలకు పోవాల్సిన పనుండదు.' అన్నాడు వెంకా..

ఆ మాటలకు అందరికీ ఆశ పుట్టింది. దేవుడా కాపాడని జపిస్తూ ఐదుగురు వెలుగు సమీపానికి వెళ్లారు. ఒక్కసారిగా వెనుక నుంచి ఎవరో తోసినట్లుగా, ముందు నుంచి ఇంకెవరో పట్టుకుని లాగినట్టు అనిపించింది. అందరూ కిందకు జారి పోతుండగా భయపడిపోయి కేకలు వేశారు. కాసేపటికి వెలుగు ఆగిపోయింది.

ఐదుగురూ మట్టి మీద పడ్డారు.

'రేయ్ వెంకా.. మనమెక్కడున్నాం?' అనిల్ అడిగాడు.

వెంకా టార్చ్‌లైట్ వేసి చుట్టూ చూసి 'రేయ్ మనం కోట బయటే ఉన్నాం.' అన్నాడు.

రోబో కిందకి చూడగానే వెలుగు భూమిలోకి ప్రసరించింది. కాసేపటికి ఐదుగురూ భూగ్రహంలోని కోటలో తేలారు. 'సంతోషంగా ఉండండి. ఇక సెలవు.' ధృవ్ చెప్పగా.. స్నేహితులంతా ఒకేసారి' మరి మా నిధి సంగతేంది?, మీ లీడర్ విశ్వాలనే తయారు చేస్తున్నాడు కదా... మాకు కొంచెం సంపద ఇవ్వలేదా' అనడిగారు.

'కింద పడితే కోట బయటికి ఎట్టా ఒచ్చినాం బా.. నాకేం అర్థం కాదంలేదు. ఏదో జరిగింది. సరే లోపలికి పోదాం పదండి' అని అనిల్ అనడంతో స్నేహితులంతా వెళ్లారు.

ఇంతలో ఎవరివో మాటలు వినిపించాయి. వెంకా అందర్నీ ఆపి 'రేయ్ అక్కడెవరో ఉన్నారు. గోడ చాటుకు రండి.' అన్నాడు.

'ఇందాక ఎవరూ లేరు కదా. ఇప్పుడెక్కడ్నుంచి ఒచ్చారు?' కృష్ణ ప్రశ్నించాడు.

అందరూ గోడ చాటుగా ఉండి అక్కడెవరున్నారో చూశారు.

ఆ ఐదుగుర్ని చూసి వీళ్ల ఐదుగురికి మాటలు రాలేదు. కళ్లు పెద్దవి చేసి చూస్తూ ఉండిపోయారు. కాసేపటికి తేరుకున్నారు.

'రేయ్ వెంకా..వాళ్లేంది అచ్చం మనలాగే ఉండారు. ఇందాక ఆ ప్లేస్లో మనమే కదా ఉంది. అసలేం జరిగింది రా?' మోహన్ తెల్లమొహమేసి అడిగాడు.

'నాకేం తెల్సు రా.. నేను మీతోటే ఉన్నా కదా.. అంతా నాకేదో తెల్సినట్లు అడుగుతున్నారు.' వెంకా పెద్దగా అరిచాడు.

లోపలునోళ్లు ఒక్కసారిగా గోడ వైపు చూశారు.

'రేయ్ మనం ఉన్నట్లు వాల్లకి తెల్సిపోయినాది. ఏదైతే అది అవుద్ది. పోయి అడగదాం పదండి.' అనిల్ ముందుకెళ్లబోయాడు.

కొద్దిక్షణాల్లోనే ఆ ఐదుగురు, ఈ ఐదుగురికి ఎదురుపడ్డారు. ఎవరూ మాట్లాడలేదు. నిశ్శబ్దం అలుముకుంది.

కాసేపటికి అనిల్ 'ఎవర్రా మీరంతా.. మాలాగా ఎందుకున్నారు. అసలేం జరుగుతాందిక్కడ?,' గంభీరంగా ఉన్నట్లు నటిస్తూ వణుకుతున్న గొంతుతో అడిగాడు.

'అది అడగాల్సింది మేము రా.. మీరు మాలాగ ఎందుకున్నారు?, ఈ ప్లేస్కి ఎలా ఒచ్చారు?' అనిల్-2 గదమాయించాడు.

వాళ్ల మధ్య వాదనలు జరుగుతుండగా వెంకా, వెంకా-2 కళ్లు మూసి తల పట్టుకుని ఆలోచిస్తూ కూర్చున్నారు. కొన్ని నిమిషాల తర్వాత 'ఆపండ్రా మీ గోల.. రేయ్ వెంకా-2.. నీకు విషయం అర్థమైందని నాకు అర్థమైంది. సో వీళ్లకు అర్థమయ్యేలా చెప్పేవరకు కాసేపు నువ్వు గమ్మునుండు. బా.. అదేంటంటే.. మీకు మల్టీవర్స్ గురించి తెల్సా?' వెంకా అడిగాడు.

అందరూ తెలీదన్నారు.

'నేను స్పేస్ వీడియోలు చూస్తుంటా కదా. సో కొంచెం తెల్సు. విశ్వాలు లెక్కలేనన్ని ఉంటాయి. ప్రతి దాంట్లో భూమి లాంటి గ్రహం ఉంటుంది. అక్కడ అచ్చం మనలాంటి మనుషులుంటారు. ఇద్దరి జీవితాలు దాదాపుగా ఒకేలా సాగుతుంటాయి. ఇప్పుడు మనం ఓ విశ్వంలో వచ్చి పడ్డాం. అది ఏ మూలనుందో నాకు తెలీదు.' వెంకా చెప్తుండగా అందరూ నోరెళ్లబెట్టి చూశారు.

'ఏంటి ఇదంతా నిజమా? ఇలా కూడా జరుగుతుందా?.. పాపం అనిల్-2 గాడు వాళ్లయ్యతో ఎలా వేగుతుండాడో ఏందో..?' అనిల్ అన్నాడు.

'రేయ్.. నువ్వు కాసేపు గమ్మునుంటావా?, ముందు ఇక్కడ్నుంచి ఎలా బయటపడాలో చూడండి మావా?' కృష్ణ ఆందోళన చెందుతూ అడిగాడు.

'అది నాక్కూడా తెలీదు బా.. నిధి దక్కుద్దా లేదా అని నేను ఆలోచిస్తున్నా...' వెంకా అన్నాడు.

'ఈడ నిధి లేదు. మేము వేరే దార్లోంచి కొండెక్కాం. అన్ని కోటలు చూసేశాం. ఇదే ఆఖర్ది,' వెంకా-2 వెటకారంగా నవ్వుతూ చెప్పాడు.

'అయ్యో! నిధిలేదా. ఎన్ని ఆశలు పెట్టుకు న్నానా. అంతా అయిపోయింది బా.. ఏదో అనుకుంటే ఇంకేదో అయినాది. నిధి లేదు. మనం వేరే విశ్వంలో ఇరుక్కుపోయినాం. ఇప్పుడు మన పరిస్థితి ఏంట్రా?' అంటూ అనిల్ ఏడుపందుకున్నాడు.

వెంకా-2 అనిల్-2 వైపు చూసి 'వీళ్లు ఏ విశ్వంలో ఉన్నా ఇంతేనంట్రా..' అన్నాడు.

సుమన్ వైపు చూసి వెంకా పళ్లు కొరికాడు.

'ఏరా నాదొక్కడిదేనా తప్పు.. అందరూ ఒప్పుకొనే కదా వచ్చారు. ఇలా జరుగుతాదని నేనేమైనా కలగంటినా?' సుమన్ ప్రశ్నించాడు.

'ఉఫ్.. అయ్యిందేదో అయిపోయినాది. రేయ్ వెంకా-2 మమ్మల్ని మీతోపాటు తీస్కెళ్లండి. కలిసి బతుకుదాం. మనం కష్టపడి పనిచేసి సంపాదించే రకం కాదు. సో.. ఏం జరిగిందో వీడియోలు చేసి యూట్యూబ్లో పెడ్తే బాగా పాపులరైపోతాం. డబ్బులు కూడా వస్తాయి. ఏమంటావ్?' వెంకా అడిగాడు.

'నీతో వేగలేకపోతుండాం రా... అని ఇంట్లో వాళ్లు రోజూ తిడతన్నారు. ఇది మీక్కూడా జరుగుతా ఉంటాది. ఇప్పుడు ఇద్దరంటే వాళ్లు భయపడిపోతారు. ఇది కరెక్ట్ కాదు,' వెంకా-2 చెప్పేశాడు.

వాళ్ల మధ్య మాటలు జరుగుతుండగా.. ఆకాశం నుంచి వెలుగు కోట మధ్యలో ప్రసరించింది.

'రేయ్ బా.. మళ్లీ వెలుగొచ్చింది. ఇది మనల్ని మన విశ్వానికి చేరుస్తాదేమో..' అనిల్ కళ్లు పెద్దవి చేసి అన్నాడు.

ఒక రోబో వాళ్ల ముందు ప్రత్యక్షమైంది. అది అచ్చం మనిషిలాగే ఉంది. 'నమస్తే.. వెంకా, అనిల్, కృష్ణ, మోహన్, సుమన్. మా వాళ్లు చేసిన చిన్న పొరపాటు వల్ల మీరు అనంత విశ్వాల్లో ఒకదాంట్లో పడ్డారు.. కాసేపట్లో మిమ్మల్ని మీ విశ్వానికి పంపేస్తాం.' అని మాటలు వినిపించాయి.

'ఇదేంటి బా.. రోబో ఇంత స్పష్టంగా మాట్లాడుతోంది?' మోహన్ అడిగాడు.

'నా పేరు ధృవ్.. ఆ రోబో నా కాపీ.. మేం చాలా అంటే చాలా అడ్వాన్స్డ్. మా లీడర్ విశ్వాలను తయారు చేస్తుంటారు. టైంలో అప్పుడప్పుడు తేడాలు వస్తుంటాయి. దీంతో ఒక విశ్వం వాళ్లు ఇంకో విశ్వంలో పడిపోతుంటారు. నేను, నా బృందం ఈ తప్పుల్ని సరి చేస్తుంటాం. ఈరోజు పని ఎక్కువుంది. అందుకని నా రోబో కాపీని పంపించా. అది మిమ్మల్ని జాగ్రత్తగా మీ విశ్వంలోని కోట దగ్గరికి చేరుస్తుంది. అందరూ చేతులు పట్టుకుని ఓ మూలన నిలబడండి.'

ఐదుగురు వెంకా-2, అనిల్-2, కృష్ణ-2, మోహన్-2, సుమన్-2తో కాసేపు మాట్లాడి వీడ్కోలు పలికారు.

రోబో కిందకి చూడగానే వెలుగు భూమిలోకి ప్రసరించింది. కాసేపటికి ఐదుగురూ భూగ్రహంలోని కోటలో తేలారు.

'సంతోషంగా ఉండండి. ఇక సెలవు.' ధృవ్ చెప్పగా.. స్నేహితులంతా ఒకేసారి' మరి మా నిధి సంగతేంది?, మీ లీడర్ విశ్వాలనే తయారు చేస్తున్నాడు కదా... మాకు కొంచెం సంపద ఇవ్వలేదా' అనడిగారు.

'నేను చాలా విశ్వాల్లో మనుషుల్ని చూశా. ప్రతిచోటా భూగ్రహ వాసులకు ఆశ ఎక్కువే. వేల ఏళ్ల నుంచి ఇదే సమస్య. మీరు ఎప్పటికి మారుతారో .. రేయ్ బాబూ.. పిచ్చిపిచ్చి ఆలోచనలు మాని బాగా కష్టపడి ఉద్యోగాలు తెచ్చుకుని బాగుపడండి. అంతేగానీ టైం వేస్ట్ చేసుకోకండి.' ధృవ్ అన్నాడు. కొద్దిక్షణాల్లో రోబో మాయమైపోయింది. ఐదుగురూ ఉసూరుమంటూ ఇంటి బాట పట్టారు. ★

భారత క్రికెట్ యువ కెరటం యశస్వి జైశ్వాల్ ఆకాశమే హద్దుగా సాగిపోతున్నాడు. ప్రత్యర్థి బౌలర్లను చీల్చిచెండాడుతూ రానున్న కాలం తనదేనని చెప్పకనే చెబుతున్నాడు. 21 సంవత్సరాల వయసులోనే ఐపీఎల్, టెస్టు మ్యాచ్‌ల్లో శతకాలు బాది అదరహో అనిపిస్తున్నాడు.

భారత క్రికెట్ నయా సంచలనం యశస్వి

ఉత్తరప్రదేశ్‌లోని బదోహీ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం నుంచి క్రికెట్ పిచ్చితో ముంబై మహానగరానికి తరలివచ్చిన యశస్వి జైశ్వాల్ 12 ఏళ్ల ప్రాయం నుంచే బ్యాటు, బంతి చేతపట్టాడు. తలదాచుకోడానికి ఓ గూడు, కడుపు నింపుకోడానికి కూడు లేకపోయినా ముంబైలోని అజాద్ మైదాన్ గ్రౌండ్ పక్కనే ఉంటూ ఎదిగాడు. గ్రౌండ్ సమీపంలోని ముస్లిం యునైటెడ్ క్లబ్‌కు కాపలాగా ఉండే వాచ్‌మెన్ టెంట్‌లో తలదాచుకొంటూ, ఓ పానీపూరి దుకాణంలో పని చేసి కడుపు నింపుకున్నాడు.

జూనియర్ స్థాయి నుంచే క్రికెటర్‌గా తన ప్రతిభను చాటుకుంటూ వచ్చాడు. వందా, రెండొందల రూపాయల కోసం ఎగ్జిబిషన్ మ్యాచ్‌లు ఆడుతూ క్రికెటర్ కావాలన్న తన జీవితలక్ష్యాన్ని నెరవేర్చుకోడానికి పడరాని పాట్లు పడ్డాడు. స్థానిక లీగ్ మ్యాచ్‌లు ఆడుతున్న సమయంలోనే యశస్విలోని అపార ప్రతిభను.. ఆ ప్రాంతంలోనే ఓ క్రికెట్ అకాడమీని నడుపుతున్న శిక్షకుడు జ్వాలాసింగ్ గుర్తించి చేరదీశారు. తన నివాసంలోనే ఆశ్రయం కల్పించి చక్కటి ఆటగాడిగా తీర్చిదిద్దారు. 12 సంవత్సరాల చిరుప్రాయంలోనే యశస్వి ఏ-డివిజన్ లీగ్ బౌలర్లను అలవోకగా, నిర్భయంగా ఎదుర్కొని పరుగులు సాధించిన తీరు తనను కట్టిపడేసిందని, యశస్విలోని ప్రతిభను ఆ క్షణంలోనే తాను గుర్తించానని జ్వాలా సింగ్ చెప్పారు.



స్కూలు క్రికెట్ లీగ్ మ్యాచ్‌లు ఆడుతూ యశస్వి బ్యాటర్‌గా 319 పరుగుల నాటౌట్, బౌలర్‌గా 99 పరుగులకు 13 వికెట్ల రికార్డు సాధించడం ద్వారా లిమ్కా బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు సంపాదించాడు. గత మూడు సంవత్సరాల కాలంలో యశస్వి 51 శతకాలు బాదడంతో పాటు 200 వికెట్లు పడగొట్టాడు. వివిధ టోర్నీలలో రాణించడం ద్వారా ముంబై అండర్-16, భారత అండర్-19 జట్లలో చోటు సంపాదించాడు. ఢాకా వేదికగా జరిగిన అండర్-19 ఆసియా కప్ టోర్నీలో శతకంతో మెరుపులు మెరిపించాడు. అండర్-19 ప్రపంచ కప్‌లో సైతం యశస్విని అడ్డేలేకుండా పోయింది. పాల్గొన్న ప్రతి మ్యాచ్‌లోనూ నిలకడగా రాణించిన యశస్వి ఆ తర్వాత మరి వెనుదిరిగి చూసింది లేదు. దేశవాళీ, రంజీ, లిస్ట్-ఏ, అండర్-19, ఐపీఎల్.. ఇలా అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోడం ద్వారా నేరుగా భారత టెస్టు జట్టులో చోటు సంపాదించాడు.

గత సీజన్ రంజీ విజేత మధ్యప్రదేశ్‌తో జరిగిన ఇరానీ కప్‌లో రెస్టాఫ్ ఇండియా తరఫున బరిలోకి దిగిన యశస్వి రెండు ఇన్నింగ్స్‌ల్లో భారీ స్కోర్ల (213, 144)తో విజృంభించాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో ఇప్పటి వరకు 80.21 సగటుతో పరుగులు రాబట్టిన జైస్వాల్.. ఐపీఎల్ 16వ సీజన్‌లోనూ సత్తాచాటాడు. లీగ్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన (13 బంతుల్లో) అర్ధశతకం నమోదు చేసి ఔరా అనిపించాడు. 2023 ఐపీఎల్‌లో శతకం బాదడం ద్వారా అత్యంత పిన్న వయసులో సెంచరీ సాధించిన నాలుగో బ్యాటర్‌గా రికార్డుల్లో చేరాడు.

టెస్టు అరంగేట్రంతోనే శతకం

వెస్టిండీస్‌తో డొమనికా వాండరర్స్ పార్క్ వేదికగా టెస్టు అరంగేట్రం చేసిన యశస్వి తన తొలి మ్యాచ్‌లోనే భారీ సెంచరీ సాధించాడు. కెప్టెన్ రోహిత్ శర్మతో కలసి మొదటి వికెట్‌కు 229 పరుగుల భాగస్వామ్యం నమోదు చేయడం ద్వారా సంచలనం సృష్టించాడు. 171 పరుగుల భారీ స్కోరు సాధించాడు. టెస్టు అరంగేట్రం మ్యాచ్‌లోనే సెంచరీ బాదిన భారత 17వ క్రికెటర్‌గా యశస్వి జైశ్వాల్ రికార్డుల్లో చేరాడు.

విదేశీగడ్డపై టెస్టు అరంగేట్రం మ్యాచ్‌లోనే శతకం బాదిన భారత 7వ బ్యాటర్‌గా, గత 13 సంవత్సరాలలో భారత తొలి క్రికెటర్‌గా యశస్వి రికార్డుల్లో చేరాడు. 2010 సిరీస్‌లో శ్రీలంక గడ్డపై సురేశ్ రైనా అరంగేట్రం టెస్టు శతకం నమోదు చేసిన తర్వాత.. కరీబియన్ గడ్డపై యశస్వి అదే రికార్డును అందుకోగలిగాడు.

యశస్వి జైశ్వాల్.. 21 సంవత్సరాల వయసుకే అంతర్జాతీయ క్రికెటర్‌గా ఎదగటం, టెస్టు క్రికెట్ అరంగేట్రంలోనే భారీశతకం బాదటం భారత క్రికెట్ విజయగాథల్లో ఒకటిగా మిగిలిపోతుంది. అన్నట్లు.. యశస్వి ఐపీఎల్‌లో సీజన్‌కు 4 కోట్ల రూపాయల వేతనంపై రాజస్తాన్ రాయల్స్‌కు ఆడుతూ తన కుటుంబానికే పెద్దదిక్కుగా నిలిచాడు. ★

క్రీడా కృష్ణ, 84668 64969
సీనియర్ జర్నలిస్ట్

పంచాయితీలకు ఎన్నికలు కావచ్చు, శాసనసభ, లోక్‌సభ.. ఎన్నిక ఏదైనా అక్కడ హింస షరా మామూలే. రక్తపాతం, చావులు సర్వసాధారణమే. కొద్దిరోజుల క్రితం జరిగిన పశ్చిమ బెంగాల్ పంచాయితీ ఎన్నికలూ ఇదే నిరూపించాయి. భారీ హింస చెలరేగింది. 60 మంది మరణించారు. వందమందికిపైగా గాయపడ్డారు. తృణమూల్ కాంగ్రెస్ దుండగులు యథేచ్ఛగా పోలింగ్‌బూత్‌లను ఆక్రమించారు. ఎవరో ఆరోపించనక్కరలేదు. ఆ పార్టీని దుండగులు, హంతకుల పార్టీగా సాక్షాత్తు కోర్టులే ఎప్పుడో తేల్చాయి. ఎప్పటిలాగే టీఎంసీ గూండాలు బీజేపీ, కాంగ్రెస్, వామపక్ష కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. ఇంత చేసి, దేశ ప్రజల చేత ఛీకొట్టించుకుని ఎన్నికల్లో పైచేయి అనిపించుకున్నా, గత రక్తపాతంతో పోలిస్తే టీఎంసీకి ఓట్లు, సీట్ల శాతం తగ్గిన సంగతి గమనించాలి. బీజేపీ రెండో స్థానంలో నిలిచినా గత పంచాయితీ, అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఓట్లు, సీట్లపరంగా గణనీయమైన పురోగతిని సాధించింది. కాంగ్రెస్-లెఫ్ట్ ఫ్రంట్ ఉమ్మడిగా పోటీ చేసి, ఫలితాల వరసలో మూడు, నాలుగు స్థానాలకే పరిమితమయ్యాయి.

ఈ పంచాయితీ ఎన్నికల్లో తృణమూల్ గెలిచింది. ప్రజాస్వామ్యం ఓడింది. పశ్చిమ బెంగాల్‌లోని 22 జిల్లాల్లోని 63,229 గ్రామ పంచాయితీ స్థానాలు, 9,730 పంచాయితీ సమితి స్థానాలు, 928 జిల్లా పరిషత్ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో అధికార తృణమూల్‌కు బీజేపీ గట్టి పోటీ ఇచ్చింది. కాంగ్రెస్, వామపక్షాలు సంయుక్త మోర్చా పేరుతో పోటీ చేశాయి. ఇందులో సీపీఐ, ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్, ఫార్వర్డ్ బ్లాక్, ఎన్సీపీ, ఆర్ఎస్‌పీ ఉన్నాయి.

టీఎంసీ రక్తదాహం పోలింగ్ రోజుతోనే తీరలేదు. నిజానికి నామినేషన్ల ప్రక్రియ నుంచే హింసాకాండ మొదలై, ఓట్ల లెక్కింపు రోజు వరకు కొనసాగింది. 55 మంది చనిపోయారని అధికారికంగా చెబుతున్నా, ఆ సంఖ్య 60 దాటిందని తెలుస్తోంది. అనేక జిల్లాల్లో వీధి పోరాటాలు, బూత్‌ల ఆక్రమణ, బ్యాలెట్ బాక్సులకు నిప్పు పెట్టడం, కాల్పులు, బాంబుల మోత, గృహదహనాలు, రాళ్ల విసురుకోవడాలు కనిపించాయి. తమకు వ్యతిరేకంగా ఓటు వేస్తారని భావించిన ప్రజలను టీఎంసీ లక్ష్యంగా చేసుకుంది. పదే పదే తీవ్ర స్థాయిలో హింసాకాండకు దిగింది. పోలింగ్‌కు ముందు రోజు రాత్రి నుంచి హింసాత్మక ఘటనలు తీవ్రమై పోలింగ్ కేంద్రాల్లోనూ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. కూచ్‌బిహార్, ముర్షిదాబాద్, నదియా, దక్షిణ 24 పరగణాలు, ఉత్తర 24 పరగణాలు, బర్ధమాన్, పశ్చిమ మిడ్నాపూర్, బంకురా, బీర్‌భూమ్, బోల్పూర్ మొదలైన చోట్ల ఇదే పరిస్థితి. కూచ్‌బిహార్ జిల్లా దిన్హాటాలో బ్యాలెట్ బాక్సులను దుండగులు ధ్వంసం చేసి, బ్యాలెట్ పత్రాలకు నిప్పంటించారు. బర్నాచినా ప్రాంతంలో బ్యాలెట్ బాక్సుకు స్థానికులు నిప్పంటించారు. ఓ యువకుడు బ్యాలెట్ బాక్సును ఎత్తుకెళ్లిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గెలిచిన సీపీఎం అభ్యర్థులకు ఎన్నికైనట్లు సర్టిఫికెట్లు ఇచ్చే సమయంలో తృణమూల్ గూండాలు వాటిని లాక్కుని, చించివేసినట్లు వార్తలు వచ్చాయి. భావనగర్‌లో మరింత ఘోరం జరిగింది. అక్కడ ఐఎస్ఎఫ్ అభ్యర్థి జెహనారా బీబీ జిల్లా పరిషత్ ఎన్నికల్లో గెలుపొందారు. కానీ తృణమూల్ అభ్యర్థి గెలుపొందినట్లు ప్రకటించడానికి ప్రయత్నాలు జరిగాయి. స్థానికులు తీవ్ర నిరసన వ్యకం చేశారు. దాంతో అర్ధరాత్రి సమయంలో, వారిపై పోలీసులు కాల్పులు జరిపారు. ముగ్గురు అక్కడికక్కడే మరణించారు.

ఈ హింసను అడ్డుకునేందుకు కేంద్ర బలగాలు ప్రయత్నించినా, అది సాగకుండా స్థానిక ప్రభుత్వ యంత్రాంగం, పోలీసులు అధికార టీఎంసీతో కుమ్మక్కవడం కనిపించింది. వామపక్ష ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో సీపీఎం గూండాలు ఏం చేశారో, ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్ చేస్తున్నది అదేనని ఎప్పటి నుంచో ఉన్న అభిప్రాయం. తృణమూల్ కార్యకర్తలు యథేచ్ఛగా ఓట్లు గుద్దుకున్నా సిబ్బంది ప్రేక్షకపాత్ర వహించింది. అడ్డుకుంటే ఏం జరుగుతుందో వారికి తెలుసు. నిర్దాక్షిణ్యంగా చంపేస్తారు. సాక్షాత్తు ఆ రాష్ట్ర హైకోర్టే పంచాయితీ ఎన్నికల హింసపైన ఆవేదన, అభ్యంతరం వ్యక్తం చేసింది. వెంటనే ఎన్నికలను నిలుపుదల చేయాల్సిందిగా రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. అయినా ఎన్నికల తంతు ముగిసింది.

గ్రామీణ ప్రాంతాల్లో దౌర్జన్యకాండ కోసం టీఎంసీకి యంత్రాంగమే ఉంది. ఆ పార్టీ నాయకులు వ్యాపారులతో పాటు సామాన్యులను బెదిరించి పెద్ద ఎత్తున డబ్బు వసూలు చేస్తున్నారు. సంక్షేమ పథకాల నిధులను 'కట్ మనీ' (కమిషన్లు) ద్వారా స్వాహా చేస్తుంటారు. అవినీతిలో నిండా మునిగిన మమతా బెనర్జీ ప్రభుత్వం ఆ సొమ్ముతో క్యాడర్‌ను బలోపేతం చేసుకొని విపక్షాల నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతోంది.

పంచాయితీ ఎన్నికల కోసం 63,000 మంది కేంద్ర రిజర్వు పోలీసులను, దాదాపు 70,000 మంది రాష్ట్ర పోలీసులను మోహరించారు. అయితే, మెజారిటీ బూత్‌లలో కేంద్ర బలగాలు లేకపోవడం, అస్తవ్యస్తమైన మోహరింపే పోలింగ్ నాటి హింసకు ప్రధాన కారణం. 822 కంపెనీల బలగాలను పంపాలని కోరగా.. పోలింగ్ ముగిసే సమయానికి 144 బెటాలియన్లు బెంగాల్‌కు చేరుకోలేదు. బలగాలను రాష్ట్ర ఎన్నికల సంఘం సక్రమంగా మోహరించకపోవడమే సమస్యలకు దారితీసిందని కేంద్రం దళాల సీనియర్ అధికారులు ఆరోపించారు. అయితే హింసను అరికట్టడంలో విఫలమైనందుకు బీజేపీ సహా ప్రతి రాజకీయ పార్టీ బలగాలను నిందిస్తున్నాయి. కోర్టు ఆదేశాలను పాటించడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ కేంద్ర బలగాల కో-ఆర్డినెటర్‌కు బీజేపీ ఎమ్మెల్యే, అసెంబ్లీలో ప్రతిపక్ష

మూలే, గెలుపు మాంసదే

నేత సువేందు అధికారి కోర్టు ధిక్కార కేసు పెట్టారు.

గెలుపే లక్ష్యంతో తృణమూల్ కార్యకర్తలు బీజేపీ అభ్యర్థులు, నాయకులు కార్యకర్తలపై దౌర్జన్యాలు సాగించారు. బీర్భూమ్, మాల్దా, ముర్షిదాబాద్, దక్షిణ 24 పరగణాలు, ఉత్తర 24 పరగణాలలో పలుచోట్ల ఇళ్ల ముందు బాంబులు విసిరి భయభ్రాంతులను చేశారు. చోప్రాలో బీజేపీ అభ్యర్థులను కనీసం నామినేషన్ కూడా వేయనీయలేదు. ఫలితాలు వెలువడిన తర్వాత టీఎంసీ గూండాలు బీజేపీ కార్యకర్తలపై దాడులకు దిగారు. దీంతో ఆ పార్టీ కార్యకర్తలు తమ ఇళ్లు ఖాళీ చేసి బీజేపీ కార్యాలయాల్లో ఆశ్రయం పొందాల్సి వచ్చింది. అసన్‌సోల్‌లోని బీజేపీ కార్యాలయంలో వెస్ట్ బుర్ద్వాన్ జిల్లాతో పాటు బరాబని, నలాన్‌పూర్, జమూరియా, రాణిగంజ్ ప్రాంతాల కార్యకర్తలకు ఆహారం, వసతిని సమకూర్చారు. వీరు ఎప్పుడు తిరిగి ఇళ్లకు వెళ్లగలరో తెలియదని పార్టీ నేతలు తెలిపారు.

పశ్చిమ మేదినీపూర్‌లోని పార్టీ కార్యాలయంలో దాదాపు 500మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు ప్రాణాలు కాపాడుకునేందుకు ఆశ్రయం పొందారు. వీరిలో జిల్లా పరిషత్, పంచాయతీ సమితి, గ్రామ పంచాయతీ సభ్యులు ఉన్నారు. తాను నామినేషన్ వేసినప్పటి నుంచీ అనేక సార్లు టీఎంసీ గూండాలు దాడికి ప్రయత్నించారని పంచాయితీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన సోలీమాన్‌ఖాన్ తెలిపారు. గ్రామాల్లో తమ తల్లి దండ్రుల భద్రతపై జిల్లా బీజేపీ యువమోర్చా కార్యదర్శి శుభంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలపై హైకోర్టులో కేసు వేస్తామని బెంగాల్ బీజేపీ నేతలు తెలిపారు.

బెంగాల్ తాజా పరిణామాలపై కేంద్రం దృష్టి సారించింది. గవర్నర్ సీవీ ఆనంద్‌బోస్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిసి బెంగాల్ పంచాయతీ ఎన్నికల్లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై నివేదికను సమర్పించారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ సిన్హా తన విధులను నిర్వర్తించడంలో విఫలమయ్యారని గవర్నర్ ఆరోపించారు. 'మనం పేదరికాన్ని చంపాలి, కానీ పేదలు చనిపోతున్నారు' అని ఈ ఎన్నికల నిర్వహణపై గవర్నర్ ఆనంద్‌బోస్ నిరాశను వ్యక్తం చేశారు. ఈ హింసాకాండను పరిశీలించేందుకు బీజేపీ సీనియర్ నాయకుడు రవిశంకర్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యుల నిజనిర్ధారణ కమిటీ బెంగాల్‌లో పర్యటించింది. హింసాత్మక ఘటనలు ఎక్కువగా జరిగిన కూచ్‌బెహార్‌లోని దిన్హాటాతో పాటు ఉత్తర 24 పరగణాలు, దక్షిణ 24 పరగణాలను సందర్శించి వాస్తవాలు తెలుసుకుంది. ఈ సందర్భంగా రవిశంకర్ ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు ఆలోచింపచేస్తాయి. రాష్ట్రంలో జరిగే ప్రతి ఎన్నికలకు కోర్టు జోక్యం చేసుకోవాల్సి వస్తోందని ఆయన గుర్తు చేశారు. వివక్షాల విజేతలను టీఎంసీలో చేరాలని ముఖ్యమంత్రి మమత కోరడం సిగ్గుతో తలదించుకోవలసిన అంశమని అన్నారు. అసలు ఎవరు గెలిచినా టీఎంసీలో చేరితేనే సర్టిఫికెట్ ఇస్తామనడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే అన్నారు ఇటీవలి ఉత్తరప్రదేశ్ స్థానిక ఎన్నికల్లో బీజేపీ క్లీన్‌స్వీప్ చేసినా ఎక్కడా హింసాత్మక ఘటనలు జరగలేదని రవిశంకర్‌ప్రసాద్ గుర్తు చేశారు. రాహుల్ సహా, కాంగ్రెస్ నేతలు బెంగాల్ హింసపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

నిజానికి బెంగాల్ కాంగ్రెస్ వైఖరి, ఢిల్లీ కాంగ్రెస్ ధోరణి వేర్వేరు. రాష్ట్ర కాంగ్రెస్ మమతా బెనర్జీని దోషిగా తేల్చింది. రాష్ట్ర అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరి పిలుపుతో నిరసన ప్రదర్శనలు జరిగాయి. జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా హింసను ఖండించారు. ఏ పార్టీనీ నిందించలేదు. సీపీఎందీ ఇదే ద్వంద్వ వైఖరి. పంచాయితీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఆరోపించారు. కానీ తమ వ్యతిరేకత రాష్ట్రానికే పరిమితమని నిర్లజ్జగా ప్రకటించారు.

పంచాయితీ ఎన్నికల్లో బీజేపీ గతంలోకన్నా పుంజుకున్నది. తృణమూల్ కాంగ్రెస్ 2018లో 72 శాతం ఓట్లు సాధిస్తే ఈసారి దాని బలం 51 శాతానికి పడిపోయింది. అప్పుడు 38,118 గ్రామపంచాయితీలను గెలుచుకుంటే ఈసారి 35,606కి పరిమితమైంది. ఆ ఎన్నికల్లో (2018) బీజేపీ 13 శాతం ఓట్లు సాధిస్తే, ఈసారి 23 శాతానికి బలం పెంచుకుంది. గతంలో 5,779 గ్రామ పంచాయితీలను గెలుచుకుంటే ఈసారి 9,756 గ్రామాల్లో బీజేపీ పాగా వేసింది. సంయుక్త మోర్చా (వామపక్షాలు, కాంగ్రెస్ కూటమి) 6,822 గ్రామపంచాతీలు గెలుచుకొని మూడోస్థానంలో నిలిచింది. ఇందులో సీపీఎం మూడు వేలకు పైగా గెలుచుకోగా, మిగతా చోట్ల కాంగ్రెస్ ఇతర కూటమి పక్షాలు గెలిచాయి.

పంచాయితీ సమితిలకు జరిగిన ఎన్నికల్లో టీఎంసీ 6,560 చోట్లా, బీజేపీ 1,044 స్థానాల్లో గెలిచింది. సంయుక్త మోర్చాకు 559 సీట్లు వచ్చాయి. ఇక జిల్లా పరిషత్ సీట్లలో టీఎంసీ 877 గెలుచుకుంది. బీజేపీకి 26 రాగా సంయుక్త మోర్చాకి కేవలం 10 దక్కాయి. 2021 అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈ పంచాయితీ ఎన్నికల్లో బీజేపీ పని తీరు మెరుగ్గా ఉంది. అప్పటితో పోలిస్తే ఈసారి బీజేపీ ఓట్లు దాదాపు 10 నుంచి 11 శాతం పెరిగాయి. పంచాయితీ ఎన్నికలపై కోర్టు తీర్పును పరిశీలించి గెలుపొందిన బీజేపీ అభ్యర్థులకు ఇంటింటికీ వెళ్లి అభినందనలు తెలియజేయాలని నిర్ణయించారు. జూలై 25వ తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వచ్చే నెలలో మళ్లీ రాష్ట్రాన్ని సందర్శించనున్నారు.

తాజా పంచాయితీ ఎన్నికల్లో మమతా బెనర్జీ ఏకపక్ష విజయం కోసం ప్రయత్నించినా సాధ్యం కాలేదు. దీంతో జాతీయస్థాయిలో ప్రతిపక్ష కూటమికి నాయకత్వం వహించి ప్రధాని పదవి చేపట్టాలనే ఆశలు గల్లంతయ్యాయి. 2024 లోక్‌సభ ఎన్నికలలో మునుపటికన్నా ఎక్కువ సీట్లు దక్కించు కునేందుకు బీజేపీ ప్రణాళికలను సిద్ధం చేసుకుంటోంది. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై ఆరోపణలు ఎక్కువయ్యాయి. ఎస్ఎస్‌సీ, బొగ్గు స్మగ్లింగ్ కేసుల్లో టీఎంసీ నేతలు అరెస్ట్ అయ్యారు. మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీని సీబీఐ ప్రశ్నిస్తోంది. ఈ పరిణామాలు బీజేపీకి కలిసివస్తాయని చెప్పక తప్పదు.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

తెలుసుకుందాం

లక్ష్మీనరసింహాస్వామి ఆలయం- బెజ్జంకి

సిద్ధిపేట జిల్లా, బెజ్జంకిలో ఈ ఆలయం కొలువుదీరింది. నల్లని ఏకశిలపై లక్ష్మీనరసింహ స్వామి భక్తులకు దర్శనమిస్తారు. కాకతీయుల కాలంలో దీనిని నిర్మించినట్లుగా చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. ఆలయంపైనున్న గోపిక నృత్యాలు, త్రిమూర్తుల విగ్రహాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. చైత్ర శుద్ధ సప్తమి నుండి పౌర్ణమి వరకు పన్నెండు రోజుల పాటు ఇక్కడ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి.

కథ

రాజుగారి భార్యలు

ఒక రాజుగారికి ఇద్దరు భార్యలు. పెద్ద భార్య అందంగా ఉండేది కాదు కానీ, గుణవంతురాలు. చిన్న భార్య దుష్టురాలైనా చాలా అందంగా ఉండేది.

రాజుకు చిన్న భార్య అంటేనే ఇష్టం. ఓసారి ఆమె చెప్పుడు మాటలు విని పెద్ద భార్యను ఇంట్లో నుంచి వెళ్లగొట్టాడు.

ఆమె ఏడ్చుకుంటూ అడవిలోకి వెళ్లింది. అక్కడ పేదరాశి పెద్దమ్మ కనిపించి ఇంటికి తీసుకెళ్లి ఆమె కథ అడిగింది. ఆమె జరిగిందంతా చెప్పింది.

పెద్దమ్మ ఆమెను ఓదార్చి స్నానానికి వేన్నీళ్లు చన్నీళ్లు పెట్టింది. ఆమె చన్నీళ్లతో స్నానంచేసి వేన్నీళ్లు పెద్దమ్మకు ఉంచింది. పాత చీర, కొత్త చీర ఇచ్చింది పెద్దమ్మ. ఆమె పాత చీర కట్టుకుంది. కొత్త చీరను పెద్దమమకు ఉంచింది.

పాత కంచం కొత్త కంచం, వేడన్నం, చద్దన్నం పెట్టింది పెద్దమ్మ.

ఆమె పాత కంచంలో చద్దన్నం తిని పెద్దమ్మకు వేడి అన్నం అట్టే పెట్టింది.

పడుకోడానికి చాప, మంచం చూపిస్తే ఆమె చాపమీద పడుకుని మంచం పెద్దమ్మకు ఇచ్చింది.

మర్నాడు పెద్దమ్మ ఆమెకు మూడు అరటి పండ్లు ఇచ్చి, మూడుసార్లు చెరువులో మునగమని చెప్పింది. ఆమె ఒకటి తిని, ఒకటి పెద్దమ్మకు ఇచ్చి మరొకటి ఆవుకి పెట్టింది. చెరువులో మూడుసార్లు మునిగింది.

అంతే ఆమె అందాల బొమ్మగా మారింది. రాజు వద్దకు వెళితే రాజు ఆమెను దగ్గరకు చేర్చుకుని చిన్న

పద్యం

ఏఱుకుమీ కసుగాయలు
దూఱుకుమీ బంధుజనుల దోషము సుమ్మీ
పాఱుకుమీ రణమందున
మీఱుకుమీ గురువులాజ్ఞ మేదిని సుమతీ!

భావం : ఓ సుమతీ! నేలమీద పచ్చికాయలను ఏరి తినకుము, చుట్టములను తిట్టవద్దు, యుద్ధమునందు వెనుతిరిగి పోరాదు, పెద్దల ఆజ్ఞను అతిక్రమించరాదు. ఇవన్నియు సమయము చూచి విపత్తులను కల్గించునని భావం.

సూక్తిరత్నం

'న మాతుః పరదైవతమ్'

'న అన్నోదక సమం దానం
న తిథిర్ద్వాదశీ సమా
న గాయత్ర్యాః పరోమంత్రో
న మాతుః పరదైవతమ్'

భావం : అన్నపానీయాల దానానికన్నా గొప్పదిలేదు. ద్వాదశి కన్నా విశిష్ట తిథి, గాయత్రి కన్నా గొప్ప మంత్రం, అమ్మని మించిన దైవం లేదు.

జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

యశస్సు	పులి
యాగం	కల
వ్యాఘ్రం	యజ్ఞం
మోదం	కీర్తి
స్వప్నం	సంతోషం

నిర్వహణ : నయనశ్రీ

భారత స్వాతంత్ర్య సమరయోధులు

అన్నపూర్ణ మహారాణా

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, సామాజిక కార్యకర్త. నవంబర్ 3, 1917న ఒడిశాలో జన్మించారు. పద్నాలుగేళ్ల వయస్సులోనే ఉద్యమంలో చేరారు. క్విట్ ఇండియా, శాసనోల్లంఘన ఉద్యమంలో చురుగ్గా పాల్గొని అరెస్ట్ కూడా అయ్యారు. వినోబా భావే భూదాన్ ఉద్యమంలోనూ పాల్గొన్నారు. డిసెంబర్ 31, 2012న తుదిశ్వాస విడిచారు.

జనరల్ నాలెడ్జ్

1. పశ్చిమ బెంగాల్ ప్రస్తుత ముఖ్యమంత్రి ఎవరు?
2. చెన్నై నగరం ఏ రాష్ట్రానికి రాజధాని?
3. జపాన్ కరెన్సీ ఏది?

సమాధానాలు : 1. మమతా బెనర్జీ; 2. తమిళనాడు; 3. యెన్

మెదడుకు మేత

చారెడు నీళ్లల్లో చామంతి బిళ్ల.. ఏమిటది?

జవాబు : నూనె, నూనెతో నీడ

భార్యను బయటకు తరిమాడు.

చిన్నభార్య గొణుగుకుంటూ అడవిలోకి వెళ్లింది. అక్కడ పేదరాశి పెద్దమ్మ కనిపించి ఇంటికి తీసుకెళ్లి ఆమె కథ అడిగింది.

'నీకెందుకు నా సంగతి. ఆరుస్తావా, తీరుస్తావా?' అంది ఆమె.

పెద్దమ్మ ఆమెకు వేడినీళ్లు, చన్నీళ్లు తోడింది. కొత్త చీర, పాత చీర ఇచ్చింది. ఆమె వేడి నీళ్లతో స్నానంచేసి కొత్త చీర కట్టుకుంది. చద్దన్నం, వేడన్నం తీసుకు వచ్చింది. కొత్త కంచం, పాత కంచం ఇచ్చింది.

ఆమె కొత్త కంచంలో వేడి అన్నం పెట్టుకుంది. పడుకోవడానికి చాప, మంచం చూపిస్తే మంచంపై దర్జాగా పడుకుంది. మర్నాడు పెద్దమ్మ మూడు అరటిపండ్లు ఇచ్చి చెరువులో మూడు సార్లు మునగమంది. ఆమె మూడూ తినేసి మూడుసార్లు చెరువులో మునిగింది.

అంతే, ఆమె అందమంతా పోయి పండు ముసలిగా మారింది. రాజు వద్దకు వెళ్లింది. రాజు ఆమెను పెద్ద భార్యకు దాసిగా ఉంచాడు. ★

మంచిమాట

ఎవరైనా నిన్ను ఒకసారి మోసం చేస్తే ఆ పాపం వారిది.. రెండోసారి కూడా నువ్వు మోసపోతే.. ఆ లోపం నీదే!

విందు.. వినోదం... పెండ్లి.. పేరంటం...
అన్నింటా మీ నేస్తం.
క్రేన్
వక్క పలుకులు
వీటికి సాటి మరేవి లేవు
www.craneindia.net
శ్రీ గ్రంధి సుబ్బారావు మరియు శ్రీమతి గ్రంధి లక్ష్మీనరసమ్మ
ఇప్పుడు మీ కోసం సరికొత్త ప్యాకింగ్‌లో సరికొత్త రుచులతో
Taste of India
CRANE
BETEL NUT PIECES
Since 60 Years
₹10/-
SWEET BETEL NUT PIECES
PREMIUM
₹5
TARA ◆ 9044

వారఫలాలు

24-30 జూలై 2023

సింహంభట్ల సుబ్బారావు
6300674054

మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

జీవిత భాగస్వామి ద్వారా ధన, ఆస్తి లాభాలు కలిగే సూచనలు. రాబడి మెరుగు పడుతుంది. నిరుద్యోగుల శ్రమ ఫలిస్తుంది. మీ అంచనాలు నిజం కాగలవు. స్థిరాస్తి వివాదాలు కొలిక్కి వస్తాయి. వ్యాపారులకు లాభాలు. రాజకీయవేత్తలు, కళాకారులు, పరిశోధకులకు శుభవార్తలు. 28, 29 తేదీలలో ఆకస్మిక ప్రయాణాలు. రుణయత్నాలు. శివపంచాక్షరి పఠించండి.

వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

రాబడి సంతృప్తినిస్తుంది. అనుకున్నది సాధించాలన్న పట్టుదల, పెరిగి ముందుడుగు వేస్తారు. ఉద్యోగయత్నాలు కలసివస్తాయి. వ్యాపారస్తులకు లాభాలు. ఉద్యోగస్తులకు అనుకూల వాతావరణం. రాజకీయవేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు సమస్యలు తీరతాయి, 24, 25 తేదీల్లో ఆస్తి వివాదాలు. కుటుంబంలో సమస్యలు. లక్ష్మీస్తోత్రాలు పఠించండి.

మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

ఆదాయం మెరుగుపడుతుంది. కొన్ని నిర్ణయాలు అందర్నీ ఆశ్చర్య పరుస్తాయి. వాహనాలు, భూములు కొనుగోలు యత్నాలు కలసివస్తాయి. కోర్టు కేసుల నుంచి బయటపడతారు. వ్యాపారాలు లాభసాటిగా ఉంటాయి. ఉద్యోగస్తులకు పైస్థాయి నుంచి ప్రోత్సాహం. 26, 27 తేదీల్లో ఆకస్మిక ప్రయాణాలు. కొత్త రుణయత్నాలు. విష్ణుసహస్రనామ పారాయణం చేయండి.

కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

వాహనాలు, భూములు కొంటారు. ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారస్తులకు పెట్టుబడులు సమకూరతాయి. ఉద్యోగస్తులకు విధుల్లో ఆటంకాలు తొలగుతాయి. రాజకీయ, పారిశ్రామికవేత్తలు, కళాకారులకు మరింత ఉత్సాహవంతంగా ఉంటుంది. 27,28తేదీల్లో దూరప్రయాణాలు. శారీరక రుగ్మతలు. కనకదుర్గాదేవి స్తోత్రాలు పఠించండి.

సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఖర్చులు పెరుగుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఇంటి నిర్మాణ యత్నాలు మందగిస్తాయి. శారీరక రుగ్మతలు కొంత బాధిస్తాయి. విలువైన వస్తువులు జాగ్రత్తగా కాపాడుకోండి. వ్యాపారస్తులు సామాన్య లాభాలతో సరిపెట్టుకోవాలి. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలు తప్పకపోవచ్చు. 26,27 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. నవగ్రహ స్తోత్రాలు పఠించండి.

కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

వాహనాలు, ఆభరణాలు కొంటారు. ఆదాయం ఆశాజనకం. కుటుంబంలో శుభకార్యాలపై కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. స్థిరాస్తి ఒప్పందాలు చేసుకుంటారు. ఉద్యోగస్తులకు కొత్త హోదాలకు అవకాశం. రాజకీయవేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు కొత్త అవకాశాలు కొన్ని దక్కవచ్చు. 29,30 తేదీల్లో వృథా ఖర్చులు. అనుకోని ప్రయాణాలు. గణేశాష్టకం పఠించండి.

తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

అనుకున్న కార్యక్రమాలలో విజయం సాధిస్తారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. కోర్టు వ్యవహారాలలో పురోగతి. వ్యాపారస్తులకు లాభాలు. ఉద్యోగస్తులకు విధులు ప్రశాంతంగా సాగుతాయి. రాజకీయ, పారిశ్రామికవేత్తలు, రచయితలకు కొత్త విషయాలు తెలుస్తాయి. 24, 25 తేదీల్లో ఖర్చులు అధికం. శారీరక రుగ్మతలు. శ్రీరామస్తోత్రాలు పఠించండి.

వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆదాయం సమృద్ధిగా ఉంటుంది. ఆస్తుల వివాదాలు కొలిక్కి వస్తాయి. ఇంటి నిర్మాణయత్నాలు సానుకూలమవుతాయి. నిరుద్యోగులు ఎంతోకాలం ఎదురుచూస్తున్న అవకాశం దగ్గరకు వస్తుంది. ఉద్యోగస్తులకు విధుల్లో అవాంతరాలు తొలగుతాయి. 25,26 తేదీల్లో దూరప్రయాణాలు. ఒప్పందాలు వాయిదా. శివాష్టకం పఠించండి.

ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

మీ ఖ్యాతి మరింత పెరుగుతుంది. ఒక సమాచారం సంతోషం కలిగిస్తుంది. వాహనాలు, భూములు కొంటారు. యుక్తితో వివాదాల నుంచి గట్టెక్కుతారు. వ్యాపారస్తులకు లాభాలు అందుతాయి. ఉద్యోగస్తులకు కొత్త హోదాలు దక్కే సూచనలు. 27, 28 తేదీల్లో వృథా ఖర్చులు. ఆరోగ్యసమస్యలు. ఆకస్మిక ప్రయాణాలు. హనుమాన్ ఛాలీసా పఠించండి.

మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

చేపట్టిన కార్యక్రమాలు విజయవంతంగా పూర్తి చేస్తారు. నూతన ఉద్యోగావకాశాలు. దక్కుతాయి. వాహనాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వ్యాపారులకు లాభాలు. ఉద్యోగస్తులకు విధుల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. రాజకీయవేత్తలు, కళాకారులు, క్రీడాకారులకు గుర్తింపు. 24, 25 తేదీల్లో శారీరక రుగ్మతలు. బంధువిరోధాలు. ఆదిత్య హృదయం పఠించండి.

కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

ఆదాయ వ్యయాలు సమానంగా ఉన్నా అవసరాలు తీరతాయి. స్థిరాస్తి వివాదాలు పరిష్కార దశకు చేరతాయి. వాహనసౌఖ్యం. వివాహ, ఉద్యోగ యత్నాలు సానుకూలం. ఉద్యోగస్తులకు పనిఒత్తిడులు తగ్గవచ్చు. పారిశ్రామికవేత్తలు, కళాకారులు, రచయితలకు కార్యసిద్ధి. 25, 26 తేదీల్లో శారీరక రుగ్మతలు. బంధువుల నుంచి ఒత్తిడులు. ఆంజనేయ దండకం పఠించండి.

మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

అనుకున్న ఆదాయం సమకూరి అవసరాలు తీరతాయి. పలుకుబడి మరింత పెరుగుతుంది. పనుల్లో అవాంతరాలు తొలగుతాయి. దేవాలయాలు సందర్శిస్తారు. భూవివాదాలు పరిష్కారమవుతాయి. వాహనాలు, ఆభరణాలు కొంటారు. ఉద్యోగులకు అనుకున్న హోదాలు. 27, 28 తేదీల్లో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. ప్రయాణాలు వాయిదా. లక్ష్మీనృసింహ స్తోత్రాలు పఠించండి.

పదరసం-425

ఆధారాలు

అడ్డం

1. ఎండమావి (4)
3. దేవతలకు రుషి (3)
6. తమిళనాడు, కర్ణాటకలో పారే నది (3)
7. శివుడి ఆజ్ఞ లేనిదే ఇది కూడా కుట్టదట (2)
8. నిద్రలో వచ్చేది (2)
10. మత్స్య వేటగాడు (3)
12. అసలు కన్నా ఇది ముద్దట (2)
13. కన్నయ్యను చంపాలనుకుని కన్నుమూసింది (3)
15. మరణంలో యుద్ధం (2)
18. జనము చెల్లాచెదరయ్యారు (3)
19. అలనాటి పిల్లల పత్రిక, పాప (2)
20. ఎల్లప్పుడు (2)
21. రాక్షసికి వికృతి (3)
23. ఒక ఫలం..పనస కాదు..(3)
24. ఇది కనకంలా మౌని కాదట (2)
26. తమిళ భోజనం (3)
28. తెల్లని కలువ (3)
30. ఈమె కవయిత్రి...రామాయణం రాసింది (2)
31. రంగము తిరగబడింది (3)

నిలువు

1. నేల, మట్టి (3)
2. దీనికి మించిన సంపద లేదంటారు(2)
3. దేవుడి సతి (3)
4. ఒక ఆహారధాన్యం (2)
5. సుకుమార వనిత (3)
6. శంకరాచార్య జన్మస్థలం (3)
9. ఉప్పు (3)
11. తెలుగులో మహాభాగవత కర్త (3)
14. బహుమానం (4)
15. సుమారు, దాదాపు (4)
16. భూమి, భూలోకం (2)
17. ప్రమాణం, శపథం (2)
19. వధూవరుల నుదుట అలంకరించేది (3)
22. గౌరవ వాచకం (1)
23. కుచేలుడు మిత్రుడికి ఇచ్చిన కానుక (4)
25. బంధువే (3)
26. సంసారాన్ని దీనితో పోలుస్తారు (3)
27. అబద్ధం, అసత్యం (2)
29. హారం,మాల (2)

మా చిరునామా : పదరసం, జాగృతి వారపత్రిక, 3-4-228/4/1, కాచిగూడ, హైదరాబాద్-27



పదరసం - 425

పేరు : .....

చిరునామా:.....

.....

పిన్‌కోడ్ : ..... మొబైల్ : .....

సమాధానాలను పైగదులలో పూరించి, కత్తిరించి కవర్‌పై పదరసం నెం. వేసి 2023 ఆగస్టు 7 లోగా జాగృతికి పంపండి. సరైన సమాధానాలు రాసిన వారిని విజేతలుగా ప్రకటిస్తాం. ఒకరిని లాటరీ ద్వారా ఎంపికచేసి నగదు బహుమతి అందచేస్తాం. తుది నిర్ణయం జాగృతి యాజమాన్యందే.

పదరసం - 420 సమాధానాలు



విజేతలు: సి. మురళి, ముదిగంటి విష్ణువర్ధన్‌రెడ్డి, జనమంచి ముకుందము, ఆర్.అంజనీదేవి, చెరుకు పల్లవీ మహేశ్, కె.వి.ఎస్.ఎన్.గణేష్‌కుమార్, టిఎస్ఆర్ ఆంజనేయులు, వై.హనుమంతరావు, బి.రామచంద్ర మూర్తి, మత్స్యరాజ విజయలక్ష్మి, ఎమ్.శ్రీనివాస్, డా.బి. ధన్వంతరి, తం. మమన్‌బాబు, ఎం.జంగయ్య, పి.శాంత కుమారి, ఎస్.భావ్యశ్రీ, ఆడారిలక్ష్మి, బి.నాగమణి, యర్ర మిల్లి విజయలక్ష్మి, యం.శాంతి ప్రభాకర్, తిమ్మవరపు వెంకటసాయి, పులికంటి రాజేశ్వర్‌రావు, వారణాసి సరస్వతి, విష్ణుచేతన, భాస్కరయ్య, ఆర్.ఎస్.పి.కౌముది

ఈ వారం విజేత : శ్రీధర్ కులకర్ణి, కామారెడ్డి

దర్శకుడు సాయి రాజేశ్‌కు సైటైరికల్ మూవీస్ తీయడంలో అనుభవం ఉంది. సినిమా రంగంలోని అతిని... అతిగానే చూపిస్తూ అప్పుడెప్పుడో ఆయన 'హృదయకాలేయం' అనే సినిమాను స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. దానితోనే సంపూర్ణేశ్ బాబు హీరోగా పరిచయం అయ్యాడు. అతనికి 'బర్నింగ్ స్టార్' అనే బిరుదు ఇవ్వడంతోపాటు దర్శకుడు సాయిరాజేశ్ తన స్క్రీన్ నేమ్‌ను స్టీవెన్ శంకర్ అని పెట్టుకున్నాడు. ఆ సినిమా ఓ స్థాయిలో ప్రేక్షకాదరణ పొందింది. దాంతో రెండో సినిమాగా మూవీల్లోని ఓవర్ ఫ్యామిలీ సెంటిమెంట్ పై సెటైర్ గా 'కొబ్బరిమట్ట' తీశాడు. భారీ అంచనాలతో వచ్చిన ఈ సినిమా పెద్దంతగా జనాలను ఆకట్టుకోలేదు. ఇక అతను నిర్మాతగా 'కలర్ ఫోటో' మూవీని సందీప్ రాజ్ దర్శకత్వంలో నిర్మించాడు. ఇది ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా జాతీయ అవార్డును అందుకుంది. తాజాగా సాయిరాజేశ్ దర్శకత్వంలో ఎస్.కె.ఎన్. నిర్మించిన సినిమా 'బేబీ'. గత శుక్రవారం ఈ సినిమా జనం ముందుకు వచ్చింది.

చౌకబారు ప్రేమకథా చిత్రం

గొప్ప కథా చిత్రాలు విజయం సాధించాలని లేదు. విజయం సాధించిన ప్రతి సినిమా గొప్పదను కోవడానికీ లేదు. కొన్ని సినిమాలు కథతో సంబంధం లేకుండా ఆడేస్తుంటాయి. కథనంలోని కొత్తదనం దానికి కారణం కావచ్చు. అలానే కొన్ని సినిమాల కథనం గొప్పగా లేకపోయినా... కథాబలంతో ఆడేస్తుంటాయి. చిత్రం ఏమంటే ఇటీవల విడుదలైన 'బేబి' సినిమా కథలో కానీ కథనంలో కానీ కొత్తదనం లేదు. అయినా ఈ తరం యువత దానికి కనెక్ట్ కావడంతో 'బేబీ' ఆడేస్తోంది. తొలి వారాంతంలో ఈ మూవీ 30 కోట్లకు పైగా గ్రాస్‌ను వసూలు చేసిందని నిర్మాతలు చెబుతున్నారు.

వైష్ణవి (వైష్ణవి చైతన్య) దిగువ మధ్యతరగతి అమ్మాయి. బాగా డబ్బులు సంపాదించాలని, అందంగా తయారు కావాలని, కార్లల్లో తిరగాలని, అందరూ తనకు కానుకలు ఇవ్వాలని కలలు కంటూ ఉంటుంది. టెన్త్ క్లాస్‌లోనే ఎదురింటిలో ఉండే తన క్లాస్ మేట్ ఆనంద్ (ఆనంద్ దేవరకొండ)తో ప్రేమలో పడుతుంది. అది గ్రహించి ఆనంద్ కూడా ఆమె అంటే ఇష్టపడతాడు. అయితే... తండ్రిలేని ఆనంద్ చదువు ఆపేసి ఆటో డ్రైవర్‌గా స్థిరపడిపోతాడు. తాగుబోతు అయినా, వైష్ణవి తండ్రి ఆమెకు డొనేషన్ కట్టి మరీ ఇంజనీరింగ్ కాలేజీలో చేర్పిస్తాడు. దాంతో వైష్ణవి తనకు ఎక్కడ దూరమై పోతుందోననే అభద్రతాభావం ఆనంద్‌లో చోటు చేసుకుంటుంది. ఆమెకు దగ్గర ఉండాలనే ఆలోచనతో వేల రూపాయలు ఖర్చు చేసి సెల్ ఫోన్ కొనిస్తాడు. అయితే, అతను భయపడినట్టుగానే కాలేజీలో చేరగానే ఉన్నత వర్గాల వారి ట్రాప్‌లో వైష్ణవి పడిపోతుంది. పబ్ కల్చర్‌కు అలవాటు పడుతుంది. విరాజ్ అనే క్లాస్ మేట్‌తో స్నేహం కారణంగా ఆమె ఆనంద్‌కు మరింత దూరం అవుతుంది. మరి ఒకరిని ఒకరు ప్రేమించుకుం టున్నామని భావించే ఈ ముగ్గురి జీవితాలు ఎలాంటి మలుపులు తిరిగాయన్నదే 'బేబీ' కథ.

ప్రేమ పేరుతో ఇవాళ యువత తమని తాము ఎలా మోసం చేసుకుంటోందో చెప్పే ప్రయత్నాన్ని దర్శకుడు సాయి రాజేశ్ ఈ సినిమా ద్వారా చేశాడు. అపరిమితమైన కోరికలు అమ్మాయిలను ఎలా తప్పుదోవ పట్టిస్తున్నాయో చూపించాడు. దానికి ఉదాహరణగా వైష్ణవి పాత్రను తీర్చిదిద్దాడు. అలానే గుడ్డి ప్రేమతో తల్లిని కూడా నిర్దక్షిణ్యం చేసిన కుర్రాళ్లకు ఎలాంటి గతి పడుతుందో ఆనంద్ పాత్ర ద్వారా చెప్పే ప్రయత్నం చేశాడు. ప్రేమ, వ్యామోహాల మధ్య తేడా తెలియకుండా ఎలాగైనా తాను ప్రేమించిన అమ్మాయిని దక్కించుకోవాలనే తాపత్రయపడే వ్యక్తిగా విరాజ్‌ను చూపించారు. ఈ ముగ్గురు మీదే సినిమా అంతా సాగుతుంది. మొత్తం కథలో అతి బలహీన మైన పాత్ర ఏదంటే వైష్ణవిదే. దర్శకుడు మహిళా పక్షపాతిలా కొన్ని సన్నివేశాలలో వ్యవహరించినా... ప్రేమ విషయంలో రాజీ పడిపోయేది వాళ్లే అన్నట్టుగా చూపించాడు. మగవాళ్లకు సిన్సియారిటీ ట్యాగ్ లైన్ కట్టే పని చేశాడు. దాంతో కుర్రాళ్లు ఈ సినిమాతో బాగానే కనెక్ట్ అవుతున్నారు. చిత్రం ఏమంటే... యువత మనోభావాలను తెరకెక్కించే క్రమంలో దర్శకుడు రాసిన సంభాషణలు చాలా దారుణంగా ఉన్నాయి. ముఖ్యంగా ఆనంద్ దేవరకొండతోనూ, వైష్ణవితోనూ చెప్పించిన సంభాషణలు కర్ణకఠోరంగా అనిపిస్తాయి. కేవలం యువతతో చప్పట్లు కొట్టించుకోవడం కోసం రాసిన డైలాగ్స్‌లా ఉన్నాయి తప్పితే మరొకటి కాదు. నిజంగా దర్శకుడికి మహిళల పట్ల సానుభూతి ఉంటే... అలాంటి సంభాషణలు రాయడు.

నటీనటుల విషయానికి వస్తే... ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్ పాత్రోచితంగా నటించారు. అయితే వీరిద్దరిని తన నటనతో వైష్ణవి చైతన్య డామినేట్ చేసింది. ఆమె టిపికల్ మెంటాలిటీ ఉన్న అమ్మాయిగా బాగా చేసింది. నటనలో పెద్దగా అనుభవం లేని ఈ ముగ్గురితో మూడు గంటల సినిమాను తీయడం ఓ రకంగా సాహసమనే చెప్పాలి. దాంతో కొన్ని సన్నివేశాలు పేలవంగానూ ఉన్నాయి. చాలా సన్నివేశాలు పాత తమిళ సినిమాల వాసన కొట్టాయి. ఇతర ప్రధాన పాత్రలను నాగబాబు, లిరీష, ప్రభావతి, వైవా హర్ష, కుసుమ, సీత, మౌనిక తదితరులు పోషించారు. విజయ్ బుల్గానిన్ నేపథ్య సంగీతం, బాణీలు సినిమా నిడివిని తెలియనీయ కుండా చేశాయి. అలానే సినిమాటోగ్రఫీ కూడా బాగుంది.

మేకింగ్ పరంగా ఎస్.ఎన్.కె. రాజీ పడలేదనేది తెలుస్తోంది. కానీ ఇలాంటి చౌకబారు ప్రేమకథలను తెరకెక్కించి దర్శక నిర్మాతలు డబ్బులు సంపాదించు కోలగరేమో కానీ, సమాజానికి ఏం సందేశం ఇస్తున్నామనేది ఓ సారి ఆలోచించుకోవాలి.

వ్యాసకర్త : సీనియర్ జర్నలిస్ట్

కృషి విజ్ఞాన కేంద్ర సారథులు

టి. వినోద్‌రావు, చైర్మన్,
ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్

డా. శంభాజీ దత్తాత్రేయ నాల్కర్
సీనియర్ సైంటిస్ట్

రవి పాల్తియా
సైంటిస్ట్

ఎం. శ్రీనివాస్
సైంటిస్ట్

ఎం ఉదయ్‌కుమార్
సైంటిస్ట్

డా. జి. భార్గవి
సైంటిస్ట్

ఎం. శ్రీకాంత్
సైంటిస్ట్

డా. ఎన్ ప్రతాప్‌రెడ్డి
సైంటిస్ట్

నిరుడు పంట బాగుంది.. అందుకే మళ్లీ వచ్చాం!

'ఇది మేం పండించిన ధాన్యం సార్! మేమంతా కూడా ఇదే పండించాం!' అక్కడ డబ్బాలో ప్రదర్శన కోసం ఉంచిన ధాన్యపు గింజలు చూపిస్తూ అన్నాడు ఎస్‌కె మహమూద్. మెదక్ జిల్లా నవాబ్‌పేటకు చెందిన రైతు ఆయన. 'ఈయనతో పాటు షేక్ సాబీర్, చాంద్ బాషా, వడ్ల సత్యనారాయణ, సురకంటి పెంటారెడ్డి మరికొందరు రైతులు కూడా వచ్చారు. వీరంతా మళ్లీ కృషి విజ్ఞాన కేంద్రం ఇచ్చే విత్తనాలు తీసుకువెళ్లడానికి వచ్చారు. 'ఆ ధాన్యం తింటేనే బాగుంటుంది. మందులేయకుండా పండించుకున్నాం' అన్నారు వారు. పంట మార్పిడిని బాగా ప్రోత్సహించడం వల్ల వీరు కందులు వేస్తున్నారు. ఆ విత్తనాలు తీసుకు వెళ్లడానికే వచ్చారు. నిరుడు కొంత వర్షాలతో పాడైనా, పంట బాగానే వచ్చింది. అందుకే మళ్లీ వచ్చారు. మళ్లీ కంది విత్తనాలు పట్టుకు వెళ్లారు. నిరుడు, ఇప్పటి వరకు ఈ సంవత్సరం కలిపి మొత్తం 200 కిలోల విత్తనాలు పంచిపెట్టారు. 75 ఎకరాలలో కంది పంట వేశారు. విజ్ఞాన కేంద్రంవారు చెప్పినది తుచ తప్పకుండా పాటిస్తే, శ్రద్ధ తీసుకుంటే మంచి పంట వస్తుందని వారు చెప్పారు. మళ్లీ అందుకే వచ్చామని కూడా అన్నారు. ఈ కేంద్రంతో మా గ్రామానికి ఎంతో ఉపయోగం ఉందని చెప్పారు.

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2021-2023; RNI Regd. No. 3270/57.
Volume : 75 Issue : 40

జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు



వెల : ₹.220/-



వెల : ₹.200/-



వెల : ₹.390/-



వెల : ₹.250/-



వెల : ₹.250/-



వెల : ₹.100/-

వెల : ₹.100/-



వెల : ₹.200/-



వెల : ₹.100/-

వెల : ₹.150/-



వెల : ₹.799/-



వెల : ₹.499/-



వెల :₹.495/-



వెల : ₹.799/-



వెల : ₹.549/-

పై పుస్తకములకు మరియు క్రొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

సాహిత్య నికేతన్ : 3-4-852, కేశవనిలయం, బర్కత్‌పురా, హైదరాబాద్ -27.
040-27563236, 9290127329

సాహిత్య నికేతన్ : ఏలూరు రోడ్, గవర్నరు పేట, విజయవాడ - 2, దూరవాణి : 8333812687